సమావేశము - VII
వాల్యూము - I
నెం. 4

వెల : రూ. 18-50
16 మార్చి, 2017
గురువారం,
(శక సం. 1938,
ఫాల్గుణం - 25)

# తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

## అధికార నివేదిక

విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు - వాగ్రూప సమాధానములు | ... | 1 |
| 2. | సభా సమక్షంలో ఉంచబడిన పత్రాలు | ... | 14 |
| 3. | సభా కార్యక్రమము : వాయిదా తీర్మానాల అనుమతి గురించి | ... | 14 |
| 4. | జీరో అవర్ | ... | 14 |
| 5. | 2017 - 2018 సంవత్సరపు వార్షిక ఆదాయ-వ్యయ పట్టిక (బడ్జెట్)పై - సాధారణ చర్చ (రెండవ రోజు) | ... | 16 |

# తెలంగాణ శాసనసభ
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీ ఎస్. మధుసూదనాచారి |
| ఉప సభాపతి | : | శ్రీమతి ఎం. పద్మా దేవేందర్ రెడ్డి |
| కార్యదర్శి | : | డా. ఎస్. రాజ సదారామ్ |
| సంయుక్త కార్యదర్శి | : | డా.వి. నరసింహాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ టి.బి. జయచందర్ |
| | | శ్రీ ఎస్. దుర్గా ప్రసాద్ |
| | | శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి |
| | | శ్రీమతి వి. ఎన్. ప్రసన్న కుమారి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ పి. శ్రీనివాస్ |

# తెలంగాణ శాసన సభ చర్చలు

## అధికార నివేదిక

## ( ఏడవ సమావేశము – నాల్గవ రోజు)

## గురువారం, మార్చి 16, 2017

(సభ ఉ. గం. 10.00 లకు ప్రారంభమైనది)

(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

### నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానములు

**MR. SPEAKER:-** Question No. 2262

### మహిళా బృందాలకు వడ్డీలేని రుణాలు

ప్రశ్న నెం. 12 (2262)

సర్వశ్రీ/శ్రీమతి జీవన్‌రెడ్డి తాటిపర్తి (జగిత్యాల), అరుణ డి.కె.(గద్వాల) డా. జెట్టి గీత (జహీరాబాద్) – గౌరవనీయులైన పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ. మహిళా సంఘాలను పటిష్టపరచడానికి వడ్డీ రహిత కార్యక్రమాలను అమలుచేస్తున్న విషయం వాస్తవమేనా,

ఆ. గత రెండు సంవత్సరాలుగా బ్యాంకులకు రీయింబర్స్ చేయాలసిన వడ్డీ నిధులు విడుదల కానందున మహిళా సంఘాలు ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయం కూడా వాస్తవమేనా;

ఇ. అట్టి సంచిత వడ్డీ మొత్తాల జిల్లావారీ వివరాలు, ఎప్పటిలోగా వాటిని విడుదల చేయడమవుతుంది?

పంచాయతీ రాజ్ శాఖ మంత్రి (శ్రీ జూపల్లి కృష్ణారావు):– అ. అవునండీ.

ఆ. లేదండి. 2015-16 ఆర్థిక సంవత్సరంలో వడ్డీలేని రుణాల పథకం క్రింద ప్రభుత్వం రూ.378.00 కోట్ల మొత్తాన్ని విడుదల చేసింది. 2017-18 ఆర్థికసంవత్సరంలో రూ. 41.14 కోట్ల మొత్తాన్ని విడుదల చేసింది. రూ. 1245.00 కోట్ల మొత్తానికి బీఆర్ఓని జారీ చేయడమయింది.

ఇ. సంచిత వడ్డీలేని రుణాల వివరాలు జిల్లావారీగా సభా సమక్షంలో వుంచడమయింది. ఆ మొత్తాలను త్వరలో విడుదల చేయడమవుతుంది.

(Rs. in Crores)

| S.No | District Name | 2015-16 Bank Linkage | | 2016-17 Bank Linkage | | 2016-17 Stree Nidhi | | Total Amount |
|---|---|---|---|---|---|---|---|---|
| | | No of SHGs | Amount | No of SHGs | Amount | No of SHGs | Amount | |
| 1 | Adilabad | 8049 | 1.07 | 6992 | 1.88 | 843 | 0.30 | 3.25 |
| 2 | Badradri | 15343 | 5.99 | 15788 | 7.55 | 4284 | 1.84 | 15.38 |
| 3 | Jagitial | 10776 | 7.93 | 11760 | 8.62 | 9673 | 7.54 | 24.09 |
| 4 | Jangaon | 8783 | 6.69 | 9316 | 6.81 | 8787 | 5.49 | 18.99 |
| 5 | Jayashankar | 12414 | 6.15 | 12304 | 7.08 | 4291 | 2.69 | 15.93 |
| 6 | Jogulamba | 5783 | 7.17 | 5188 | 5.68 | 874 | 0.48 | 13.33 |
| 7 | Kamareddy | 14976 | 27.23 | 15655 | 24.64 | 10893 | 6.94 | 58.81 |
| 8 | Karimnagar | 11220 | 9.36 | 12450 | 10.19 | 10305 | 8.49 | 28.04 |
| 9 | Khammam | 20096 | 15.71 | 22784 | 17.91 | 8855 | 4.58 | 38.19 |
| 10 | Komaram Bheem | 5930 | 0.81 | 5006 | 1.47 | 858 | 0.36 | 2.64 |
| 11 | Mahabubabad | 12854 | 6.69 | 13109 | 7.22 | 4806 | 2.67 | 16.58 |
| 12 | Mahabubnagar | 14291 | 24.46 | 14214 | 17.89 | 7845 | 4.46 | 46.81 |
| 13 | Mancherial | 8325 | 4.09 | 10021 | 6.87 | 5901 | 3.95 | 14.91 |
| 14 | Medak | 4611 | 17.27 | 11754 | 22.63 | 6703 | 5.13 | 45.03 |
| 15 | Medchal-Malkajgiri | 6946 | 13.41 | 6654 | 11.61 | 3265 | 1.81 | 26.83 |
| 16 | Nagarkurnool | 8134 | 14.26 | 9173 | 11.51 | 364[illegible] | 1.70 | 27.47 |
| 17 | Nalgonda | 20568 | 36.84 | 22871 | 41.25 | 9511 | 5.16 | 83.25 |
| 18 | Nirmal | 8596 | 2.92 | 9007 | 4.28 | 5591 | 3.91 | 11.11 |
| 19 | Nizamabad | 19620 | 41.29 | 20835 | 40.15 | 17539 | 12.85 | 94.29 |
| 20 | Peddapalli | 10508 | 6.90 | 10297 | 6.93 | 7429 | 5.01 | 18.83 |
| 21 | Rajanna | 7293 | 5.64 | 8024 | 7.41 | 5945 | 4.17 | 17.21 |
| 22 | Rangareddy | 15851 | 38.04 | 17487 | 33.18 | 9363 | 5.24 | 76.46 |
| 23 | Sangareddy | 5925 | 26.99 | 16451 | 36.54 | 9012 | 6.12 | 69.65 |
| 24 | Siddipet | 7063 | 22.24 | 15707 | 29.37 | 12070 | 10.01 | 61.61 |
| 25 | Suryapet | 13523 | 21.91 | 14449 | 24.99 | 5329 | 3.00 | 49.89 |
| 26 | Vikarabad | 11944 | 14.45 | 11323 | 14.00 | 4094 | 1.90 | 30.34 |
| 27 | Wanaparthy | 5495 | 11.97 | 5920 | 8.46 | 3631 | 2.01 | 22.44 |
| 28 | Warangal Rural | 11459 | 8.66 | 12080 | 8.32 | 8511 | 6.40 | 23.37 |
| 29 | Warangal Urban | 5192 | 3.31 | 5296 | 3.92 | 3972 | 2.88 | 10.10 |
| 30 | Yadadri Bhongir | 10915 | 23.92 | 12068 | 24.44 | 7717 | 4.75 | 53.11 |
| | GRAND TOTAL | 322485 | 433.37 | 363983 | 452.78 | 199455 | 131.82 | 1017.96 |

**శ్రీ టి. జీవన్ రెడ్డి : -** అధ్యక్షా, రాష్ట్రంలోని మహిళల ఆర్థిక పరిపుష్టి కొరకు, వారు స్వయంసమృద్ధి సాధించాలనే ఉద్దేశ్యంతో మహిళా గ్రూపులను, డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఆ గ్రూపులకు బ్యాంక్ లింకేజ్ కల్పించి బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించడంతోపాటుగా, వారు పొందిన రుణాన్ని, వారు చెల్లించిన వడ్డీని పూర్తి స్థాయిలో మాఫీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమం గత ప్రభుత్వ హయాం నుండీ కొనసాగుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత, 2015-16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 378 కోట్లు విడుదల చేయడం జరిగిందని మంత్రి గారు పేర్కొన్నారు. 2015-16 లో చెల్లించవలసిన బకాయి రూ. 433 కోట్లు. 2016-17 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 452.78 కోట్లు చెల్లించవలసి ఉండగా, విడుదల చేసింది కేవలం రూ. 41.14 కోట్లు. స్త్రీ నిధికి సంబంధించి రూ. 131.87 కోట్లు విడుదల చేయవలసి ఉంది. మొత్తం రూ. 1117.96 కోట్లు మహిళా గ్రూపులకు ఇవ్వవలసి ఉంది. గత రెండు సంవత్సరాల నుండీ బ్యాంకులకు చెల్లించిన వడ్డీని మహిళా గ్రూపులకు ఇవ్వడం లేదు. 2015-16 సంవత్సరంలో కొంత డబ్బు విడుదల చేశారు. 2016-17 లో అంటే మార్చి చివరి వరకూ రూ. 1245 కోట్లు విడుదల చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. బీఆర్ఓ అనేది ఇంతవరకూ ఆయా సంఘాలకు చేరిన దాఖలాలు లేవు. మహిళా సంక్షేమం అనేది ప్రధానమైన అంశం. వారికి పెట్టుబడులు సమకూర్చాలనే భావనతో మహిళా గ్రూపులను ఏర్పాటు చేయడం, వారికి వడ్డీ లేని రుణసౌకర్యం బ్యాంకుల నుండి కల్పించాలి. వారిని ప్రోత్సహించాలంటే నిధుల కొరత ఉండకూడదు. ఈ డబ్బును వెనువెంటనే విడుదల చేసి, మహిళా సంఘాల అకౌంట్స్‌లోకి జమ చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నాను. ఈ మధ్య గౌరవ ముఖ్యమంత్రి గారు విలేజ్ ఆర్గనైజర్స్‌ని ఏర్పాటు చేశారు. వీళ్లు, గ్రామాలలో మహిళా గ్రూపులను ఆర్గనైజ్ చేయడంతోపాటు వారికి, బుక్ కీపింగ్‌కి తోడ్పడుతున్నారు. వారికి ఆ మహిళా సంఘాలు రెండు వేల రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం మూడు వేల రూపాయలు వేతన రూపంలో ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. చాలా సంతోషం అధ్యక్షా. పట్టణ ప్రాంతాలలో మహిళా గ్రూపులకు సహాయపడుతున్న రిసోర్స్ పర్సన్స్ లేదంటే విలేజ్ ఆర్గనైజర్స్‌కి కూడా మూడు వేల రూపాయలు ప్రభుత్వం చెల్లించాలని కోరుతున్నాను. ప్రభుత్వం ప్రకటించే నిర్ణయం కోసం, వడ్డీ లేని రుణాల కోసం, తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఆడబిడ్డలు శాసనసభవైపు చూస్తున్నారు. బీఆర్ఓ జారీ అయిన దృష్ట్యా వెంటనే నిధుల విడుదలకు సంబంధించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

**శ్రీ జూపల్లి కృష్ణారావు : -** అధ్యక్షా, 2016-17 సంవత్సరానికి సంబంధించి రీయింబర్స్ చేయవలసిన వడ్డీ నిధులు, కొంతమేరకు డ్యూ ఉన్న మాట వాస్తవం. రాష్ట్రంలోని మహిళల పట్ల, ఈ ప్రభుత్వం, వాళ్లకు పూర్తిగా సాధికారత రావాలని, వాళ్లను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో అన్ని రకాల కార్యక్రమాలను చేపట్టటం జరిగింది. వడ్డీలేని రుణాల మాఫీకి సంబంధించి 2013-14 సంవత్సరానికి రూ. 180 కోట్లు బకాయి ఉంది. 2016-17 సంవత్సరానికి బ్యాలెన్స్ రూ. 630 కోట్లు ఉంది. 2012-13 లో లక్షా డెబ్బై నాలుగు వేల మహిళా సంఘాలకు రూ. 2370 కోట్లను బ్యాంకుల ద్వారా ఇప్పించడం జరిగింది. 2013-14 లో లక్షా అరవై అయిదు వేల సంఘాలకు రూ. 2972 కోట్లు, 2014-15 లో రూ. 3580 కోట్లు, 2015-16 లో రూ. 5295 కోట్లు, 2016-17 లో రూ. 6861 కోట్లు మహిళా గ్రూపులకు బ్యాంకుల ద్వారా రుణసదుపాయాన్ని కల్పించడం జరిగింది. 2012-13 తో పోల్చుకుంటే, 2016-17 కి వచ్చేసరికి మూడింతలు ఎక్కువగా మహిళా గ్రూపులకు రుణసౌకర్యాన్ని కల్పించడం జరిగింది. అంతేకాకుండా, దానికి అదనంగా స్త్రీ నిధి బ్యాంకుల ద్వారా 2012-13 లో రూ. 296 కోట్లు రుణ సదుపాయాన్ని మహిళా గ్రూపులకు కల్పించడం జరిగింది.

**10.10 ఉ.** 2016-17 సంవత్సరానికి రూ.11 వందల 59 కోట్ల 34 లక్షలు ఇవ్వడం జరిగింది. అంటే మోర్‌ద్యాన్ 300 శాతం పెంచడం జరిగింది. మహిళలు ఆర్థికంగా లాభసాటిగా ఉండాలి, వాళ్ల వృత్తి పరంగా కావచ్చు, కుటీర పరిశ్రమలు చేసుకోవడానికి కావచ్చు వాళ్ల ఆదాయం పెంచేందుకు పెద్దఎత్తున ప్రభుత్వం సహాయం చేయడం జరిగింది. ఈ త్రీ టైమ్స్, ఫోర్ టైమ్స్ కారణంగా బ్యాలెన్స్ బకాయిలుగా కొంత అమౌంట్ ఉంది. ఉన్నటువంటి బకాయిలు రూ.181 కోట్లు కూడా 2013-14కు సంబంధించి గతంలోనే ఉన్నాయి. ఈ ప్రభుత్వానికి మహిళల పట్ల చిత్తశుద్ధి ఉన్నందునే పెద్దమొత్తంలో రుణ సౌకర్యం కల్పించాము. ముఖ్యంగా ఇక్కడ గమనించాల్సింది ప్రభుత్వ ఉద్దేశం. వీలైనంత వరకు ఎక్కువ రుణసౌకర్యం అందించే ప్రయత్నం ప్రభుత్వం చేస్తున్నది. ఇందులో ఎవరూ అనుమానపడాల్సిన అవసరం లేదు.

అలాగే SCP,TSP నుంచి కూడా రూ.200 కోట్లు ఎస్.సి, ఎస్.టిల లైవ్లీహుడ్ పెంచడానికి ఫ్రీ లోన్స్ ఇవ్వడం జరిగింది. పావలా వడ్డీ రుణాలకు అర్హులైన నాలుగు లక్షల పైచిలుకు పొదుపు సంఘాలకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తున్నది. ఉదాహరణకు ఆసరా పెన్షన్ ద్వారా గతంలో రూ.800కోట్లు చెల్లిస్తే ఇప్పుడు రూ.5వేల

కోట్లు చెల్లిస్తున్నాము. వడ్డీలేని రుణాలు పొందేందుకు అర్హులైన సభ్యులు మోర్ద్యాన్ 50 శాతం లబ్ధి పొందుతున్నారు. అట్లాగే ప్రతి గ్రూపుకి రూ.3 లక్షలో రూ.4 లక్షలో అప్పు ఇచ్చినప్పుడు ఆ గ్రూపు సభ్యులు పంచుకుంటే ఒక్కొక్కరికి రూ.30వేలు లేదా రూ.40వేలు వస్తాయి. దానికి ఇంట్రెస్ట్ పర్ యానమ్ రూ.4వేలు లేదంటే రూ.5వేలు అవుతుంది. మనం మహిళల అభ్యున్నతి గురించి చర్చించుకుంటాం. కాబట్టి నేను చెప్పేదేమిటంటే గతంలో కంటే నంబర్ ఆఫ్ టైమ్స్ మల్టీఫోల్డ్‌గా వివిధ రకాలుగా లబ్ధి పొందే కార్యక్రమాలు ప్రభుత్వం తరపున చేస్తున్నాము.

ఒంటరి మహిళలు కూడా గ్రూపులు ఏర్పాటు చేసుకున్నారు. గౌరవ ముఖ్యమంత్రిగారు వీరిని కూడా ఆదుకోవాలనే పెద్ద మనసుతో కార్యక్రమం చేస్తున్నారు. లక్షా 50వేల మంది బీడి కార్మిక సభ్యులు మహిళా గ్రూపులు బ్యాంకు ద్వారా రుణాలు తీసుకుంటున్నారు. అంటే ఓవరాల్‌గా మహిళలకు అన్ని స్కీముల ద్వారా పెద్దఎత్తున మేలు జరిగే కార్యక్రమం చేస్తున్నాము. ప్రభుత్వానికి మొత్తం ఒకటేసారి బకాయిలు చెల్లించాలనే ఉద్దేశం ఉన్నప్పటికీ, వివిధ రకాల కారణాల వల్ల అంటే గతంలో ఉన్న బకాయిలు కావచ్చు, విద్యార్థులకు సంబంధించిన స్కాలర్‌షిప్పులు వంటివి వేల కోట్ల రూపాయలు బకాయిలు ఉన్న కారణంగా కొంత ఆలస్యం అవుతున్నది. తప్పనిసరిగా మహిళలను ఆదుకోవడం కోసం వీలైనంత త్వరలో బకాయిలను ఇప్పించే ప్రయత్నం చేస్తాము.

**శ్రీ జి. కిషన్ రెడ్డి (అంబర్‌పేట):-** అధ్యక్షా, హైదరాబాదు నగరంలో గత ఇరవై సంవత్సరాలుగా రెగ్యులర్‌గా పొదుపు సంఘాలలో సభ్యులుగా ఉండి రుణం తీసుకొని, ఆ రుణాన్ని రెగ్యులర్‌గా చెల్లించుకుంటున్న వారిలో 60 సంవత్సరాల వయసు దాటిన వారిని ఆ సంఘం నుంచి తొలగించి కొత్తవారిని చేర్చుకోవాలని అంటున్నారు. దీనిమీద ప్రభుత్వం ఏం ఆలోచన చేసిందో చెప్పాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ టి. జీవన్‌రెడ్డి:-** అధ్యక్షా, గౌరవ మంత్రిగారు మాట్లాడుతూ రూ.1245 కోట్లకు బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ విడుదల చేయడం జరిగిందని చెప్పారు. అది ఎప్పటిలోగా మెటీరియలైజ్ అవుతుందనే విషయం చెప్పాలి. వాస్తవానికి బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ జారీ చేయడం జరిగిందంటే అది కేవలం కాగితాలకే పరిమితమైతే ఎలా? కనీసం మార్చి,31వరకైనా బీఆర్‌ఓను మెటీరియలైజ్ చేసి సంబంధిత సంఘాలకు రావలసిన బకాయిలను చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నాను.

అంతే కాకుండా గ్రామీణ ప్రాంతాలలో సేవలందిస్తున్న విలేజ్ ఆర్గనైజర్లకు నెలకు రూ.3వేలు ఇవ్వడానికి ముఖ్యమంత్రిగారు నిర్ణయం తీసుకున్నారు. అదే పట్టణ ప్రాంతాలలో అవే విధులు నిర్వహిస్తున్న రిసోర్స్ పర్సన్స్‌కి ప్రభుత్వపరంగా ఏ విధమైన తోడ్పాటు అందడం లేదు. కాబట్టి పట్టణాలలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్స్‌కి కూడా నెలకి రూ.3వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

గత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన అభయ హస్తం పథకానికి సంబంధించి ఈ ప్రభుత్వం పూర్తిగా చెల్లింపులు నిలిపేసింది. ఈ ప్రభుత్వం మంచి కార్యక్రమాలను చేపడుతున్నదని చెబుతున్నారు, చాలా సంతోషం. కానీ గత ప్రభుత్వాలు చేపట్టిన మంచి కార్యక్రమాలను కూడా కొనసాగించాలని కోరుతున్నాను.

**శ్రీ జూపల్లి క్రిష్ణారావు:-** అధ్యక్షా, గౌరవ సభ్యులు కిషన్‌రెడ్డి గారు మాట్లాడింది గానీ జీవన్‌రెడ్డి గారు పట్టణాలకు సంబంధించిన మహిళా సంఘాలకు సంబంధించి ప్రస్తావించిన అంశం అది "మెప్మాకు" సంబంధించింది. కాబట్టి సభ్యులు డిఫరెంట్ ఫామ్‌లో వస్తే తప్పనిసరిగా ప్రభుత్వం పరిశీలించి నిర్ణయం తీసుకుంటుంది.

సభ్యులు జీవన్ రెడ్డిగారు అభయహస్తం గురించి చెప్పారు. అభయహస్తం కార్యక్రమాన్ని మా ప్రభుత్వం కొనసాగిస్తూనే ఉన్నది. అభయహస్తానికి చెల్లించాల్సిన పేమెంట్లను చెల్లిస్తున్నాము. అంతే కాకుండా కార్యక్రమాన్ని కంటిన్యూ చేస్తూనే ఇంకా ఫరధర్‌గా స్ట్రెంగ్తెన్ చేసే విధంగా గౌరవ ముఖ్యమంత్రిగారితో సంప్రదించి ఇప్పటికి 25 లక్షల మందికి పెన్షన్‌లున్నాయి. దానిని ఇంకా పెంచాల్సిన ఆవశ్యకత ఉన్నది. మహిళలకు సంబంధించిన లోన్స్ విషయమైనా ఇతర రకాలైనా స్కీములైనా ఇంకా ఎక్కువగా లబ్ధి పొందే ప్రయత్నం చేస్తాం తప్ప తగ్గించే ప్రయత్నం చేయడం లేదు. ఇందులో ఎవరికీ ఎలాంటి అనుమానాలు ఉండాల్సిన అవసరం లేదు.

(కాంగ్రెస్ సభ్యుల నుంచి అంతరాయం)

అధ్యక్షా, వీలైనంత తొందరగా అమలుచేసే విధంగా చర్యలు చేపడతాము.

**MR.SPEAKER:-**Now,Question No.2392 Minister for Municipal Administration.

## సబ్సిడీ భోజన పథకం

ప్రశ్న నెం.13(2392)

సర్వశ్రీ మాధవరం కృష్ణారావు (కూకట్‌పల్లి), కె.పి.వివేకానంద్(కుత్బుల్లాపూర్), జి. సాయన్న (సికింద్రాబాద్ –కంటోన్మెంట్) – గౌరవనీయులైన సమాచార సాంకేతిక, మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) హైదరాబాదులో పేదవారికి రూ.5లకు సబ్సిడీపై వేడి, పరిశుభ్రమైన ఆహారాన్ని గ్రేటర్ హైదరాబాదు మునిసిపల్‌కార్పోరేషన్ ఏర్పాటు చేసిన విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, ప్రస్తుతం పనిచేస్తున్న భోజన కేంద్రాల సంఖ్య, ప్రతిరోజూ ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకుంటున్న ప్రజల సంఖ్య ఎంత?

ఇ) సదరు ప్రయోజనం కోసం ఖర్చు చేస్తున్న వ్యయం ఎంత?

ఈ) సదరు భోజన కేంద్రాల సంఖ్యను పెంచే ప్రతిపాదన ఏదైనా ఉందా?

సమాచార సాంకేతిక, మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి (శ్రీ కె. తారక రామారావు):– అ) అవునండీ

ఆ) జిహెచ్ఎంసి పరిధిలోని వివిధ ప్రాంతాలలో ప్రస్తుతం 109 భోజనన కేంద్రాలు నిర్వహించబడుతున్నాయి. దాదాపు 22,000 మంది ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారు.

ఇ) సబ్సిడీ వ్యయంపై భోజనాన్ని సమకూర్చడమవుతున్నది. వ్యక్తి ఒక్కరికి భోజనానికి అయ్యే వాస్తవ వ్యయం ఐఎన్ఆర్ 24.25 ఇందులో రూ.5లను లబ్ధిదారుడు భరిస్తాడు. మిగిలిన రూ.19.25లను జిహెచ్ఎంసి భరిస్తుంది. జిహెచ్ఎంసి వార్షికంగా దాదాపు రూ.15 కోట్లను ఖర్చు చేస్తున్నది.

ఈ) ప్రభుత్వం 9-12-2016 తేదీగల ఎం.ఏ అండ్ యు.డి (ఎఫ్2) శాఖ, జి.ఓ.ఆర్.టి.నెం.848 ద్వారా ఇప్పటికే భోజన కేంద్రాలను 50 నుండి 150 వరకు పెంచింది.

**శ్రీ మాధవరం కృష్ణారావు: -** అధ్యక్షా, హైదరాబాదు నగరంలో రూ.5లకే భోజనం అనే పథకాన్ని గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టారు. ఇది బీదవారికి బాగా ఉపయోగకరంగా ఉంటుంది. నగరంలో ఇప్పటివరకు 109 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లుగా చెప్పారు. ఈ భోజన కేంద్రాలను ఇంకా పెంచాల్సిన అవసరమున్నదని మంత్రిగారికి తెలియజేస్తున్నాను. అదే విధంగా నగరంలో రూ.2కు వాటర్ ప్యాకెట్లు సరఫరా చేస్తున్నారు. వాటిని వాటర్ వర్క్స్ ద్వారా ఉచితంగా సరఫరా చేయమని మంత్రిగారిని కోరుతున్నాను. భోజన కేంద్రాలు ఏర్పాటు చేసినచోట తప్పనిసరిగా గౌరవ ముఖ్యమంత్రిగారి ఫోటో పెట్టాల్సిన అవసరమున్నది. ఎందుకంటే ఇప్పటికే 109 భోజన కేంద్రాలున్నాయి, ఇంకా కూడా 100 కేంద్రాలు ఏర్పాటు చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉన్నదని చెప్పారు. కాబట్టి నీటితోబాటు వాటర్ ప్యాకెట్లను కూడా ఉచితంగా సరఫరా చేయాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

10.20 ఉ. **శ్రీ కె.పి. వివేక నంద్: -** అధ్యక్షా, బీద ప్రజానికానికి ఎంతో ఉపకరించే ఐదు రూపాయలకే భోజన పథకం ద్వారా ప్రతి రోజు సుమారు 22 వేల మంది లబ్ధి పొందుతున్నారు. ప్రస్తుతం 109 కేంద్రాల ద్వారా పరిశుభ్రమైన మరియు నాణ్యత కలిగిన ఆహారాన్ని అందిస్తున్నప్పటికీ, ఆయా కేంద్రాల వద్ద చేతులు శుభ్రం పరుచుకోవడానికి వాష్ బేసిన్‌లను మరియు చెత్తను వేయడానికి తగు చెత్తబుట్టలను ఏర్పాటు చేసి, పరిశుభ్రత విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నాను. 25 రూపాయల విలువ చేసే ఆహారాన్ని ప్రభుత్వం కేవలం ఐదు రూపాయలకే అందించడం జరుగుతోంది. ప్రస్తుత కేంద్రాలతోబాటుగా నూతనంగా ఏర్పాటు చేసే కేంద్రాల వద్ద సరైన పరిశుభ్రమైన వాతావరణ పరిస్థితులు ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. నాణ్యత విషయాన్ని పరిశీలించడానికై మంత్రి గారు మరియు మేము ఆ భోజనాన్ని తిన్నాము. ఆ సందర్భంలో సరైన వసతులు లేవని అధికారులను ఆదేశించగా అప్పటికప్పుడు వాటిని కల్పించడం జరిగింది. గతంలో ప్రతిపక్ష నాయకులు జానారెడ్డి గారూ ఈ బోజనాన్ని రుచి చూసి చాల బ్రహ్మాండమైన ఆహారాన్ని ప్రజలకు అందిస్తున్నారని చెప్పారు. బయటకు వెళ్లే కొన్ని సందర్భాల్లో తరుచుగా మేము కూడా ఆ ఆహారాన్ని తింటున్నాము. చక్కటి సదుపాయాలతో మంచి వాతావరణాన్ని కల్పించి హైజీనిక్ ఫుడ్‌ని అందించాల్సిన బాధ్యత జిహెచ్ఎంసి పై ఉన్నందున, ఆ విషయంలో తగు చర్యలు చేపట్టాలని మీ ద్వారా మంత్రి గారికి మనవి చేస్తున్నాను.

**శ్రీ జి.సాయన్న:-** అధ్యక్షా, హైదరాబాద్ మహానగరంలో బీదలకు ఐదు రూపాయలకే భోజనం అందించడం చాలా గొప్ప కార్యక్రమం. గతంలో ఏ ప్రభుత్వాలు ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టలేదు. బీద ప్రజలు, లేబర్ అడ్డాల దగ్గర పని చేసేవారు, ఆసుపత్రులకు వెళ్లే వారందరూ ఈ మంచి కార్యక్రమాన్ని చేపడుతున్నందుకు ప్రభుత్వాన్ని మెచ్చుకుంటున్నారు. సికింద్రాబాద్‌లోని కంటొన్మెంట్ ఏరియాలో 20 శాతం ఏరియా జిహెచ్ఎంసి పరిధిలోకి వస్తోంది. మదర్ థెరిస్సా దగ్గర ఏర్పాటు చేసిన భోజన కేంద్రం బ్రహ్మాండంగా పనిచేస్తోంది. బోయినపల్లి, కార్ఖానా, బొల్లారం హాస్టల్ దగ్గర, మారెడు పల్లి మొదలైన ప్రాంతాలు కంటోన్మెంట్‌లోకి వస్తాయి. జిహెచ్ఎంసి పరిధిలోనే భోజన కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నందున కంటొన్మెంట్ ప్రాంతాల్లో భోజన కేంద్రాలను ఏర్పాటు చేయడానికి అధికారులు సంకోచిస్తున్నారు. నగరానికి నడిబొడ్డున ఉన్న ఈ ప్రాంతాల్లో కూడా ఐదు రూపాయాల భోజన కేంద్రాలను ఏర్పాటు చేసినట్లైతే బీద ప్రజలందరూ గొప్పగా

లబ్ధిపొందుతారు. బొల్లారం హాస్టల్ ప్రాంతంలో చాలా మందికి సరైన ఆహారం దొరకనందున ఆ ప్రాంతంలో కూడా ఐదు రూపాయల భోజన పథకాన్ని ఏర్పాటు చేసేలా తగు చర్యలు చేపట్టాలని మంత్రి గారిని కోరుకుంటున్నాను.

**శ్రీ కె. తారక రామా రావు:-** అధ్యక్షా, ఐదు రూపాయలకే నాణ్యమైన భోజనం అందించే గొప్ప కార్యక్రమం ద్వారా వేలాది మంది లబ్ధిపొందుతున్న విషయాన్ని ఈ ప్రభుత్వం మరియు గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రతిష్టాత్మకంగా తీసుకొన్నారు. జి.ఓ.ఎమ్.ఎస్.నెం.848 ద్వారా వాటిని 150 కేంద్రాలకు పెంచాలని తీసుకొన్న నిర్ణయానికనుగుణంగా తగుచర్యలు చేపడుతున్నాము. గౌరవ సభ్యులు చెప్పినట్లుగా ప్రతిపక్షనాయకులు పెద్దలు జానారెడ్డి మరియు శాసనసభ్యులు ఈ భోజనాన్ని రుచి చూసి నాణ్యత విషయంలో కితాబు ఇవ్వడం చాలా సంతోషకరం. ఈపథకానికి అన్నపూర్ణ అనే పేరును ఖరారు చేస్తూ, మెరుగైన నాణ్యతను పాటిస్తూ, మెరుగైన సేవలను విస్తృతంగా అందించడానికి తగు చర్యలు తీసుకుంటున్నాము.

ఆయా కేంద్రాల వద్దమంచి నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని గౌరవ సభ్యులు కృష్ణా రావు గారు తెలియజేసిన అంశాన్ని పరిశీలిస్తాము. ఆయా భోజన కేంద్రాల వద్ద పరిశుభ్రత, శాశ్వత స్టాల్స్‌ని ఏర్పాటు చేసే విషయమై గౌరవ సభ్యులు వివేకానంద్ కోరిన విషయాన్ని పరిశీలించి ఒక నిర్ణయాన్ని తీసుకుంటాము. హైదరాబాద్ మహానగరంలో అన్నార్తులు అధికంగా ఉండే లేబర్ అడ్డాల దగ్గర, ఆసుపత్రుల వద్ద, కార్మికులు అధికంగా పనిచేసే కార్మిక క్షేత్రాల వద్ద పేదలకు పూర్తి స్థాయిలో నాణ్యమైన భోజనాన్ని అందించాలనే సంకల్పంతో పనిచేస్తున్నాము. కంటోన్మెంట్ ఏరియాలో భోజన కేంద్రాలను ఏర్పాటు చేసే విషయంలో ఉన్న సందిగ్ధతను తొలగించడానికై కంటోన్మెంట్ సిఈఓ మరియు బోర్డు సభ్యులతో మాట్లాడి జిహెచ్ఎమ్‌సి ఆధ్వర్యంలో ఐదారు భోజన కేంద్రాలను ఏర్పాటు చేయడానికి తగు చర్యలు తీసుకుంటామని గౌరవ సభ్యులు సాయన్న గారికి తెలియజేస్తున్నాను.

## గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడి కేంద్రాలు మరియు వంట గదులు

ప్రశ్న నెం. 14(2338)

సర్వశ్రీ/ శ్రీమతి చింతా ప్రభాకర్ (సంగారెడ్డి), బోడిగ శోభ(చొప్పదండి), బానోతు శంకర్ నాయక్(మహబూబాబాద్), కొండా సురేఖ (వరంగల్–ఈస్ట్), గువ్వల బాలరాజు (అచ్చంపేట్):– గౌరవనీయులైన రోడ్లు, భవనాలు, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడి కేంద్రాలను, కిచెన్ షెడ్లను మంజూరు చేస్తున్న విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, ఇప్పటివరకు మంజూరైన అంగన్‌వాడి కేంద్రాలు, కిచెన్ షెడ్ల సంఖ్య ఎంత; సదరు కేంద్రాల నిర్మాణం కోసం మొత్తం అంచనా వ్యయమెంత;

ఇ) అంగన్‌వాడి టీచర్ల జీతాలను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం వాస్తవమేనా;

ఈ) అయితే, ఆ వివరాలేమిటి?

రోడ్లు, భవనాలు మరియు మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ( శ్రీ తుమ్మల నాగేశ్వర్ రావు):- అ) లేదండీ. గ్రామీణ ప్రాంతాల్లో కొత్త అంగన్‌వాడి కేంద్రాల మంజూరు కోసం అట్టి ప్రతిపాదన ఏదీ లేదు.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఇ) అవునండీ. అంగన్‌వాడి టీచర్లు, అంగన్‌వాడి హెల్పర్లు, మిని అంగన్‌వాడి వర్కర్ల గౌరవ వేతనాన్ని పెంచుతూ ప్రభుత్వం 6-3-2017 తేదీ గల జి.ఓ.ఎంఎస్.నెం.3 ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ) పెంచిన గౌరవ వేతనాలు ఈ విధంగా ఉన్నాయి. అంగన్‌వాడి టీచర్లకు ప్రస్తుతం గౌరవ వేతం రూ.7,000 కాగా పెంచిన గౌరవ వేతనం రూ.10,500, అంగన్‌వాడి హెల్పర్లకు ప్రస్తుత గౌరవ వేతనం రూ.4500 ఉండగా, పెంచిన గౌరవ వేతనం రూ.6,000 మరియు మిని అంగన్ వాడి వర్కర్లకు ప్రస్తుత గౌరవ వేతనం రూ.4,500 ఉండగా, పెంచిన గౌరవ వేతనం రూ.6000.

**శ్రీ సిహెచ్. ప్రభాకర్:-** అధ్యక్షా, రాష్ట్రంలోని అంగన్‌వాడి కేంద్రాలు సక్రమంగ పౌష్టికాహారాన్ని అందించే క్రమంలో అంగన్‌వాడీల్లో పని చేస్తున్న అంగన్‌వాడి టీచర్ల మరియు సహాయకుల కష్టాసుఖాలను తెలుసుకునే నిమిత్తం శిశు సంక్షేమ శాఖ మంత్రి గారు, గౌరవ ముఖ్యమంత్రి గారు, వారిని ఇంటికి పిలిచి వారి సేవలను, సాధకబాధకాలను, వారు చాలీచాలని వేతనంతో పని చేస్తున్నారని తెలుసుకొని మనసున్న మారాజుగా వారి వేతనాలను పెంచి, ఆయా అంగన్‌వాడీల్లో సన్న బియ్యం అన్నం పెట్టడానికి, గర్భిణులకు, బాలింతలకు కొలతలు లేకుండా తిన్నంత పౌష్టికాహారాన్ని పెట్టాలని నిర్ణయించారు. వేసవిలో కేంద్రాల వద్దకు గర్భిణులు రావడం ఇబ్బందిగా ఉంటుందనే ఆలోచనతో వారికి ఇంటి వద్దనే ఆహారాన్ని అందించేందుకు నిర్ణయం చేసినందుకు ముఖ్యమంత్రి గారికి

హృదయ పూర్వక ధన్యవాదములు తెలియజేస్తున్నాను. కొన్ని అంగన్‌వాడీ సెంటర్లు నేటికీ అద్దె భవనాల్లోనే అరకొర వసతులతో, ఇబ్బందులతో కొనసాగుతున్నందున కొత్త భవనాలను మంజూరు ఇచ్చే విషయమై ప్రభుత్వానికేమైనా ఆలోచన ఉన్నదా, ఒకవేళ ఉన్నచో ఆ వివరాలను తెలియజేయాలని మంత్రి గారిని కోరుతున్నాను. రాష్ట్రంలో నేటి వరకు పని చేస్తున్న అంగన్‌వాడి కేంద్రాల సంఖ్య ఎంత.

మిస్టర్ స్పీకర్: ప్రశ్నను పునరావృత్తం చేయకండి.

**శ్రీ సిహెచ్. ప్రభాకర్:-** అధ్యక్షా, అంగన్‌వాడి భవనాల విషయంలో తీసుకున్న నిర్ణయాలను తెలియజేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అక్షయ పాత్ర వారు లేని ప్రదేశాల్లో అంగన్‌వాడీలే ఆహారాన్ని అందించవలసి ఉన్నందున ఆ కిచెన్ షెడ్లను ఏరకంగా ఇస్తున్నారనే విషయాన్ని తెలియజేయాలని మంత్రి గారిని కోరుతున్నాను. అరకొరగ వసతులతో సమస్యలతో ఉన్న అంగన్‌వాడి భవనాలకు నూతన భవనాలను మంజూరు చేయాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

10.30 ఉ. **శ్రీమతి బి. శోభ :–** అధ్యక్షా, ముందుగా ఒక మహిళా ఎమ్.ఎల్.ఏ.గా గౌరవ ముఖ్యమంత్రి గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అంగన్‌వాడి టీచర్లను, ఆయాలను దృష్టిలో పెట్టుకుని అంగన్‌వాడి టీచర్లకు రూ. 10,500, ఆయాలకు రూ.6,000లుగా పెంచి అమలు చేస్తూ, బడ్జెట్‌ను ప్రవేశ పెట్టినందుకు మంత్రి గారికి, ముఖ్యమంత్రి గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అంగన్‌వాడి స్కూళ్లకు భవనాలు లేక చిన్న పిల్లలను ఆరుబయట కూర్చుండబెట్టి చదువు చెప్తున్న పరిస్థితి ఉంది. ప్రస్తుత బడ్జెట్‌లో కొత్తగా అంగన్‌వాడి భవనాలను కట్టించే ఆలోచన ఏమైనా ఉందా? చాలా చోట్ల అంగన్‌వాడి టీచర్లు లేరు కనుక అంగన్‌వాడి టీచర్ పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉందా? అదే విధంగా అంగన్‌వాడి టీచర్లు మరియు ఆయాలతోబాటు చాలా మంది సూపర్‌వైజర్లు వారికి జీతాలు పెంచే విషయం గౌరవ ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకు వెళ్లమని మమ్మల్ని అడుగుతున్నారు. సూపర్‌వైజర్లకు జీతాలు పెంచే ఆలోచన ఏమైనా ఉందా? ఒకవేళ ఉంటే మంత్రి గారు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నాను. ఏ ప్రభుత్వం కూడా మమ్మల్ని ఇప్పటి వరకు పట్టించుకోలేదు, కాని ముఖ్యమంత్రి గారు ఇంటికి పిలిపించుకుని కడుపు నిండా భోజనం పెట్టి, పెంచిన జీతాలు ప్రస్తుత మార్చి నుండే అమలు చేశారని తెలంగాణ రాష్ట్రం మొత్తం, ముఖ్యంగా మా చొప్పదండి నియోజక వర్గంలోని అంగన్‌వాడి టీచర్లు ఆయాలు మనసులో పెట్టుకున్న చరిత్ర ముఖ్యమంత్రి గారిది. నేను ఉమ్మడి రాష్ట్రంలో జె.పి.టి.సి.గా పని చేసినప్పుడు అంగన్‌వాడి టీచర్లు హైదరాబాదుకు వస్తే గుర్రాలతో తొక్కించిన చరిత్ర ఉంది. కాని మన ప్రభుత్వానికి ఆపదలో ఉన్న వారిని ఆదుకునే ప్రభుత్వమనే గొప్ప పేరు ఉంది. అంగన్‌వాడి భవనాలను ప్రస్తుత మార్చి బడ్జెట్‌లో కట్టించే ప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

**శ్రీ బి. శంకర్ నాయక్ :–** అధ్యక్షా, శాశ్వత భవనాలు, కిచెన్ షెడ్లు లేక అంగన్‌వాడి కేంద్రాలు అవస్థలు పడుతున్న మాట వాస్తవము. ఈ విషయమై ప్రభుత్వం ఎప్పటిలోగా చర్య తీసుకుంటుంది? ఇప్పటి వరకు ఏ ప్రభుత్వాలు అంగన్‌వాడి వర్కర్ల జీతాల గురించి గాని, వారి బ్రతుకుల గురించి గాని ఆలోచించలేదు. మనసున్న మహారాజు కేసీఆర్ గారు వారి జీతాలు పెంచి ఇస్తున్నందుకు అంగన్‌వాడి వర్కర్ల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. చాలా చోట్ల అంగన్‌వాడి టీచర్లు లేక చాలా ఇబ్బంది పడుతున్నారు. టీచర్ల నియామకాలు ఎప్పటిలోపు చేపడతారు? కిచెన్ షెడ్లు, శాశ్వత భవనాలు మరియు ఖాళీగా ఉన్న పోస్టుల విషయంలో మంత్రిగారు చర్య తీసుకోవాలని కోరుతున్నాను.

**శ్రీ తుమ్మల నాగేశ్వర రావు :–** అధ్యక్షా, రాష్ట్రంలో 35,700 అంగన్‌వాడి కేంద్రాలకుగాను అందులో ప్రధాన అంగన్‌వాడి కేంద్రాలు 31,711 ఉన్నాయి. మిని అంగన్‌వాడి కేంద్రాలు 3,989 ఉన్నాయి. వీటిలో సొంత భవనాలు 9,377, అద్దె భవనాలు 18,975 ఉన్నాయి. గౌరవ విద్యా శాఖా మాత్యుల ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాలుగా ఎక్కడ వెసులుబాటు ఉంటే అక్కడ 7,348 ఉచిత పాఠశాల భవనాలను తీసుకున్నాము. ప్రస్తుత సంవత్సరం కూడా ఎక్కడ వెసులుబాటు ఉంటే అక్కడ ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాల భవనాలు తీసుకోడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పాఠశాల భవనాలు ఉంటే ఇబ్బంది ఉండదనే ఉద్దేశంతో విద్యా శాఖ మంత్రి గారి చొరవతో కొంత వెసులుబాటు కలిగింది. మిగిలినవి కూడా పూర్తి చేయడానికి ప్రయత్నం చేస్తామని గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను. అనేక పథకాల క్రింద శాంక్షన్ అయిన 2,878 భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ సంవత్సరం గౌరవ పంచాయతీ రాజ్ శాఖా మాత్యులు నరేగాను అటాచ్ చేసి అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణానికి నిధులు శాంక్షన్ చేశాము. జిల్లాల వారీగా ఇచ్చిన శాంక్షన్ల లిస్ట్‌ను గౌరవ సభ్యులకు పంపిస్తాము. ఈ రకంగా ఉన్న భవనాలను పూర్తి చేసుకుంటూనే రాబోయే రోజుల్లో అన్ని అంగన్‌వాడి కేంద్రాలకు పక్కా భవనాల ఏర్పాటుకు ప్రభుత్వం కృషిచేస్తుందని గౌరవ సభ్యులకు తెలియజేస్తూ, అంగన్‌వాడి టీచర్లు మరియు ఆయాల పోస్టులు ఖాళీలు ఉన్న మాట వాస్తవమే. 1368 టీచర్ల పోస్టులు, 3109 ఆయా పోస్టులు, 1005 మిని అంగన్‌వాడి కేంద్రాల్లోని టీచర్ల పోస్టులు ఖాళీగా

ఉన్నాయి. ఈ నెలలో అంగన్‌వాడీల్లో ఉన్న సూపర్‌వైజర్లకు ప్రమోషన్లు ఇచ్చి వచ్చే రెండు, మూడు నెలల్లో ఖాళీలనీ భర్తీ చేస్తామని గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను.

**జూనియర్ కళాశాలలలో మధ్యాహ్న భోజన పథకం**

ప్రశ్న సంఖ్య 15 (2245)

సర్వశ్రీ గాదరి కిషోర్ కుమార్ (తుంగతుర్తి ), కల్వకుంట్ల విద్యాసాగర్ రావు(కోరట్ల), కోనేరు కోనప్ప(సిర్‌పూర్) – గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి (విద్యా) దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియరు కళాశాలల్లో మధ్యాహ్నే భోజన పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, ఆ వివరాలేమిటి?

ఇ) సదరు పథకానికి ప్రతీ సంవత్సరం అవసరమయ్యే అంచనా మొత్తం ఎంత?

ఈ) సదరు పథకం వల్ల లబ్ధి పొందనున్న విద్యార్థుల సంఖ్య ఎంత?

ఉప ముఖ్యమంత్రి (విద్యా) గారు (శ్రీ కడియం శ్రీహరి): – అ) ఈ ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉన్నది.

ఆ, ఇ & ఈ ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

**శ్రీ గాదరి కిషోర్ కుమార్ :–** అధ్యక్షా, మానవ వనరుల మీద పెట్టిన ప్రతి పెట్టుబడిని పెట్టుబడిగా కాకుండా అభివృద్ధిగా భావించి ముందుకు సాగి, రేపు ప్రపంచంతో పోటీ పడే విద్యార్థిగా తెలంగాణ విద్యార్థిని తీర్చిదిద్దాలనే ఆకాంక్షను గౌరవ ముఖ్యమంత్రి గారు పలు సందర్భాల్లో చెప్పిన మాటను దృష్టిలో పెట్టుకుని హాస్టళ్లలో గాని, రెసిడెన్షిల్ పాఠశాలల్లో గాని సన్న బియ్యం కార్యక్రమం ద్వారా అద్భుతమైన రిజల్ట్ వస్తూ, విద్యార్థుల సంఖ్య కూడా పెరిగిన సందర్భాలు కనిపిస్తున్నాయి. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు అర్ధాకలితో బాధ పడుతూ మధ్యాహ్నం వరకే కళాశాలల్లో ఉండి తరువాత ఇంటికి పోయి భోజనం చేసే పరిస్థితి నుండి బయటకు రావాలంటే, ఉన్నటువంటి పేదరికం నుండి బయట పడాలంటే, పొద్దునే లేచి టిఫిన్ కట్టుకుని కళాశాలకు వచ్చి చదువుకునే పరిస్థితి లేకుండా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసి అక్కడే భోజన సదుపాయం అందిస్తే, భోజనం తరువాత జరిగే క్లాసులకు కూడా సంపూర్తిగా హాజరయ్యే చదవగలిగితే అత్యుత్తమ విద్యార్థులుగా భారత దేశంలో ముందుకు పోయే అవకాశం ఉంటుంది కాబట్టి, ఈ ప్రతిపాదనను గమనించి, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 410 జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాల్సిందిగా కోరుతున్నాను. ఈ విషయాన్ని ఇంతకు ముందు కూడా ఉప ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లాము. వారు కూడా పాజిటివ్‌గా స్పందించి ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకుపోవడం సమీక్షలు నిర్వహించడం కూడా జరిగింది. ఉన్నటువంటి అవకాశాన్ని, వెసులుబాటును ఉపయోగించుకుని ఈ బడ్జెట్‌లో 100శాతం విద్యార్థులకు అనుగుణంగా, లబ్ధి చేకూరే విధంగా సన్న బియ్యం పథకాన్ని తీసుకువస్తే కనుక మిగతా వాటిలో సంఖ్య పెరిగిన విధంగానే జూనియర్ కళాశాలల్లో కూడా సంఖ్య పెరుగుతుందని ఆశిస్తూ, విద్యార్థుల పక్షాన విద్యార్థుల నుండి వచ్చిన నాయకునిగా వారి పక్షాన మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

**శ్రీ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు :–** అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారు, ఉప ముఖ్యమంత్రి గారు ముందు చూపుతో విద్యార్థి లోకాన్ని ముందుకు తీసుకుపోవాలి, రేపు విద్యార్థులే దేశానికి అండ దండలు అనే ఉద్దేశంతో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసి ప్రభుత్వ పాఠశాలల్లోను, కళాశాలల్లోను విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రైవేటు కళాశాలల్లో లక్షల రూపాయల ఫీజులు కట్టి చదవలేని పేద విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలల్లో చదువుకునే విధంగా వెసులుబాటు కల్పిస్తే బాగుంటుంది. తెలంగాణ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోంది. కాబట్టి, మధ్యాహ్న భోజన పథకాన్ని కళాశాలల్లో కూడా ఏర్పాటు చేయాలని గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

**10.40 ఉ.**

**శ్రీ కడియం శ్రీహరి:–** అధ్యక్షా, రాష్ట్ర వ్యాప్తంగా 404 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లక్షా 73వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఇంటర్మీడియట్ విద్యను పటిష్టం చేయాలన్న ఆలోచనలో భాగంగా, దేశంలోనే మొట్టమొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యను ఉచిత విద్యగా డిక్లేర్ చేయడం జరిగింది. అంటే, విద్యార్థుల నుంచి ఒక రూపాయి రుసుం తీసుకోకుండా, విద్యార్థులకు కళాశాలల్లో ప్రవేశం కల్పిస్తున్నాము. ప్రభుత్వ కళాశాలల్లో పేద విద్యార్థులు ఎక్కువగా ఉంటున్నందున, ఆ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు సరఫరా చేయడం జరుగుతోంది. ఈ రెండు నిర్ణయాల వల్ల గడిచిన రెండు సంవత్సరాల కాలంలో ఎన్‌రోల్‌మెంట్

గణనీయంగా పెరిగింది. లక్షా 23వేల నుంచి లక్షా 70వేల మంది ఎన్‌రోల్‌చేసుకున్నారు. 2017–18 విద్యాసంవత్సరానికిగాను రెండు లక్షల వరకు ఎన్‌రోల్‌మెంట్‌ను టార్గెట్‌గా పెట్టుకుని, ఎన్‌రోల్‌మెంట్ స్థాయిని పెంచడానికి ఇంటర్మీడియట్ బోర్డ్ డ్రైవ్‌లను చేపడుతున్నదని మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. అదే విధంగా గౌరవసభ్యులు జి.కిషోర్ కుమార్, కె. విద్యాసాగర రావు గారు ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి చదువుకుంటున్న పేద వర్గాలకు చెందినవారే ఎక్కువగా ఉంటున్నందున మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశ పెడితే బాగుంటుందన్న ప్రతిపాదనను తెచ్చారు. ఇప్పటికే ఆ ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పేద విద్యార్థులు ఎక్కువగా ఉన్న చోట ఈ పథకాన్ని ప్రవేశ పెడితే బాగుంటుందనే ఆలోచన ప్రభుత్వం చేస్తున్నది. దానికి సంబంధించిన సాధ్యాసాధ్యాలను ప్రభుత్వం వర్కౌట్ చేస్తున్నది. మొత్తం ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది. తప్పకుండా గౌరవ సభ్యులు కోరిన విధంగా పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని త్వరలోనే ఈ విషయంపై నిర్ణయం తీసుకుంటామని తెలియజేస్తున్నాను.

## గిరిజన వినియోగదారులకు విద్యుత్ ఛార్జీల మాఫీ

ప్రశ్న నెం. 16 (2385)

సర్వశ్రీ తాటి వెంకటేశ్వర్లు (అశ్వారావుపేట), శ్రీమతి కోవాలక్ష్మి (ఆసిఫాబాద్) – గౌరవనీయులైన ఇంధన శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా ;

అ) యాభై యూనిట్ల వరకు వినియోగించుకునే గిరిజన వినియోగదారులకు విద్యుత్ ఛార్జీలను మాఫీ చేస్తున్న విషయం వాస్తవమేనా ;

ఆ) అయితే, ఈ ప్రయోజనం పొందుతున్న వ్యక్తుల సంఖ్య ఎంత;

ఇ) రాష్ట్రఖజానాపై పడుతున్న ఆర్థిక భారం పరిమాణం ఎంత;

ఇంధన శాఖ మంత్రి (శ్రీ జి. జగదీష్‌రెడ్డి):– అ) అవునండీ.

ఆ) సదరు పథకం క్రింద 2,24,384 మంది వినియోగదారులు వర్తింపయ్యారు.

ఇ) రాష్ట్ర ఖజానాపై పడే ఆర్థిక భారం రూ.109.32 కోట్లు (తాత్కాలిక).

**శ్రీ తాటి వెంకటేశ్వర్లు:–** అధ్యక్షా, మాట్లాడే అవకాశం కల్పించినందుకు మీకు ధన్యవాదములు తెలియజేస్తున్నాను. ఈనాడు భారతదేశంలోనే గిరిజన ప్రాంతాలు ఉన్న అనేక రాష్ట్రాల్లో ఎక్కడా కూడా 50 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను ఇస్తున్నందుకు ప్రత్యేకంగా గౌరవ ముఖ్యమంత్రి గారికి, మంత్రి గారికి అభినందనలు తెలియజేస్తున్నాను. 50 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వడం వల్ల సుమారు 2,25వేల కుటుంబాలకు ఉపయోగపడుతున్నది. సుమారు రూ.109కోట్లు దీనికి ఖర్చు చేస్తున్నారని మంత్రి గారు తెలిపారు. అనేక మారుమూల తాండాలకు, చిన్న చిన్న గ్రామాలకి విద్యుత్‌సౌకర్యం కల్పించే అవకాశం ఉందా? 50 యునిట్లు మాత్రమే కాకుండా 100 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను ఇవ్వడానికి అవకాశాలు కల్పించాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీమతి కోవా లక్ష్మి:–** అధ్యక్షా, ఈ అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి గారికి, మీకు ధన్యవాదములు తెలియజేస్తున్నాను. గత ప్రభుత్వాలు తొమ్మిది గంటల విద్యుత్‌ను అందిస్తామని, ఒక గంట కూడా విద్యుత్‌ను ఇవ్వలేకపోయారు. కాని ఈ రోజు ఇరవైనాలుగు గంటలు విద్యుత్ ఉంటోంది. ముఖ్యమంత్రిగారు గతంలో ఏదైతే హామి ఇచ్చారో, దానిని నిలబెట్టుకున్నందుకు అందరూ సంతోషంగా ఉన్నారు. గతంలోని ప్రభుత్వాలు ఈ విషయంలో నిర్లక్ష్యం చేసినందున కొన్ని గ్రామాల్లో విద్యుత్ లేదు. కనుక ఆ గ్రామాలకు విద్యుత్‌ను కల్పించాలని, అదే విధంగా యాభై యూనిట్ల వరకు విద్యుత్‌ను వినియోగించుకునే గిరిజన వినియోగదారులకు విద్యుత్ ఛార్జీలను మాఫీ కాలేదు. అదే విధంగా 50 యూనిట్లు అందిస్తున్న విద్యుత్‌ను 100 యూనిట్లు ఇవ్వాలని కోరుతున్నాను.

**శ్రీ జి.జగదీష్ రెడ్డి:–** అధ్యక్షా, అన్ని గ్రామాల్లో, తాండాల్లో విద్యుదీకరణ జరిగింది. కాని కొన్ని గిరిజన తాండాల్లో నివసించేవారు ఒక ప్రాంతంలో స్థిరంగా ఉండనందున మాత్రమే కొంత ఇబ్బందులు వస్తున్నాయి. ఎందుకంటే, అడవిలో విద్యుత్‌ను వారికి సరఫరా చేయాలంటే, తీగలు వేయడానికి ఇబ్బందులు మరియు కొంత ఖర్చుతో కూడుకున్న విషయమని తెలియజేస్తున్నాను. కనుక సోలార్ ఎనర్జీ ద్వారా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాము. గౌరవ సభ్యులు అడిగిన విధంగా 50 యూనిట్ల నుంచి 100 యూనిట్లకి పెంచాలనే ఆలోచన ప్రస్తుతానికి ప్రభుత్వానికి లేదని తెలియజేస్తున్నాను.

## ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత పాఠశాలలకు మరుగుదొడ్లు

ప్రశ్న నెం.17 (2388)

సర్వశ్రీ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, గోవర్ధన్ బాజిరెడ్డి (నిజామాబాద్–రూరల్), మంచిరెడ్డి కిషన్ రెడ్డి (ఇబ్రహీంపట్నం)– గౌరవనీయులైన పంచాయతీరాజ్ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) రాష్ట్రంలో ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ నిధులను వినియోగిస్తూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలలో మరుగుదొడ్లను నిర్మిస్తున్న విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, ఈ ప్రయోజనం కోసం గుర్తించిన పాఠశాలల సంఖ్య ఎంత ;

ఇ) ఈ సంవత్సరంలో నిర్థిష్టపరిచిన లక్ష్యాలు ఏమిటి;

పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ( శ్రీ జూపల్లి క్రిష్ణారావు):– అ) అవునండీ.

ఆ) ఈ ప్రయోజనం కోసం 6000 పాఠశాలలను గుర్తించడమయింది.

ఇ) 2017–18 సంవత్సరానికి 3000 పాఠశాల మరుగుదొడ్లను నిర్మించాలనే లక్ష్యాన్ని పెట్టుకోవడమయింది.

**కె.విద్యాసాగర్ రావు:–** అధ్యక్షా, ఇది పెద్ద సాహసోపేతమైన చర్యని తెలియజేస్తున్నాను. ఎన్నో రోజులుగా పాఠశాలలు నిర్మించి కూడా మరుగుదొడ్లు లేక ముఖ్యంగా బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. బాలురైతే బయట ఎక్కడైన మూత్ర విసర్జన చేయగలరు. కాని పాఠశాలల్లో మూత్రశాలలు లేనందున బాలికలు పాఠశాలలు మానివేసే పరిస్థితులు ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి గారి ఆధ్వర్యంలో, పంచాయతీ రాజ్ మంత్రి గారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. పాఠశాలల్లో మరుగుదొడ్లు కట్టడమే కాకుండా వాటిని మెయిన్‌టేన్ చేయడానికి ఒకవర్కర్‌ని నియమించే విధంగా చూడాలని, లేకపోతే మరుగుదొడ్లు నిర్మించి వదిలివేస్తే శుభ్రత లేకుండా అవుతాయని తెలియజేస్తున్నాను. ముఖ్యంగా బాలికల పాఠశాలల్లో గల మరుగుదొడ్ల నిర్మాణాలను తొందరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ మంచి రెడ్డి కిషన్ రెడ్డి:–** అధ్యక్షా, ప్రాథమిక పాఠశాలల్లో, ఉన్నత పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మించాలనే ప్రతిపాదన చేసినటువంటి ప్రభుత్వానికి ధన్యవాదములు తెలియజేస్తున్నాను. ఈ స్కీమ్ ద్వారా ప్రభుత్వంలో ఉన్న కార్యక్రమాల్లో S.S.A కాని, R.W.S. కాని, R.V.Mలు కన్ఫ్యూజై, ఏ డిపార్ట్‌మెంట్ కూడా సరైన రీతిలో నిర్మాణాలు చేయకుండా ఇబ్బందులు పడుతున్న సందర్భంలో మన ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ తరుపున ఈ కార్యక్రమాన్ని చేయాలన్న ఆలోచన రావడంతో 1,105 పాఠశాలల్లో తీసుకోవాలనే ఒక కార్యక్రమం, 3000 పాఠశాలల్లో తీసుకోవడం జరుగుతోంది. ఈ కార్యక్రమాన్ని N.R.E.G.S ద్వారా తీసుకోవాలన్న ప్రతిపాదన పెట్టిన మాట వాస్తవమేనా అని అడుగుతున్నాను. పాఠశాలల్లో పిల్లలకు నీరు లేనందున విద్యార్థులు మరుగుదొడ్లల్లోకి వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయి.

**10.50 ఉ.** మరుగుదొడ్ల నిర్వహణ విషయంలో ప్రధానోపాధ్యాయులను అనుసంధానం చేయాలి. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండకపోవడం వలన విద్యార్థులు చాలా ఇబ్బందిపడుతున్నారు. ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ ద్వారా ఈ కార్యక్రమాన్ని తీసుకోవాలి. అన్ని పాఠశాలల్లో అవసరమైనన్ని మరుగుదొడ్లు కట్టించాలని ప్రభుత్వాన్ని నేను కోరుకుంటున్నాను. వీటి కోసం అత్యధిక నిధులు కేటాయించాల్సిందిగా మంత్రిగారిని విజ్ఞప్తి చేస్తున్నాను.

**శ్రీ ఎస్.ఎ.సంపత్ కుమార్ (అలంపూర్):–** అధ్యక్షా, తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ రెండున్నర సంవత్సరాల్లో విద్యపై ప్రధానమైన దృష్టి కేంద్రీకరించి, ముందుకు పోతున్నామని పదే పదే గౌరవ ముఖ్యమంత్రిగారు, సంబంధిత మంత్రివర్యులు చెబుతూ ఉన్నారు. దానిలో భాగంగానే కే.జీ. టు పీ.జీ. విద్యను ఏర్పాటు చేశారు. రూరల్ ఎడ్యుకేషన్ డెవలప్ కావడానికి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను డెవలప్ చేయడానికి, గ్రామీణ ప్రాంతాలల్లో విద్యాప్రమాణాలను పెంచడానికి ప్రభుత్వం కృషి చేయాలి. ప్రతి అకడమిక్ సంవత్సరం మొదలులోనే కేంద్రప్రభుత్వ పథకమైన రాజీవ్ విద్యా మిషన్ ద్వారా, లేకపోతే రాష్ట్రప్రభుత్వం కేటాయించిన నిధులతో రాష్ట్రంలో అదనపు క్లాస్‌రూమ్‌లు, కిచెన్ షెడ్లు, పాఠశాలల్లో చిన్న చిన్న రిపేర్స్ కొరకు బడ్జెట్ మంజూరై, వేసవికాలం మొదలయ్యే లోపే ఆ పనులు పూర్తి చేయడమనేది ఆనవాయితీగా వస్తున్నది. ఈ మూడు సంవత్సరాల్లో ఏ ఒక్క సంవత్సరం కూడా ఎటువంటి పనులు జరగలేదు. ప్రభుత్వం మరుగుదొడ్లు కట్టించినప్పటికీ, నీటి సదుపాయం లేకపోవడం వలన వాటిని వాడడం లేదు. నీటి సౌకర్యం కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించే విధంగా కృషిచేయవల్సిందిగా కోరుతున్నాను.

**శ్రీ బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి:–** అధ్యక్షా, ఒక్కొక్క ప్రభుత్వ పాఠశాలలో దాదాపుగా 500 మంది పిల్లలు చదువుకుంటూ ఉంటారు. ఈ సంవత్సరం నుంచి ఇంకా ఎక్కువ మంది పిల్లలు వచ్చే అవకాశం ఉన్నది. ఎందుకంటే, ఇంగ్లీషు మీడియంను ప్రభుత్వ పాఠశాలల్లో భోదిస్తున్నారు కాబట్టి, ఎక్కువ మంది పిల్లలు ప్రైవేటు పాఠశాలలను వదిలి ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్నారు. మరుగుదొడ్ల విషయానికి వస్తే పిల్లలు క్యూ లో నిలబడి చాలా ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ ద్వారా అదనంగా నిధులు ఇచ్చి ఎక్కువ మరుగుదొడ్లు కట్టించవలసినదిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. వాటి నిర్వహణ కూడా చేయవల్సిందిగా కోరుతున్నాను. గతంలో గౌరవ మంత్రిగారు మరుగుదొడ్ల నిర్వహణ కొరకు ప్రతి హైస్కూల్‌కు కొంత నిధిని కేటాయించామని చెప్పారు. ఆ నిధులు సరిపోవు, మరికొంత ఎక్కువగా నిధులను కేటాయించవల్సిందిగా కోరుతున్నాను. ఏ పాఠశాలకు వెళ్లినా ఇదే ఇబ్బంది ఉంటున్నది. కాబట్టి, తప్పకుండా ఈ సమస్యను పరిష్కారం చేయవల్సిందిగా కోరుతున్నాను.

**శ్రీ కడియం శ్రీహరి:–** అధ్యక్షా, కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇ.జి.ఎస్ నిర్మాణం క్రింద కొన్ని టాయిలెట్స్ నిర్మాణం జరుగుతున్నాయి. కాబట్టి, ఆ ప్రశ్నకు పంచాయితీ రాజ్ మంత్రిగారు సమాధానం చెప్పారు. రాష్ట్రంలో 25,9,66 ప్రభుత్వ ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ హైస్కూల్స్ ఉన్నాయి. ప్రస్తుతానికి ప్రతి పాఠశాలలో కనీసం ఒక టాయిలెట్ ఉన్నది. కాకపోతే ఆ పాఠశాలల్లో నీటి సౌకర్యం సరిగా లేకపోవడం, నిర్వహణ లేకపోవడం వలన మూత్రశాలలు పనిచేయని మాట వాస్తవం. ఇటీవలే మేము విద్యాశాఖ పరంగా చాలా వివరంగా రెవ్యూ చేసుకోవడం జరిగింది. జూన్12, 2017లోపు రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న మూత్రశాలలు పని చేసే విధంగా, నిర్వహణ జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తమరి ద్వారా గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను. బహుశ వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఇలాంటి ప్రశ్నలు, ఇలాంటి విమర్శలు రాకుండా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

టాయిలెట్స్ యొక్క నిర్వహణకు స్కూల్ గ్రాంట్లు గణనీయంగా పెంచాము. ఉన్నత పాఠశాలల్లో వందకు పైన ఎన్‌రోల్‌మెంట్ ఉంటే వారికి ఒక లక్షరూపాయలు స్కూల్ గ్రాంటు ఇస్తున్నాము. అంతకంటే తక్కువగా ఉన్న పాఠశాలకు రూ.50వేలు, రూ.40వేలు రూ.30వేలు చొప్పున స్కూల్ గ్రాంటు ఇస్తున్నాము. ప్రధానోపాధ్యాయులకు, స్థానికంగా ఒక ఇద్దరు వర్కర్లు అపాయింట్ చేసుకోమని చెప్పాము. ఆ ఇద్దరి వర్కర్లు స్కూల్‌ని శుభ్రపరచడం, టాయిలెట్లను శుభ్రపరచడం, మొక్కలకు నీళ్లు పోయడం, రాత్రిపూట వాచ్‌మెన్ డ్యూటీ చేయమని చెప్పాము.

ఈ సందర్భంగా గౌరవ శాసనసభ్యులందరికి ఒక మాట విజ్ఞప్తి చేయదలచుకున్నాను. జూన్12,2017 లోపు మూడు ముఖ్యమైన పనులను మేము పూర్తి చేయబోతున్నాము. (1) ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి వందశాతం టెక్స్ట్‌బుక్స్ రీచ్ అయ్యే విధంగా చర్య తీసుకుంటున్నాము. (2) ప్రతి సంవత్సరం యూనిఫామ్స్ ఎప్పుడూ డిసెంబర్, జనవరిలో ఇచ్చేవాళ్లము. అలా కాకుండా నేను, టెక్స్‌టైల్స్ మినిస్టర్ తారకరామారావుగారు కలిసి రెవ్యూ పెట్టుకొని అధికారులకు కూడా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాము. జూన్12,2017లోపు పాఠశాలలకు యూనిఫామ్ క్లాత్ సప్లై చేయడమే కాకుండా మే మాసంలోనే వాటిని కుట్టించి పిల్లలకు అందించే విధంగా చర్య తీసుకుంటున్నాము. (3) ప్రతి పాఠశాలల్లో టాయిలెట్స్ పనిచేసే విధంగా, ఆ టాయిలెట్స్ నిర్వహణ చేయడం కొరకు స్కూల్ గ్రాంట్లు రిలీజ్ చేస్తున్నాము. శాసనసభ్యులందరూ తమ నియోజకవర్గాల్లో జూన్12వతారీఖు తరువాత ఈ మూడు అంశాలు అమలులో లేకపోతే నా దృష్టికి తీసుకు రండి. తప్పకుండా పాఠశాలలను మెరుగుపరిచే ప్రయత్నం చేద్దాము. మీ అందరి సహకారంతో ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకు వచ్చే ప్రయత్నం చేద్దామని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

## గ్రామీణ రోడ్లపై వంతెనల నిర్మాణం

ప్రశ్న నెం. 19(2389)

సర్వశ్రీ ఏనుగు రవీందర్ రెడ్డి (ఎల్లారెడ్డి), పుట్టా మధుకర్ (మంథని), తాటి వెంకటేశ్వర్లు – గౌరవనీయులైన పంచాయితీ రాజ్ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేసారా;

అ) ప్రభుత్వ గ్రామీణ రోడ్లపై వంతెనలను, బ్రిడ్జి–కం–చెక్ డ్యాం నిర్మాణాలను చేపట్టిన విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, మంజూరు చేసిన పనుల వివరాలు, సదరు పనుల ప్రస్తుత దశ ఏమిటి?

ఇ) వంతెనలతోపాటు చెక్ డ్యాంలను చేపట్టడానికి గల కారణాలు ఏమిటి?

ఈ) వాటి వల్ల లాభాలు ఏమిటి?

పంచాయితీ రాజ్ శాఖ మంత్రి (శ్రీ జూపల్లి కృష్ణారావు):– అ) అవునండీ.

అ) నాబార్డు /పిఎంజిఎస్‌వై/సిఆర్‌ఆర్/ ఎస్‌డిఎఫ్ గ్రాంటుల క్రింద 514 పనులను మంజూరు చేయడమయింది. వీటిలో 86 వంతెనలను పూర్తి చేయడమయింది. మిగిలినవి పురోగతిలో ఉన్నాయి.

ఇ) చెక్–డ్యాంలు నీటిని నిలిపి ఉంచే నిర్మాణాలుగా ఉండి, జలాశయాలను ఏర్పాటు చేస్తాయి.

ఈ) i) ఊట వల్ల భూగర్భజలం గణనీయంగా మెరుగుపడుతుంది.

ii) సమీపంలోని బహిరంగ బావులు/సాగునీటి బావులు, బోరు బావుల భూగర్భ నీటి మట్టాలు మెరుగుపడతాయి.

iii) పశువులు, జంతువులు మున్నగు వాటి త్రాగునీటి అవసరాలను తీరుస్తాయి.

11.00 ఉ. **శ్రీ ఏనుగు రవీందర్ రెడ్డి:–** నాబార్డు, పి.ఎం.జి.ఎస్.వై., సి.ఆర్.ఆర్., ఎస్.డి.ఎఫ్, గ్రాంటుల క్రింద 514 బ్రిడ్జిలను శాంక్షన్ చేయగా, అందులో 86 వంతెనలను పూర్తి చేశారని మంత్రి గారు సమాధానం ఇచ్చారు. 514 బ్రిడ్జిల్లో ఎన్ని బ్రిడ్జిలకు చెక్ డ్యాములను శాంక్షన్ చేశారో చెప్పాలని కోరుతున్నాను. ఈ చెక్ డ్యామ్‌ల నిర్మాణాల వల్ల వాటి దగ్గరున్న బావుల్లో, బోర్లలో నీళ్లు బాగా డిస్చార్జ్ అయి బాగా వస్తాయని గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పారు. పశువులకు కూడా త్రాగడానికి నీళ్లు దొరుకుతాయి. ఈ బ్రిడ్జిల నిర్మాణానికి ఎంతో ఖర్చు చేస్తున్నాము, దానికి అడిషినల్‌గా 10, 20 శాతం ఖర్చు చేస్తే చెక్ డ్యామ్ నిర్మాణం పూర్తి అవుతుంది. మా నియోజక వర్గంలో కూడా బ్రిడ్జిల నిర్మాణం జరుగుతున్నా, ఎక్కడ కూడా చెక్ డ్యామ్‌ల నిర్మాణం మాత్రం కావడం లేదు. చెక్ డ్యామ్‌లను నిర్మించడం వల్ల రైతులకు, పశువులకు ఉపయోగకరంగా ఉంటుంది. బోర్లు కూడా రీఛార్జ్ అవుతాయి. క్రొత్త చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేయాలంటే దానికి చాలా ఖర్చు అవుతుంది కాబట్టి ఉన్న బ్రిడ్జిల నిర్మాణానికే చెక్ డ్యామ్‌లను కట్టించండి. ఇప్పుడు జరిగే బ్రిడ్జిల నిర్మాణానికి మాత్రం చెక్ డ్యామ్‌లను నిర్మించడం లేదు. ఈ విషయం మీద రాబోయే రోజుల్లో ఎలాంటి చర్యలు తీసుకుంటారు. ఇప్పటి వరకు ఎన్ని చెక్ డ్యామ్‌లను నిర్మాణం చేశారు. ఇంకా ఎన్ని చేయాలి? బ్రిడ్జిల నిర్మాణం దగ్గర చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేపట్టాలని మీ ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ పుట్టా మధుకర్:–** తెలంగాణలో వందల సంవత్సరాల నుంచి గ్రామాలకు, గ్రామాలకు సంబంధాలు ఉండి, చుట్టరికాలు ఉన్నప్పటికీ, రోడ్లు సరిగ్గా లేక రాకపోకలు స్తంభించి చుట్టరికం దెబ్బతినే పరిస్థితి ఉండేది. సమైక్య రాష్ట్రంలో గ్రామాలకు రోడ్లు వేసిన దాఖలాలు లేవు. కానీ తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే దాదాపు 95 శాతం రోడ్లు పూర్తి అయినప్పటికీ, అక్కడక్కడ ఇంకా చిన్న చిన్న గ్యాప్‌లు ఉన్నాయి, వాటిని పూరించాలని గౌరవ మంత్రి గారికి విజ్ఞప్తి చేస్తున్నాను. నా నియోజక వర్గంలో శాత్రాజ్‌పల్లి అనే గ్రామం ఉంది. తాడిచెర్ల గ్రామ పంచాయతీ ఆన్లెటు, అక్కడ నుంచి తాడ్వాయి ప్రక్కకే ఆనుకొని ఉంటుంది. తాడ్వాయి గ్రామ వాసులు ఇక్కడ మలహర్ మండల్ తాడిచెర్లకు రావాలంటే భూపాల్‌పల్లి, కాటారం, కొయ్యూరు నుంచి 50 కిలోమీటర్లు రావాలి. ఆ మధ్యలో 4 కిలో మీటర్ల గ్యాప్ ఉంది. తాడిచెర్లలో మిర్చి, ప్రత్తి ఎక్కువగా పండించే రైతులు వరంగల్ మార్కెట్‌కు వెళ్లాలంటే 50 కిలో మీటర్లు వెళ్లాలి. మంత్రి ఈటల రాజేందర్ గారి నియోజక వర్గానికి, మీ నియోజక వర్గానికి, నా నియోజక వర్గానికి అనుసంధానంగా తాడిచెర్ల టు తాడ్వాయి, తాడ్వాయి టు అందువుల తండాకు ఒక లింకు అడిగాము. దయచేసి గ్రామాలకు చిన్న రోడ్లు వేస్తే రాకపోకలు సాగి, మనుషుల మధ్య ప్రేమ ఆప్యాయతలు పెరిగే అవకాశం ఉంటుంది. కనుక దయచేసి ఈ సంవత్సరం ఆ రోడ్ల మంజూరును ఇవ్వాలని కోరుతున్నాను. గతంలో ఎడ్ల బండ్ల మీద రాకపోకలు సాగించి చుట్టాలతో ఎంత ప్రేమగా ఉన్నామో, అలాగే ఈ రోజుల్లో కార్లలో వెళ్లి అంత కన్నా ఎక్కువ ప్రేమగా ఉండే ప్రయత్నం చేద్దాము. ఇప్పటికే మానేరు మీద రెండు బ్రిడ్జిలు ఆర్.అండ్.బి. ద్వారా వచ్చాయి. ఆ బ్రిడ్జిలను గొప్పగా పూర్తి చేసుకోబోతున్నాము. కాబట్టి ఏమైనా అవకాశం ఉంటే పంచయతీరాజ్ ద్వారా నిధులు మంజూరు చేయాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ తాటి వెంకటేశ్వర్లు:–** నాబార్డు, పి.ఎం.జి.ఎస్.వై., సి.ఆర్.ఆర్., ఎస్.డి.ఎఫ్., గ్రాంట్ల ద్వారా 514 పనులను శాంక్షన్ చేయించగా, అందులో 86 వంతెనలను పూర్తి చేశారని చెబుతున్నారు. నా నియోజక వర్గంలో మాత్రం ఒక్క వంతెన కూడా రాలేదు. అనేక గిరిజన గ్రామాల్లో ఈరోజు వరకు కూడా రోడ్డు సౌకర్యం సరిగ్గా లేదు. నా నియోజకవర్గంలో భూగర్భ జలాలు అధికంగా ఉన్నాయి. ఎలాంటి బోర్లు వేయకుండానే నీళ్లు అధికంగా వస్తాయి. అలాంటి ప్రాంతాలకు రోడ్ల నిర్మాణం, వంతెనల నిర్మాణం చేస్తే చాలా బాగుంటుంది. ముఖ్యంగా మా నియోజక వర్గం అశ్వారావు పేటలోని మొల్కలపల్లి మండలంలో ముత్యాలపాడు వాగు వెంబడి 365 రోజులు నీళ్లు పారతాయి. అదే మండలంలో కమలాపురం, గుండాలపాడు ఇలాంటి మారుమూల గిరిజన ప్రాంతాల్లో రోడ్డు సౌకర్యం పూర్తి స్థాయిలో లేదు. ఆ ప్రాంతంలో రోడ్లు వేస్తూనే చెక్ డ్యామ్‌లు, బ్రిడ్జిల నిర్మాణం

చేపట్టినట్లైతే ఆ ప్రాంత రైతులకు, పశువులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రతి నియోజక వర్గానికి భవిష్యత్తులో వంతెనలు, చెక్ డ్యామ్‌ల నిర్మాణాలను ఇవ్వాలని మీ ద్వారా కోరుతున్నాను.

**శ్రీ జూపల్లి కృష్ణారావు:–** 514 బ్రిడ్జిలను వివిధ గ్రాంట్ల ద్వారా రూ.829 కోట్ల రూపాయలతో మంజూరు చేయడం జరిగింది. 514 బ్రిడ్జిల్లో 138 బ్రిడ్జిలను, బ్రిడ్జి కం చెక్ డ్యామ్‌లు గా గుర్తించడం జరిగింది. ఇందులో 91 ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. ఒకటి కంప్లీట్ అయింది. 43 మాత్రం వివిధ దశల్లో ఉన్నాయి. 85 బ్రిడ్జిలు కంప్లీట్ అయ్యాయి. 285 బ్రిడ్జిలు ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. అదనంగా చెక్ డ్యామ్ కమ్ బ్రిడ్జి నిర్మాణం చేయాలంటే వాటికి సంబంధించి వివిధ గైడ్‌లైన్లు ఉన్నాయి. ఒక చెక్ డ్యామ్ నుంచి మరొక చెక్ డ్యామ్ నిర్మించాలంటే కనీసం 500 మీటర్ల దూరం ఉండాలి. సైజు, ఫౌండేషన్, ఇతరత్రా టెక్నికల్ అంశాలను బట్టి కూడా ఉంటుంది. గౌరవ సభ్యులు పుట్టా మధు గారు, రవీందర్ రెడ్డి గారు, తాటి వెంకటేశ్వర్లు గారు వివిధ అంశాలను ప్రస్తావించారు. రోడ్లకు, బ్రిడ్జిలకు సంబంధించి కూడా సర్వే చేసి ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ నిర్మించడం జరుగుతుంది. బ్రిడ్జిల విషయమైనా, రోడ్ల విషయమైనా, వీలైనంత త్వరగా, వీలైనంత ఎక్కువ నిర్మాణాలు చేస్తాము. గౌరవ సభ్యులకు నేను మనవి చేసేదేమిటంటే రోడ్లు మరియు బ్రిడ్జిల నిర్మాణానికి సంబంధించి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఈ రెండున్నర సంవత్సరాల కాలంలో రోడ్ల మెయిన్‌టెనెన్స్ లేదా క్రొత్త రోడ్ల నిర్మాణానికి, బ్రిడ్జిల నిర్మాణానికి పెద్ద ఎత్తున గతంలో ఎప్పుడూ లేనంతగా గౌరవ ముఖ్యమంత్రి గారు వేల కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది. ఎవ్వరూ అడగాల్సిన అవసరం లేకుండా పార్టీలకు, గ్రామాలకు పూర్తిగా అతీతంగా, అడిగినా, అడగకపోయినా, గ్రామం నుంచి మండలానికి, మండలం నుంచి జిల్లా కేంద్రానికి, జిల్లా నుంచి రాష్ట్రానికి రోడ్లు నిర్మాణం చేసే విధంగా పెద్ద ఎత్తున కార్యక్రమం చేపట్టడం జరిగింది. సభ్యులు ప్రస్తావించినట్లుగా రోడ్లకు సంబంధించిన గ్యాప్‌లను పూర్తి చేసే ప్రయత్నం కూడా తప్పకుండా చేస్తాము.

**శ్రీ ఏనుగు రవీందర్ రెడ్డి:–** మా వద్ద పి.ఎం.జి.ఎస్.వై. ద్వారా 4 బ్రిడ్జిలు వచ్చాయి. వాటిని చూపించడ లేదు. మంచి స్కీమ్‌లు ఉన్నాయి. అడివి లింగాల ఒకటి, తుమ్మోజివాడ, తుక్కోజివాడ మధ్యలో ఒకటి. మోతె ఒకటి. భూమ్‌పల్లిలో ఒకటి. వాటికి చెడ్ డ్యామ్ కమ్ బ్రిడ్జి నిర్మాణం చేస్తే ఒక 20 శాతం మాత్రమే ఖర్చు పెరుగుతుంది. వాటి ద్వారా లబ్ధి చేకూరుతుంది కాబట్టివాటిని ఇన్‌క్లూడ్ చేయాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ జూపల్లి కృష్ణారావు:–** బ్రిడ్జిని, చెక్ డ్యామ్‌ను రెండింటిని కూడా సైమల్‌టేనియస్‌గా నిర్మాణం చేస్తే కాస్ట్ తగ్గుతుంది. దానికి ప్రయారిటీ ఇస్తున్నాము. గౌరవ సభ్యులు చెప్పిన విషయాన్ని కూడా పరిశీలన చేసి సాధ్యాసాధ్యాలను టెక్నికల్ ఆస్పెక్ట్స్‌ను పరిగణనలోకి తీసుకొని ఆ సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తాము.

## యాదాద్రి ఆలయం వద్ద అభివృద్ధి కార్యక్రమాలు

ప్రశ్న నెం. 18(2340)

సర్వశ్రీ / శ్రీమతి పైళ్ల శేఖర్ రెడ్డి (భువనగిరి), గాదరి కిషోర్ కుమార్, గొంగిడి సునీత (ఆలేరు) – గౌరవనీయులైన సమాచార సాంకేతిక, మునిసిపలు పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా ;

అ) యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు ప్రస్తుత దశ ఏమిటి ;

ఆ) ఈ విషయంలో ఏదేని బృహత్ ప్రణాళికను రూపొందించడమయిందా ; అయితే, ఆ వివరాలేమిటి ;

ఇ) ప్రధాన ఆలయ అభివృద్ధి పనులను ఎప్పటిలోగా పూర్తి చేయడమవుతుంది ;

ఈ) ప్రతిపాదిత టెంపుల్ టౌన్‌లో భక్తులకు సమకూర్చదలచిన సదుపాయాలు, సౌకర్యాల వివరాలు ఏమిటి ;

ఉ) ఇటీవలి కాలంలో కొన్ని గ్రామాలను వై.టి.డి.ఎ. పరిధి క్రిందకు తీసుకు వచ్చిన విషయం వాస్తవమేనా ; అయితే, ఆ వివరాలేమిటి ?

సమాచార సాంకేతిక, మునిసిపలు పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి (శ్రీ కె. తారక రామారావు):– అ) ఈ క్రింది అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయి.

రిటైనింగ్ గోడ నిర్మాణం

7 గోపురాల నిర్మాణం

లడ్డు ప్రసాదం కాంప్లెక్స్

వ్రత మండపం

మాడవీధి

బ్రహ్మోత్సవం ప్రాంతం

ముఖమండపం

ప్రాకారాలు

ఆ) అవునండీ. ఆలయ సమగ్రాభివృద్ధికి బృహత్ ప్రణాళికను రూపొందించడమయింది. వాటి వివరాలు ;

ప్రధాన ఆలయ ప్రాంతాభివృద్ధి --4 ఎకరాల 20 గుంటలు

వివిఐపి కాటేజీల నిర్మాణం --13 ఎకరాల 25 గుంటలు

1వ దశలో టెంపుల్ సిటీ అభివృద్ధి--250 ఎకరాలు

11వ దశలో టెంపుల్ సిటీ అభివృద్ధి--695 ఎకరాలు

ఇతర అభివృద్ధి పనులకు --165 ఎకరాలు

అభివృద్ధి పనుల తదుపరి విస్తరణకు--106 ఎకరాలు

ఇ) ప్రధాన ఆలయ నిర్మాణాన్ని 2017 అక్టోబరు నాటికి పూర్తి చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఈ) భక్తులకు కల్పించదలచిన సదుపాయాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

వసతి గృహాలు (ఉచితంగా);

100 నాన్ – ఏ.సి. గదులు;

100 ఏ.సి. గదులు;

200 డోనర్ కాటేజీలు;

బస్సు టెర్మినల్;

40,000 మంది యాత్రికులకు అవసరమైన సదుపాయాలన్నింటితో క్యూ కాంప్లెక్స్;

త్రాగునీటి సదుపాయం;

ఎస్కలేటర్లు ;

వికలాంగులకు, వృద్ధులకు లిఫ్టులు ;

కళ్యాణ మండపం ;

7,000 కార్లకు పార్కింగు ;

కొండలపైకి ఉచిత రవాణా సౌకర్యం ;

ఫుడ్ కోర్టులు ;

5,000 మంది యాత్రికులకు నిత్యాన్నదానం.

ఉ) అవునండీ.

యాదగిర్‌పల్లి, సైదాపూర్, రాయ్‌గిరి, మల్లాపూర్, దాతర్‌పల్లి, గుండ్లపల్లి, బశ్వపురాలను వైటిడిఎ పరిధి క్రిందకు తీసుకురావడమయింది.

11.10 ఉ. **శ్రీమతి గొంగిడి సునీతః–** అధ్యక్షా, మంత్రిగారికి ధన్యవాదాలు. మంత్రిగారిని రెండు అంశాల గురించి అడుగుతున్నాను. అనేక మంది భక్తులు యాదాద్రిలో మనం నిర్మిస్తున్న కాటేజ్‌లు భక్తులు కట్టిస్తామని, తమకు అవకాశం ఇవ్వాలని అంటున్నారు. ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పెడతారా? ఐటిడిఎ ద్వారా లేక ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా తెలియ చేస్తారా? ఎమ్ఎన్‌సి కంపెనీలే కాకుండా నర్సింహస్వామి మీద ప్రత్యేకమైన విశ్వాసం, నమ్మకం ఉన్న భక్తులు ప్రతి సంవత్సరం మొక్కులు చెల్లించుకోడానికి అక్కడికి వస్తూ ఉంటారు. వారి పేరు మీద కాటేజ్ నిర్మించాలని అనుకుంటున్నారు కాబట్టి వాటి గురించి సమాచారం అడుగుతున్నారు. ఆ సమాచారం అందించాలని మంత్రిగారిని కోరుతున్నాను. యాదగిరి గుట్ట పట్టణానికి రద్దీ బాగా ఉంటుంది. అర్ధరాత్రి కూడా భక్తులు వస్తూ ఉంటారు. ఐటిడిఎ పరిధిలో ఉన్న యాదాద్రి పట్టణంలో గ్రామ పంచాయతీలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజి తీసుకువస్తే బాగుంటుందని, అది ఐటిడిఎ ద్వారా చేయిస్తే బాగుంటుంది.

ఐటిడిఎ పరిధిలో ఐదు గ్రామాలలో ధరలు బాగా పెరగడం వల్ల స్మశాన వాటికలకు సంబంధించి ఉచితంగా స్థలం ఇవ్వడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. అక్కడ స్మశాన వాటికలు లేక చాలా ఇబ్బందిగా మారింది. కాబట్టి అక్కడ మూడు వైకుంఠధామాలు నిర్మిస్తే బాగుంటుంది. ఈ విషయం గురించి మంత్రిగారు తెలపాలని కోరుతున్నాను.

**శ్రీ జి. కిషోర్ కుమార్ః–** తెలంగాణ రాష్ట్రంలో చాలా ప్రతిష్టాత్మకంగా ఉన్న దేవాలయాలను అభివృద్ధి చేసే క్రమంలో భాగంగా గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రణాళికలు రూపొందించి ముందుకు పోతున్న సందర్భంలో కెటిఆర్‌గారు సభ దృష్టికి తీసుకువచ్చారు. చేస్తున్న అభివృద్ధిలో పనులు త్వరగా జరగాలని కోరుకుంటున్నాము. అక్టోబర్, 17 నాటికి దాదాపుగా ప్రధాన ఆలయ నిర్మాణం జరుగుతుందని వారు చెప్పారు. దానితోపాటు క్రింద ఉన్న పాత గుడిని డెవలప్ చేయడానికి ప్రతిపాదన ఏమైనా ఉందా? టెంపుల్‌సిటీకి సంబంధించిన ల్యాండ్, రెసిడెన్షియల్ స్కూల్‌కు సంబంధించిన ల్యాండ్ అక్వైర్ చేశారా? అక్వైర్ చేసే దశలో ఉన్నాయా తెలపాలని కోరుతున్నాను. టెంపుల్‌సిటీకి డోనార్స్ వచ్చి వాళ్లవాళ్లస్వంత బిల్డింగ్స్ కట్టే ప్రతిపాదన ఏదైతే ఉందో దానికనుగుణంగా కొన్ని బ్లాక్స్ కట్టించే అవకాశం ఉందా? లేక ఇంకా పరిశీలన దశలోనే ఉన్నాయా తెలపాలి. యాదగిరి గుట్ట పట్టణానికి సంబంధించి అండర్‌గ్రౌండ్ డ్రెయినేజికి సంబంధించి ప్రతిపాదనలు తెప్పించి ముందే పూర్తి చేస్తే బాగుంటుందని మంత్రిగారి దృష్టికి తెస్తున్నాను. ఐటిడిఎ కమిటీ ఉన్నప్పటికీ, దేవాలయ కమిటీ కూడా ఉంది. దానిని ముందే ప్రకటిస్తే బాగుంటుంది . దానితోపాటు రాబోయే రోజులలో టెంపుల్ సిటీ నుండి ప్రధాన ఆలయానికి రోప్‌వే వేసే ప్రతిపాదన ఉందా తెలపాలని కోరుతున్నాను.

**శ్రీ కె. తారక రామారావుః–** అధ్యక్షా, యాదాద్రిని తెలంగాణకు తలమానికంగా ధార్మికక్షేత్రంగా భారతదేశంలోనే పేరు ప్రఖ్యాతులు వచ్చే విధంగా రూపొందించాలనే ఆలోచనలో భాగంగా గౌరవ ముఖ్యమంత్రిగారు నిర్ణయించుకున్నారు. ఇంతకుముందు సమాధానంలో చెప్పిన విధంగా ముఖ్యమంత్రిగారు అన్ని రకాలుగా ఆలోచనలు చేసి, పెద్దలను సంప్రదించిన తరువాత ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగింది. కాటేజిల నిర్మాణం విషయంలో ఎవరైతే ముందుకు వస్తున్నారో, ఆ డోనర్స్ వివరాలు గొంగిడి సునీతగారి వద్ద ఉంటే అది ప్రభుత్వంతో కాని స్పెషల్ ఆఫీసర్‌కు తెలిపినట్లయితే ఆ డోనార్స్‌కు అవకాశం కల్పిస్తాము. స్వచ్ఛందంగా నిధులు ఇచ్చేవారిని ఆహ్వానిస్తున్నాము. వెబ్‌సైట్ ప్రారంభించి డొనేషన్స్ స్వీకరించాలనే ఆలోచనలో ఉన్నాము. ఆ కార్యక్రమం త్వరలో ప్రారంభమవుతుందని తెలియ చేస్తున్నాము.

యాదగిరి గుట్ట టెంపుల్ సిటీలో భాగంగా అండర్‌గ్రౌండ్ నిర్మాణం తీసుకుంటే బాగుంటుందని గౌరవ సభ్యులు చెప్పారు. తప్పనిసరిగా ఆ ప్రతిపాదనను పరిశీలిస్తాము. కిషోర్‌గారు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ధార్మికక్షేత్రంగానే కాక ఆధ్యాత్మికక్షేత్రంగానే కాకుండా రెలిజియస్ టూరిజమ్ కేంద్రంగా చేస్తాము. దేశంలో చాలా పెద్దయెత్తున రెలిజియస్ టూరిజమ్ జరుగుతోంది. అందువల్ల టూరిజమ్ అట్రాక్షన్ ఉన్న కేంద్రంగా చేయాలని ఆలోచిస్తున్నాము. వారు చెప్పిన ప్రతిపాదనలన్నీ పరిశీలిస్తాము. భూసేకరణ చాలా వరకు జరిగింది. ఇంకొంత సేకరణ జరగవలసి ఉంది. వారు కోరిన మేరకు ఆ ప్రాంతానికి చెందిన గౌరవ శాసనసభ్యులు , జిల్లా మంత్రిగారితో త్వరలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి స్థానికంగా ఉన్న సమస్యలను, వారిచ్చే సూచనలను పరిశీలనలోకి తీసుకుంటామని తెలియ చేస్తున్నాను.

MR. SPEAKER: Question Hour is over.

All the Papers are deemed to have been laid on the Table of the House.

## సభా సమక్షంలో ఉంచబడిన పత్రాలు

1. A copy of the Annual Report of Central Power Distribution Company of Andhra Pradesh Limited (CPDCL) for the year 2012-2013 as required under Section 619-A of the Companies Act, 1956.

2. A copy in each of the Annual Reports of Southern Power Distribution Company of Telangana Limited (SPDCL) for the years 2013-2014, 2014-2015 and 2015-2016 as required under Section 394 of the Companies Act, 2013.

3. A copy of the Annual Report of Northern Power Distribution Company of Telangana Limited (NPDCL) for the year 2014-2015 as required under Section 394 of the Companies Act, 2013.

4. A copy of the Annual Report of Telangana Power Finance Corporation Limited for the year 2014-2015 as required under Section 394 of the Companies Act, 2013.

5. A copy of the 95th Annual Report & Accounts of the Singareni Collieries Company Limited for the year 2014-2015 as required under Section 394 of the Companies Act, 2013.

## సభా కార్యక్రమము

### వాయిదా తీర్మానం అనుమతి గురించి_

శ్రీ జి. కిషన్ రెడ్డిగారు హైదరాబాదులోని ధర్నా చౌక్ వద్ద నిరసన ప్రదర్శనలను నిషేధించిన విషయం గురించి ఇచ్చిన వాయిదా ప్రతిపాదనను తిరస్కరించడమైంది.

## జీరో అవర్

**శ్రీ బానోతు శంకర్ నాయక్ః–** అధ్యక్షా, ఇది చాలా ముఖ్యమైనది. మరుగుదొడ్లు నిర్మించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఇజిఎస్ క్రింద సిసి రోడ్లు వేయాలని అంటున్నాము. ఇసుకకు చాలా ఇబ్బంది అవుతుంది. సర్పంచ్‌లు, ఎమ్‌పిటిసిలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇసుక ఎలా సప్లై చేస్తే బాగుంటుందనే విషయం గురించి ప్రభుత్వం ఆలోచన చేస్తే బాగుంటుంది.

నా నియోజక వర్గంలో పోడు భూములకు సంబంధించిన హక్కు పత్రాలున్నా గిరిజనులను అటవీ శాఖాధికారులు ఇబ్బంది పెడుతున్నారు. అటవీశాఖధికారుల మీద చర్య తీసుకోవాలి. ఆర్ఓఎఫ్ఆర్ ఉన్నా, యాభై సంవత్సరాల నుండి ఇళ్లు కట్టుకున్న వారిని కూడా భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. వారి మీద చర్య తీసుకోవాలి.

**శ్రీ జోగు రామన్నః–** గౌరవ సభ్యులు చెప్పిన దానిని నోట్ చేసుకున్నాను.

**డా. జి. చిన్నారెడ్డి (వనపర్తి)ః–** అధ్యక్షా, నేను ప్రస్తావించబోయే విషయం మార్కెటింగ్ శాఖకు సంబంధించింది. ఆ మంత్రిగారు సభలో లేరు. వారి తరపున ఎవరైనా నోట్‌చేసుకొని సరైన చర్య తీసుకోవాలని కోరుతున్నాను. ఈ సంవత్సరం మిర్చి పండించినరైతు చాలా ఇబ్బంది పడుతున్నాడు. మిర్చి ఘాటు కంటే మిర్చి పంటకు మార్కెట్‌లో ధర దొరకక రైతు కన్నీటి పర్యంతం అవుతున్నాడు.

**11.20 ఉ.** పోయిన సంవత్సరం క్వింటాలు మిర్చి రేటు రూ. 12000 ఉంది. ఈ సంవత్సరం అంత కన్నా ఎక్కువ ధర పలుకుతుందనే ఉద్దేశ్యంతో చాలా మంది రైతులు మిర్చి పంటను పండించారు. తుమ్మల నాగేశ్వర రావు గారు ఇక్కడే ఉన్నారు. వరంగల్ మార్కెట్‌కు మిర్చి బస్తాలు, గుట్టలుగుట్టలుగా వస్తున్నాయి కాని కొనే నాథుడు లేడు. పోయిన కరీఫ్ మొదలైనప్పుడు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు, ఈ సంవత్సరం పత్తిని పండించవద్దు, పల్సెస్‌ను పండించని పెద్దఎత్తున ప్రచారం చేశారు. అదే విధంగా దొడ్డు శెనగల ధర ఏ విధంగా ఉందో ప్రభుత్వం గమనించాలి. క్వింటాల్ కందులకు రూ. 5050 కి కొనాలి. కొంతమేరకు ప్రభుత్వం ముందుకు వచ్చి కొనుగోలు చేయడం జరిగింది. తరువాత ప్రభుత్వం కొనలేనందువల్ల కందుల ధర పడిపోయింది. ఈటెల రాజేందర్ గారు సభలోనే ఉన్నారు. ప్రతిసంవత్సరం బడ్జెట్‌లో మార్కెట్ ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటుచేసుకొనేవాళ్లం. దురదృష్టం ఏమిటంటే, ఈ సంవత్సర బడ్జెట్‌లో వ్యవసాయ మార్కెట్ ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటుచేసుకోకపోవడం శోచనీయం. దయచేసి మిర్చిని కొనుగోలు చేయించండి, దొడ్డు శెనగలకు మంచి ధర ఇప్పించండి, కందులను కూడా కొనుగోలు చేయాల్సిందిగా కోరుతున్నాను.

**శ్రీ ఈటల రాజేందర్ (ఆర్థిక శాఖ మంత్రి):-** అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకున్నాను. ఈ విషయమై ఇప్పటికే ఆలోచన చేస్తున్నాము. తప్పకుండా న్యాయం చేస్తాము.

**శ్రీ జి. బాలరాజు:-** ధన్యవాదాలు అధ్యక్షా. నా నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలం సముద్ర నీటి మట్టం నుండి 650 మీటర్లు ఎత్తైన ప్రాంతంలో ఉంది. అప్పర్ ప్లాట్‌గా పిలవబడుతున్న ప్రాంతం అది. అక్కడ ఇరిగేషన్‌కి సంబంధించి ఎటువంటి సోర్స్ లేదు అధ్యక్షా. మానగడ్డ వాగు, ధారవాగు అని రెండు వాగులున్నాయి. గతంలో ఏ ప్రభుత్వం కూడా అక్కడ చెక్ డ్యామ్స్ నిర్మాణం కోసం, వాటర్ స్టోరేజ్‌కి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. చెక్స్‌డామ్స్ లేవు ఒక డ్యామ్‌ని అక్కడ నిర్మించినట్లయితే హాఫ్ టీఎంసీ నీళ్లు దాదాపు నిలువ ఉండడానికి అవకాశం ఉంటుంది. ప్రాజెక్టు ముందుకు వెళ్లాలంటే, ఫారెస్ట్ అనుమతులు, ఇతరత్రా కారణాలు చెప్పి ప్రాజెక్టును వెనక్కినెట్టేస్తున్నారు. ఆ రకంగా కాకుండా ప్రభుత్వం చొరవ తీసుకొని చెక్‌డామ్స్, పెద్ద డ్యామ్‌ను నిర్మించినట్లయితే ఆ ప్రాంతంలో ఉన్నటువంటి 8-10 గ్రామాలకు గ్రౌండ్ వాటర్ వస్తుంది. ఫారెస్ట్‌లోని జీవరాశులు తాగడానికి నీళ్లు కూడా లభ్యంగా ఉంటాయి. చెక్‌డ్యామ్స్ నిర్మాణం విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరుతున్నాను.

**శ్రీ తుమ్మల నాగేశ్వరరావు:-** అధ్యక్షా, గౌరవ శాసన సభ్యులు చెప్పిన అంశాన్ని నోట్ చేసుకోవడం జరిగింది. సంబంధిత శాఖకు తెలియచేసి రెండు చెక్‌డ్యామ్స్ ఇచ్చే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుంది.

جناب جعفر حسین (Janab Jaffar Hussain): جناب اسپیکر صاحب! آج Zero Hour میں میں جو مسئلہ اٹھانے جا رہا ہوں وہ Minister for Health سے متعلق ہے۔ حال ہی میں نیلوفر ہاسپٹل میں پانچ عورتوں کا انتقال ہوا۔ وہ ایسی اموات ہوئیں کہ نہ صرف ہمارا میڈیا بلکہ قومی میڈیا نے بھی اس کو highlight کیا۔ اس کے بعد منسٹر صاحب نے ٹھیک ہے inspection کیا اور رپورٹ منگوائی مگر آج تک وہ اموات کیوں ہوئیں وہ وجہ میں یا کسی ڈی ایم ای کو declare نہیں کیا گیا۔ اس کے ساتھ ہی ساتھ پانچ عورتوں کی جو موت ہوئی اس میں میں سمجھتا ہوں کہ سرکاری دواخانوں میں جو سہولتیں نہ ہونے کی وجہ سے موت ہوئی۔ نیلوفر ہاسپٹل میں نیا Intensive Care Block بنا۔ اس کا افتتاح منسٹر صاحب نے کیا۔ اس وقت میں نے ان سے کہا تھا کہ وہاں پر ہم کو اسٹاف کی ضرورت ہے۔ Doctors 92 کی تھی۔ Staff Nurses 357 کی تھی۔ Technical Staff 120 کی تھی، Administrative Staff 19 کی تھی اور دوسرے اسٹاف کی بھی ضرورت تھی۔ لیکن اس اسٹاف کو فراہم نہیں کیا گیا۔ جب وہ خواتین serious ہوئیں تو اگر ان کو Intensive Care Unit میں لے جایا جاتا تو ان کو ventilator facilities بھی مل سکتی تھیں۔ مگر ایسا نہیں کیا گیا جس کی وجہ سے ان خواتین کے اموات ہوئے۔ لہٰذا میں حکومت سے یہ مطالبہ کرنا چاہتا ہوں کہ موجودہ نیلوفر ہاسپٹل میں بھی صرف اور صرف 60% staff and Doctors ہیں جس کی وجہ سے سہولتیں فراہم نہیں ہو رہی ہیں۔ روزانہ دو ہزار سے زیادہ out patients آتے ہیں اور روزانہ ایک ہزار سے زیادہ وہاں پر In patients رہتے ہیں۔ صاحب! یہ صحت کا اہم معاملہ ہے۔ لوگ مر رہے ہیں۔ دیگر سرکاری دواخانوں میں بھی لوگ مر رہے ہیں۔ تو میرے کہنے کا مطلب یہ ہے کہ اگر آپ سرکاری دواخانوں میں اچھی سہولتیں فراہم کریں گے تو یہ جو واقعات ہوئے ہیں پچھلی بار سروجنی آئی ہاسپٹل میں بھی ایسا ہی واقعہ ہوا تھا آج نیلوفر ہاسپٹل میں ایسا ہوا تو اور بھی دواخانے ہیں۔ شہر کے سب ہی دواخانوں کو دیکھنا چاہئے اور ان میں پوری سہولیات فراہم کرنی چاہئیں۔ بہت بہت شکریہ صاحب۔

**శ్రీ కె. తారక రామారావు:-** అధ్యక్షా, గౌరవసభ్యులు నీలోఫర్ హాస్పిటల్‌లో ఉన్న పరిస్థితిని గురించి వివరించారు. ఆ విషయాన్ని గౌరవ మంత్రిగారికి నివేదించడం జరుగుతుంది.

**శ్రీ ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ (ఉప్పల్):-** అధ్యక్షా, ఆసుపత్రి పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. ఒక వైపు బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. మరొకవైపు ఒక ట్రైబల్ యువకుడు అనారోగ్యం రీత్యా మహబూబ్‌నగర్ నుండి హైదరాబాదుకు వచ్చి చెస్ట్ హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యాడు. ఆక్సిజన్ సప్లై చేస్తే అతని ప్రాణం నిలబడేది. అక్కడున్నటువంటి సిబ్బంది నిర్లక్ష్యం, అవినీతి, అలసత్వం వల్ల ఒక నిండు ప్రాణం పోయింది. ఇప్పుడే సోదరుడు నీలోఫర్ ఆసుపత్రి పరిస్థితి గురించి చెప్పారు. చెస్ట్ ఆసుపత్రిలో ఈ రకమైన పరిస్థితి ఎదురయ్యింది. గాంధీ ఆసుపత్రిలో గత శనివారం నాడు 5 పేషెంట్స్‌కి స్వైన్‌ఫ్లూ వచ్చిందని డాక్టర్లు గుర్తించారు. వాళ్ల పరిస్థితి అయోమయంగా ఉంది. వారిని పట్టించుకునే నాథుడు

లేదు. సావధాన తీర్మానం కింద చేపట్టవలసిన విషయం ఇది. నగరంలో డెంగ్యూ వ్యాధి విపరీతంగా సోకి, గత మూడు మాసాల నుండి కొన్ని వందల మంది చనిపోయారని ప్రభుత్వ ఆసుపత్రుల నుండి నివేదికలు అందాయి. వాళ్లందరూ పేద ప్రజలు.

**శ్రీ కె. తారక రామారావు:-** జీరో అవర్‌లో సర్వసాధారణంగా ప్రభుత్వం వైపు నుండి సమాధానం రాదు. వారు లేవనెత్తిన సమస్య తీవ్రత దృష్ట్యా ఈ విషయాన్ని తెలియజేస్తున్నాను. గౌరవ ఆరోగ్య మంత్రి గారి దృష్టికి చెస్ట్ ఆసుపత్రి ఉదంతం వచ్చింది. వారు విచారణకు ఆదేశించడం జరిగింది. బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది. ఎంక్వైరీ జరుగుతోంది అధ్యక్షా.

**శ్రీ ఆరూరి రమేష్ (వర్ధన్నపేట):-** అధ్యక్షా నా నియోజకవర్గం వర్ధన్నపేట నియోజకవర్గం. గతంలో హనుమకొండ, శాయంపేట, స్టేషన్‌ఘన్‌పూర్ సంబంధించిన కలయిక వర్ధన్నపేట నియోజకవర్గం. బ్రిడ్జిలు, చెక్‌డామ్స్ విషయంలో ఇందాక నాకు క్వశ్చన్ అవర్‌లో అవకాశం రాలేదు. ఇప్పుడు నాకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. తమరు ప్రాతినిథ్యం వహించిన శాయంపేట నియోజకవర్గం పరిధిలో మల్లారెడ్డి పల్లి, సుదనపల్లెలో ఒక వాగు ఉంది. గ్రామాలు పక్కపక్కనే ఉన్నా వంతెన లేనందు వల్ల 60-70 కిమీ చుట్టూ తిరిగి వెళ్తున్న పరిస్థితి అక్కడ ఉంది. సుదనపల్లి ఆర్థికశాఖా మంత్రి గారి నియోజకవర్గానికి దగ్గరగా ఉంటుంది. వారి నియోజకవర్గ అభివృద్ధిని చూసి నా నియోజకవర్గం ప్రజలు మమ్మల్ని పట్టించుకోవడం లేదని అనుకుంటున్నారు. పంచాయత్‌రాజ్ శాఖా మంత్రి గారు ఇక్కడే ఉన్నారు. దయచేసి ఆ వాగుపై వంతెనను నిర్మించడంతోబాటు చెక్‌డ్యామ్‌ను నిర్మిస్తే 500 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని పంచాయత్‌రాజ్ శాఖ మంత్రి గారిని, ఆర్థిక మంత్రి గారిని రిక్వస్ట్ చేస్తున్నాను.

**శ్రీ జూపల్లి కృష్ణారావు:-** అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పింది నోట్ చేసుకున్నాను. వారి చెప్పిన అంశంపై సానుకూలంగా ప్రయత్నం చేస్తాము.

11.30 ఉ. **శ్రీ ఆర్. క్రిష్ణయ్య (ఎల్.బి.నగర్):-** అధ్యక్షా, ఇది బి.సి సంక్షేమానికి సంబంధించిన ప్రశ్న. గౌరవ ముఖ్యమంత్రిగారు ఈ మధ్య తమిళనాడు తరహా రిజర్వేషన్‌లను మన తెలంగాణ రాష్ట్రంలో కూడా అమలు చేస్తామని ప్రకటిస్తున్నారు. తమిళనాడు తరహా రిజర్వేషన్‌లంటే బి.సిలకు రిజర్వేషన్‌లను పెంచడం. తమిళనాడు రాష్ట్రంలో బి.సిలకు 49 శాతం, కర్నాటక రాష్ట్రంలో 52 శాతం, మహారాష్ట్రలో 36 శాతం బిసిలకు రిజర్వేషన్‌లు అమలులో ఉన్నాయి. మన రాష్ట్రంలో కూడా ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం బిసిల జనాభా 52 శాతమని తెలిసింది. కాబట్టి రాష్ట్రంలో నివశిస్తున్న బిసిలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల యొక్క రిజర్వేషన్‌లను 52 శాతానికి పెంచాలని మీద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను. అదే విధంగా సమగ్ర కుటుంబ సర్వేలో కులాల వారీ లెక్కలు తీశారు, వాటి వివరాలు అధికారికంగా ప్రకటిస్తే బాగుంటుందని మీద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

**శ్రీ జోగు రామన్న (అటవీ శాఖ మంత్రి):-** అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన అంశాన్ని నోట్ చేసుకోవడం జరిగింది.

**MR.SPEAKER:-** Now, Tea –break for 15 minutes.

(Then the House adjourned at 11.32 A.M for 15 minutes)

12.00 మ. (తేనీటి విరామానంతరం సభ తిరిగి మ.12.03 నిమిషాలకు ప్రారంభమైనది. గౌరవ సభాపతి అధ్యక్షస్థానంలో ఉన్నారు.)

## 2017- 2018 సంవత్సరపు వార్షిక ఆదాయ-వ్యయ పట్టిక (బడ్జెట్)పై - సాధారణ చర్చ (రెండవ రోజు)

**శ్రీ కె. జానారెడ్డి (నాగార్జునసాగర్):-** అధ్యక్షా, నాల్గవ సారి ప్రవేశపెట్టిన బడ్జెట్ గురించి మాట్లాడటానికి మొదటగా నా ముందు మాటలను తెలియజేస్తాను. ఏదైనా సభలో ఈ విధంగా మాట్లాడుతున్నప్పుడు కేవలం విమర్శ చేయడానికి, ప్రభుత్వానికి వ్యతిరేక ధోరణిలో మాట్లాడుతున్నారని లేదా ప్రభుత్వం చెబుతున్న వివరాలు వాస్తవాలా, అవాస్తవాలా అని అవగాహన చేసుకోవాల్సిన అవసరం ప్రభుత్వానికి మరియు ప్రతిపక్షాల వారికి ఉంటుంది. ఈ రాష్ట్రం ఏర్పడటానికి ఈ అధికార పార్టీ పోరాటాలు చేసిన విధంగానే, కాంగ్రెస్ పార్టీ కూడా యుద్ధం చేసింది. ఆవిధంగా అధికారంలోకి వచ్చిన పార్టీ తెలంగాణ ప్రజల ఆకాంక్షలు మరియు అభిప్రాయాలకు అనుగుణంగా కార్యక్రమాలు ఉండాలనేది ప్రజల ఆకాంక్ష.

ప్రజల ఆకాంక్షలను, ఆశయాలను, ప్రజలకిచ్చిన హామీలను తీర్చి ప్రజాభిమానాన్ని పొందటానికి ప్రయత్నించడంలో అభ్యంతరం లేదు. ఏ ఉద్దేశం కోసమైతే ఈ రాష్ట్రం ఆవిర్భవించిందో, ఆ ఉద్దేశానికి అనుగుణంగా రాష్ట్రంలో పరిపాలన జరగాలనీ, ప్రభుత్వం ఆ మేరకు పని చేయాలని ప్రతిపక్షం కోరడంలో సందేహం లేదు. అదే విధంగా మేము చెప్పే విషయాలు వాస్తవాలా లేదా మేమిచ్చే సూచనలు సరైనవా కావా అని ప్రభుత్వ పార్టీ వారు అవగాహన చేసుకొని, వాస్తవాలను దృష్టిలో ఉంచుకొని పరిపాలన సాగించడం వారి ధర్మం. ఒక వేళ ప్రభుత్వం చెబుతున్న విషయాల్లో యదార్థం ఉందా అని మేము అడిగిన సందర్భంలో మీరు తగు వివరాలతో అమలు చేస్తున్న తీరును, వాస్తవాలను క్షేత్రస్థాయిలో లేదా మీరిచ్చే గణాంకాల ద్వారా అయినా నిరూపించాలి.

ఈ వాస్తవాలను తెలుసుకొని తగిన సందర్భంలో ఎవరిని విశ్వసించాలనేది ప్రజలు నిర్ణయించుకుంటారు. ఈ క్రమంగా మాట్లాడుతున్న తీరులో, ప్రభుత్వమైపు నుంచి మేము చెబుతున్నాము మీరు విని వెళ్లండనే ధోరణి కానీ, మేము చెబుతుంటే మా మాట వింటారా లేదా అని ప్రతిపక్షం కానీ అనుకోవాల్సిన పరిస్థితి లేదు. ఈ వాస్తవాలను ప్రజలు బేరీజు చేయడానికి లేదా ప్రతిపక్ష పార్టీగా బాధ్యతను నెరవేర్చడానికి, విశ్వసించిన ప్రజలకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వ పక్షంగా వారు కొనసాగాలి. ఈ విషయాలను అర్థం చేసుకొని సభలో ముందుగా ఆ విషయాలపై చర్చ జరగాలి. ఆ విధంగా వచ్చే ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు, వారి వారి బాధ్యతలను నెరవేరుస్తున్నారా లేదా అనే పరంపరను అందించడానికి వీలుగా చర్చ జరగాలి. ఒక వేళ మీరు ప్రభుత్వంలో ఉండవచ్చు లేదా ఇతరులు ప్రతిపక్షంలో ఉండవచ్చు. ప్రతిపక్ష పార్టీలు మాట్లాడుతున్న తీరు సరైనదా కాదా అనే పరంపర కొనసాగించడానికే ఈ వేదిక అనే అంశాన్ని అర్థం చేసుకోవాలని కోరుతున్నాను.

**12.10 మ.** అధికార పార్టీలో జరుగుతున్నటువంటి తీరును నేను ఈ బడ్జెట్‌లో మీ ముందు ఉంచుతాను. దానికి ముందు ఆర్థికమంత్రి గాని, ఇతర మంత్రులు గాని అభివృద్ధి చేయడం గురించి అప్పులు తీసుకురావడం సహ్యమైనదా కదా అనే విషయానికి అనుగుణంగా మీరు చెప్తున్న అప్పులు తప్పని సరిగా తీసుకురావాల్సిందే. దానికి ఎవరూ అభ్యంతరం చెప్పడం లేదు. కాని, అప్పులు, ఆస్తులు బేరీజు వేసుకోవాలి. ఆస్తుల కంటే అప్పులు మించితే ద్రవ్య లోటు ఏర్పడి, అభివృద్ధి కుంటుపడి గందరగోళ పరిస్థితి ఏర్పడుతుంది. ఆ విధంగా ఒకటి రెండు సార్లు ఉంటే పరవాలేదు. కాని కొన్ని సంవత్సరాలైనా పూర్తి చేసే పరిస్థితి లేదు. అప్పులు ఆ దిశలో ఉన్నాయా లేదా అనే విషయాన్ని ప్రభుత్వ పక్షం ఆలోచించుకోవాలి. అది ఔననుకుంటే మేము తప్పనిసరిగా సహకరించాలి. లేదంటే మేము గుర్తు చేయాల్సిన అవసరం ఉంది. 1956 సంవత్సరం నుండి 1994 సంవత్సరం వరకు అప్పు 100 ఉంటే ఆస్తి 101 ఉండేది. అంటే ఆస్తుల విలువ ఎక్కువ ఉండేది. 1994 సంవత్సరం నుండి 2000 సంవత్సరం వరకు అప్పులు 100 ఉంటే ఆస్తులు 50 అయిపోయాయి. అందువల్ల లోటు ఏర్పడి 2004 సంవత్సరానికి 23 కోట్ల రూపాయలు రెవెన్యూ లోటు ఏర్పడి ఇంకా ఇబ్బందికరమైన పరిస్థితి వచ్చింది. అప్పటికి ఎఫ్.ఆర్.బి.ఎమ్. రావడం, తర్వాత నాటి ప్రభుత్వాలు దృష్టిలో పెట్టుకుని వివరించడం, తెచ్చిన అప్పులు, చేసిన పని రెండింటిని కలిపి ఒక ప్రక్క అప్పులను తీర్చుకుంటూ, ఒక ప్రక్క ఆస్తులను పెంచుకుంటూ, పది సంవత్సరాలు 100 శాతం అప్పుల ఉంటే ఆస్తులను 110శాతానికి పెంచింది. అంటే పదేళ్ల కాలంలో తిరిగి బ్యాలెన్స్ చేసిన విషయాన్ని గమనించాలి. ఇది ఏ ప్రభుత్వమైనా ఆలోచించుకోడానికి అవకాశం ఉంటుంది. దీనితోబాటు జి.డి.పి., జి.ఎస్.డి.పి., కరెంట్ ప్రైసెస్, కాన్స్టిట్యూట్ ప్రైసెస్ అన్ని అంశాలు ఉన్నాయి. కాని ఒకటి రెండు విషయాలను చెప్పి ఎక్కువ సమయం తీసుకోకుండా ప్రయత్నం చేస్తాను. 2004 సంవత్సరం నుండి 2014 సంవత్సరం వరకు తెలంగాణ జి.ఎస్.డి.పి.ని సపరేట్ చేస్తే అది సుమారు 9.8శాతం ఉండి నాడు గుజరాత్ కంటే ఎక్కువ శాతం ఉందన్న విషయాన్ని గమనించాలి.

అదే విధంగా పర్‌క్యాపిటా విషయంలో 2014 సంవత్సరం నాటికి భారతీయ సగటు కంటే తెలంగాణ రాష్ట్ర సగటు పర్‌క్యాపిటా ఇన్‌కమ్ ఎక్కువగానే ఉన్నది. 2012-13 సంవత్సరంలో కరెంట్ ప్రైసెస్ 11వేలు ఉంటే 2013-14 సంవత్సరంలో 13.9 ఉంది. 2013-14 సంవత్సరంలో 13.4 ఉంది. 2015-16 సంవత్సరంలో 11.67 ఉంది. ఇంచు మించు ఒకటే ఉంది. ప్రధానంగా మేము పదే పదే చెప్తున్న విషయం ఏదైతే ఉందో వ్యవసాయ రంగంలో కొంత తగ్గుకుంటూ వస్తుంది. పరిశ్రమల్లో గ్రోత్ రేటు పెరుగుతూ 2013-14 సంవత్సరంలో 106 కోట్లు సుమారు 107లక్షల టన్నుల ఆహార ధాన్యాలు ఉంటే, 2014-15 సంవత్సరంలో 72లక్షలకు తగ్గింది. 2015-16 సంవత్సరంలో 51లక్షకు తగ్గింది. 2016-17 సంవత్సరంలో చాలా అడ్వాన్స్‌డ్ ఎస్టిమేట్ ఇచ్చారు. సుమారు 77లక్షలుగా ఇచ్చినట్లు ఉన్నారు. 2013-14 సంవత్సరంలో 34.31 లక్షల ఎకరాలు, 2014-15 సంవత్సరంలో 26.13లక్షల ఎకరాలు, 2015-16 సంవత్సరంలో 21.08లక్షల ఎకరాలు ఆహార ధాన్యాల క్రింద కల్టివేట్ చేశారు. కల్టివేషన్ సుమారుగా 34 శాతానికి పెరిగిందని అన్నారు. సుమారు 50 నుండి 55 శాతం వ్యవసాయం మీద ఆధార పడి ఉన్న మన రాష్ట్రంలోని వ్యవసాయ పరిస్థితి తగ్గిపోయినప్పుడు అనేక మంది ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. ఆ విధంగా గ్రామీణ ప్రజలు మరియు వ్యవసాయదారుల పరిస్థితి అధ్వాన్నంగా తయారయ్యే పరిస్థితి ఏర్పడింది. అందుకని ఆర్థికంగా, వ్యవసాయ పరంగా సంక్షోభానికి గురి అవుతుందన్న విషయాన్ని మీకు గుర్తు చేస్తున్నాను.

బడ్జెట్ విషయానికి వస్తే ఇప్పటికే నేను బడ్జెట్ మీద మూడు సార్లు మాట్లాడాను. ఇకపై మా సభ్యులు ఎవరైనా మాట్లాడతారు కాని నేను మాట్లాడను. బడ్జెట్ గురించి నేను పదే పదే మీకు చెప్పడం సబబు కాదేమోనని నేను భావిస్తున్నాను. రాష్ట్రం తన శక్తిసామర్థ్యాలన్నీ వినియోగించుకుని ఎల్లలు దాటిన అభివృద్ధిని చవి చూసింది. ప్రజల పట్ల నిర్లక్ష్య విధానం నుండి ప్రజా కేంద్ర విధానాల వైపు నైర్యాశం నుండి ఆశను కల్పించే విషయంలో అభ్యంతరమే లేదు. మీరు చెప్పే మాటల్లో అద్భుతం, గొప్ప అన్నీ ఉన్నాయి. కాని ఎంత అభివృద్ధి జరిగింది అనేది అంశం. పైగా ఏమి చెప్తున్నారు, అభివృద్ధి ఎల్లలు దాటిందని చెప్తున్నారు.

**12.20 మ.** కాని బడ్జెట్‌లోని అంకెల పెరుగుదల మాత్రం సప్త సముద్రాలు దాటినట్టున్నది, కాని అభివృద్ధి ఎక్కడికి వెళుతోందన్న విషయాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉంది. భారతదేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత పెరుగుదల చూపిస్తూ బడ్జెట్ పెట్టిన రాష్ట్రం మరొకటి లేదని వివరాలను తెప్పించి ఈ సభ ముగిసేలోపు ఆర్థిక శాఖ మంత్రి గారు తెలియజేస్తే, మేము ఆ విషయాలను అర్థం చేసుకుని, ఈ విషయాలు వాస్తవమా కాదా అనే విషయాలను ఆమోదిస్తాము. వాస్తవమా కావా అనే విషయాలను మీరు ఒకసారి గుర్తు చేసుకోండి. ఈ బడ్జెట్ ప్రజల్ని గందరగోళంగా, భ్రమింపజేసే విధంగా, ఆశల పల్లకిలో ఊరేగించే విధంగా అందలమెక్కి, ఊగుతున్నట్టుగా మాత్రమే బడ్జెట్ అంకెల్లో ఉంది. కాని వాస్తవాలపై లేదని తెలపడానికి 2014-15 సంవత్సరాల కాగ్ రిపోర్టు మరియు మీకు సి.ఏ.జి వారు మీకు అందించిన రిపోర్టు గురించిన విషయాలను మీకు వినిపిస్తాను. బడ్జెట్ అంచనాలు అవాస్తవికంగా, వ్యయ పర్యవేక్షణ నియంత్రణ బలహీనంగా ఉన్నాయి. అవాస్తవాలు ఉన్నాయని కాగ్ రిపోర్ట్ చెబుతున్నది. జానారెడ్డి అంటున్న మాటలు కావని తెలియజేస్తున్నాను.

కాని కాగ్ రిపోర్ట్‌లో 2014-15 సంవత్సరంలో విద్యకు భారత దేశంలో విద్య నిమిత్తము బీహార్ రాష్ట్రం పెట్టిన బడ్జెట్ తరువాత, అతి తక్కువ బడ్జెట్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెట్టిందని తెలియజేస్తున్నాను. ఈ విషయాలు సి.ఏ.జి. రిపోర్టులో ఉన్నవి, ఇవి కాకుండా లేటెస్ట్ రిపోర్టు వచ్చినా వాటిని మేము స్వీకరిస్తామని తెలియజేస్తున్నాను. సి.ఏ.జి వారు సంవత్సరాంతానికి గత సంవత్సర వైబ్‌సైట్లో విషయాలను పొందుపరుస్తున్నారు. అందులోని వాటిని తెలియజేస్తాను. 2015-16 సంవత్సరాల్లో అకౌంట్స్‌ను మాకు అందజేశారు. మీరు మాకు latest CAG report ను ఇప్పుడు ఇస్తే అన్ని విషయాలు అర్థమౌతాయి. కాని మార్చి 28 తరువాత అందిస్తే వాటి గురించి సభ బయట మాట్లాడుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. కాని మీరు మాకు అందించిన రిపోర్ట్స్, ఐ.టి వారు వెబ్‌సైట్లో ఉంచిన ఫిగర్స్ అన్నీ మా వద్ద ఉన్నాయి. ఆ రిపోర్టును మీరు గమనించండి, వెబ్‌సైట్లో వారు పొందుపరచిన విషయాలను తెలియజేస్తాను. సి.ఏ.జి.వారు ఇచ్చిన 15 నుండి 16 పేజీల రిపోర్టులో రెవెన్యూ రిసీట్స్ 73వేలకోట్ల రూపాయలు, క్యాపిటల్ రిసీట్స్ కలిపి 96వేలకోట్ల రూపాయలు డిస్‌బర్స్‌మెంట్, కాని రూ.73వేలకోట్లు ఉన్నది. కనుక సుమారు నాలుగు వేలు లోటు ఉంటుందని వారు చెబుతున్నారు. కాని మాకు అందించిన వాటిలో మాత్రం డెఫిసిట్ కాదు, సర్‌ప్లస్ ఉంటుందని ఇచ్చారు. కాగ్ రిపోర్ట్ వచ్చిన తరువాత వారు కామెంట్ చేయడం కాని మీరు, మేము వివరాలు చూసుకోవడానికి అవకాశం ఉంటుంది. కాగ్ రిపోర్టులో వారు 73వేలకోట్ల రూపాయలు రెవెన్యూ చూపించారు. మీరు 76వేలకోట్ల రూపాయలు రెవెన్యూ చూపించారు. మొత్తంగా వారు లోటును చూపిస్తే, మీరు సర్‌ప్లస్‌ను చూపించారు. ఈ యదార్థాలు తేలడానికి 2014-15 సంవత్సరాలు మనకు సంకేతమని తెలియజేస్తున్నాను. ఈ విషయాల్లో బడ్జెట్ అంకెలు ఎల్లలు దాటినట్లు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నది. మూడు సంవత్సరాలుగా మీ ప్రభుత్వం 30 నుంచి 33శాతం బడ్జెట్‌ను పెడుతున్నారు. కాని కాగ్ రిపోర్టులో పది నెలలకు 62వేల కోట్లు రూపాయలు మాత్రమే వచ్చింది. లక్ష కోట్ల రూపాయలు పది నెలలకు మీరు పెట్టారు. దానిని ఆన్యువలైజ్ చేస్తే సుమారు రూ.72వేలకోట్లకు వస్తుందని, అంటే, రూ.28వేలకోట్లు షార్ట్ అంటే, బడ్జెట్ అంచనా కంటే, బడ్జెట్ తక్కువగా ఉంటున్నది. ఈ బడ్జెట్ ఎలా ఉందంటే, సందర్భం లేకుండా సంబోధించినట్లు "జానెడా బెత్తెడా " అన్నట్లు బడ్జెట్ ఉంది. అధికారంలో ఉన్నామని ఆ విధంగా చేయడం అధికార దర్పానికి సంకేతమని తెలియజేస్తున్నాను. కాని మాట్లాడుతున్నది జానెడు బెత్తెడు, బారెడు మూరెడు అన్నట్లు ఉంది. ఈ విషయాన్ని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది. ఈ సభలో సి.ఎమ్.గారు ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండమని ఆనాడు చెప్పారు. ముఖ్యమంత్రి ఇంకొక మాట కూడా చెప్పారు. కొన్ని విషయాలు (జానారెడ్డి గారు నుదుటిపై తన బొటనవేలితో చూపుతూ) అదృష్టం కొద్ది జరుగుతున్నాయని ముఖ్యమంత్రి గారు మొన్నీమధ్య చెప్పారు. సభలో విషయాలు మాట్లాడేటప్పుడు పరుషపద జాలాలు ఉపయోగించడం, అసందర్భ విషయాలను ఎత్తిచూపడం, అధికార దర్పాన్ని చూపే సంకేతాలను ఇస్తున్నారు. ఇటువంటి అనేక విషయాల్లో ప్రభుత్వాలకు సమాధానాలు చెప్పిన వాటిలో హర్యానా ప్రభుత్వంలో దేవీలాల్‌ని భజన్‌లాల్ అవమానం చేసిన విషయం, తరువాత భజన్‌లాల్ దేవీలాల్‌ని

అవమానపరచిన విషయాలు యువతరానికి తెలియకపోవచ్చు. అదే విధంగా జయలలితను, కరుణానిధి అవమానపరిస్తే కరుణానిధిని జయలలిత అదే సభలో అవమాన పరచిన తీరు, విషయాలు దీనికి సంకేతాలని తెలియజేస్తున్నాను.

12.30 మ. ఈ సభ సంస్కార హితంగా, ఒక పద్ధతిగా పోయి, ఈ రాష్ట్రాన్ని నూతన ఒరవడిని సృష్టించాలని మేము ఆశిస్తున్నాము. నూతన ఒరవడిని ఈ సభలో పెట్టడానికి ఎంత క్రమశిక్షణగా ఉండాలో, బయట కూడా అంతే క్రమశిక్షణగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, పదేపదే ఈ సభకు చెప్పడమే కాకుండా, రాబోయే రోజుల్లో వచ్చేటటువంటి ప్రతిపక్షనాయకులు ఈ స్థానంలో కూర్చొని జానారెడ్డిగారూ, ఆ రోజుల్లో ఇట్లా మాట్లాడారు, ఇది మేము అనువదించుకుంటామని వారు గుర్తు చేసుకోవడానికి నేను ఈ విషయాన్ని తెలియజేస్తున్నాను. ఉత్తమ్ కుమార్‌గారు ఉత్తుత్తి మాటలు చెబుతున్నారు అని అంటారు. ఇది ఉత్తుత్తి బడ్జెటా? అని అంటే మీకు ఎలా ఉంటుంది. బట్టి విక్రమార్కగారు బట్టీపై చేస్తున్నారంటున్నారు, మీది బట్టీపై చేస్తున్నటువంటి బడ్జెటా అని అంటే మీకు ఎట్లా ఉంటుంది. అలా అంటే బాగుండదు కదా?

బడ్జెట్ గురించి మీరు వెంటనే అర్థం చేసుకోవడానికి సులభంగా చెబుతాను. బడ్జెట్‌ను నూటా పదమూడు వేల కోట్లుగా పెట్టారు. ఇందులో సెంట్రల్ షేర్స్, గ్రాంట్స్- ఇన్ -ఎయిడ్, రెవెన్యూ ట్యాక్స్‌లు, నాన్‌ట్యాక్స్‌లు ప్రధానమైనటువంటివి. మిగతావన్నీ చిన్నచిన్నవి. దాన్ని బేరీజు చేసుకున్నప్పుడు ఒకటికి నాలుగుసార్లు ఇక్కడ మేము గుర్తు చేశాము. ట్యాక్స్ రెవెన్యూకు అరవైరెండు వేల కోట్లు కేటాయించారు. రూ.45వేలకోట్ల కంటే ఎక్కువగా ట్యాక్స్ రెవెన్యూ రాదని మొన్న పేపర్‌లో చూశాను. అది వాస్తవం అవునో, కాదో మీరు లెక్కలు తెప్పించుకొని చూడండి. గత బడ్జెట్‌లో రూ.46వేలకోట్ల కంటే ఎక్కువగా ట్యాక్స్ రెవెన్యూ రాదని నేను నా లెక్కల ప్రకారం చెప్పాను. ఈ రోజు రూ.46వేల కోట్ల కంటే ఎక్కువగా ట్యాక్స్ రెవెన్యూ పెరగడానికి వీలు లేదు. ఇంత ముందు చూపుతో నేను మీకు ముందే తెలియజేశాను. ట్యాక్స్ రెవెన్యూ రూ.46వేల కోట్లు వస్తుందని మొన్ననే ఆర్థిక శాఖ వారు అంటున్నారు. రూ.46వేల కోట్లు వచ్చినప్పుడు రియలిస్టిక్ బడ్జెట్ అంటే ఏ విధంగా ఉండాలి? 14-15శాతం పెరుగుతుందని మీరే ఒక చోట చెప్పారు. కానీ, 15శాతం యావరేజ్‌గా పెరగదు. గ్రాంట్స్- ఇన్ -ఎయిడ్ 15శాతం పెరగదు. నాన్‌ట్యాక్స్ కూడా కలిపితే తప్ప పెరగదు. ఈ సంవత్సరం రూ.52వేల కోట్ల కంటే ట్యాక్స్ రెవెన్యూ రాదు.

రెవెన్యూ ట్యాక్స్ రూ.62వేల కోట్లు పెట్టారు. పదివేల కోట్లు ఎక్కువ పెట్టారు. ఒకేసారి రూ.27వేల కోట్లు గ్రాంట్స్- ఇన్ -ఎయిడ్ వస్తుందని చెప్పారు. 2015-2016 కాగ్ రిపోర్ట్ ప్రకారం రూ.7500కోట్లు వచ్చింది. మీ అకౌంట్‌ద్వారా సుమారు 9500కోట్లు ఇచ్చారు. మీరు చెప్పిందే రూ.9500, దాని మీద మరో 15శాతం పెంచండి. 2016-2017లో 11 వేల కోట్లు వస్తుంది. 2017-2018లో 13వేల కోట్లు వస్తుంది. 27వేల కోట్లలో గ్రాంట్స్- ఇన్ -ఎయిడ్ 14వేల కోట్లు రాదు. ఆ తర్వాత రూ.17వేల కోట్లు సెంట్రల్ షేర్స్ వస్తున్నాయి. సెంట్రల్ షేర్స్‌లో రూ.16500కోట్లు ఈ సంవత్సరం వస్తుందని యూనియన్ గవర్నమెంట్ ప్రకటించినటువంటి బడ్జెట్‌లో ఉన్నది. నాన్‌ట్యాక్స్ రెవెన్యూ చాలా రియలిస్టిక్‌గా చూపించారు. కాగ్ రిపోర్ట్‌లో ఏమి చెప్పారు? 2015-2016లో రూ.14వేల కోట్లుగా, 2016-2017లో రూ.8500 కోట్లుగా లెక్కలు చూపించారు. అది రూ. 14వేల కోట్లు నుంచి రూ.8500 కోట్లకు తగ్గింది. ఇప్పుడు రూ.6,060కోట్లుగా చూపించారు. ఇది కూడా అయిదు వేల కోట్లు రాదు. ఇది అది కలిపితే రూ.25వేల కోట్లు రాదు అని ఈ మూడు పద్దులలోనే స్పష్టంగా తేలింది. అంటే రూ. 149వేల కోట్ల బడ్జెట్‌లో రూ.25వేల కోట్లు పోతే కనీసం రూ.124కోట్లు అన్నా ఉండాలి. ఇది బారెడు ఉందా లేదా? 2016-2017 బడ్జెట్ రూ.130వేల కోట్లు పెట్టుకున్నారు. మీరే రివైజ్డ్ చేశారా లేదా? రూ.112వేల కోట్లుగా రివైజ్ చేసినట్లు ఈ పుస్తకంలో కూడా ఉన్నది. అంటే 18 వేల కోట్లు మీరే తగ్గించుకున్నారు. తగ్గించుకున్నారంటే ఇక రాదని మీరు నిర్ధారణ చేసుకున్నారు.

రూ.112వేల కోట్లు వస్తుందా రాదా మళ్లీ రెండేళ్లకు ముందుకు పోయి చూస్తే కానీ, లెక్క అర్థం కాదు. రూ.112 వేల కోట్లు అన్నారు. ఈ సంవత్సరం రూ.112వేల కోట్లు మీద మళ్లీ 14శాతం పెంచుకోండి. అంటే ఎంత రావాలి రూ.128వేల కోట్లు ఈ సంవత్సరం బడ్జెట్ పెట్టాలి. ఇవి కూడా రియలిస్టిక్ కాదు. కొంచెం ఆలోచన చేయడానికి ఇదంతా చెబుతున్నాము. 2016-2017లో, 2015-2016లో రెవెన్యూ రూ.76వేల కోట్లు వస్తుంది. రూ.76వేల కోట్లలో 14.36 వేల కోట్లు పెరిగి, రూ.87వేల కోట్లు వస్తుందని రివైజ్ బడ్జెట్‌లో మీరే పెట్టుకున్నారు. అంటే 14శాతం మాత్రమే పెరిగింది. 30 శాతం పెరగడానికి ఆస్కారం లేదు కదా? అంటే రూ.80వేల కోట్లు మీద 15శాతం పెట్టాలి కానీ, మళ్లీ ఇప్పుడు కూడా 30శాతం పెట్టారు. ఇది రియలిస్టిక్ బడ్జెట్ ఏలా అవుతుంది?

12.40 మ. రూ.87వేల కోట్లు వస్తుందని రివైజ్డ్ బడ్జెట్ మీరే పెట్టుకున్నారు. అంటే 14 శాతమే కదా పెరిగింది. 30 శాతం పెరగడానికి అవకాశం ఏది? 14, 15 శాతం ట్రెండ్ పెరిగితే చాలా గొప్ప అనే విషయము మీరే ఒప్పుకుంటున్నారు. అందుచేత

మీరు 85వేల కోట్ల మీద 15 శాతం పెట్టాలి కాని, ఇప్పుడు కూడా 30 శాతం పెట్టారు. ఇది రియలిస్టిక్ బడ్జెట్ ఎలా అవుతుంది? 14, 15 శాతం పెరిగితే చాలా గొప్ప. ఉన్నవే చెబుతున్నాను, లేనివి చెప్పడం లేదు. 76 వేల కోట్లు కూడా డిస్ప్యూట్ చేస్తున్నాము. కాగ్ రిపోర్ట్ వస్తే తెలుస్తుంది. వాస్తవంగా 73 వేల కోట్లే వచ్చాయని కాగ్ చెబుతోంది. కానీ మీరు 76 వేల కోట్లు వచ్చాయని ఒప్పుకున్నారు. ఈ 73వేల కోట్ల మీద మీకు ఎంత బడ్జెట్ ఉండాలి? ఆ విధంగా పెరుగుతూ వస్తే రియలిస్టిక్ బడ్జెట్ రూ.116 లేదా 117 వేల కోట్లు ఉండాలి. కానీ మేము 5,6 వేల కోట్లు డిస్ప్యూట్ చేస్తున్నాము. 14వేల కోట్లు మీరు నాన్ ట్యాక్స్‌లో వస్తుందని అన్నారు. కాగ్ ఇచ్చినటువంటి రిపోర్టులో పేజ్ నెం.6లో అన్ని నెలల లెక్కలు ఉన్నాయి. ప్రతి నెల 360కోట్లు, 303 కోట్లు, 435కోట్లు, 586కోట్లు అలా పెరుక్కుంటూ పెరుక్కుంటూ వచ్చి ఫిబ్రవరి దాకా 200, 300, 500కోట్లు వచ్చాయి. మార్చిలో ఒకేసారి 9,900 కోట్లు వచ్చాయి. ఒక నెలలోనే నాన్ ట్యాక్స్ రెవెన్యూ ఇంత వస్తుందా? ఈ లెక్క ఎక్కడ నుంచి వచ్చింది. మీరు ఏదైనా చెక్ ఇష్యూ చేసి అమలు కాలేదా, బి.ఆర్.ఓ. ఇచ్చి అమలు కాలేదా లేదా పి.డి. అకౌంట్ నుంచి ఇటు నుంచి తీసుకున్నారా, అటు నుంచి తీసుకున్నారా ఏమిటనే గందరగోళం లెక్క కాగ్ చెబితే తప్ప తెలీదు. ఈ రూ.14 వేల కోట్లు ఎక్కడవని కాగ్ అడుగుతుందని ఎనిమిదన్నరకు తగ్గించారు. ఇప్పుడు ఆరున్నరకు తగ్గించారు. రూ.14 వేల కోట్లు ముందు సంవత్సరం వస్తే ఒక్కసారే ఇంత లోపలకు ఎప్పుడు పోయాయి? ఆ విషయానికి వివరణ ఇవ్వగలిగితే చెప్పండి. అందుకే ఈ బడ్జెటు రూ.112 వేల కోట్ల మీద పోవాలన్నా 128వేల కోట్లకు పోతుంది. నేను చెప్పిన ప్రకారం గ్రాంట్లు రావాలన్నా అది అంతే వస్తుంది. ఈ పరిస్థితే కాదు, ఇంకొక విషయం మీకు గుర్తు చేస్తున్నాను. దీనికి సంబంధించి కాగ్ రిపోర్ట్‌ను 31నాడు చూసిన తరువాత మీరే అవగాహన చేసుకుంటారు.

గుజరాత్ రాష్ట్రము చాలా సుసంపన్నమైన రాష్ట్రము. పెద్ద పెద్ద పరిశ్రమలు ఉంటాయి. పెద్ద ఎత్తున ట్యాక్సులు వస్తాయి. 6 కోట్ల మంది జనాభా. దాని బడ్జెటు లక్షా 71 వేల కోట్లు. గత సంవత్సరం వారి డిస్బర్స్‌మెంట్స్ లక్షా 46 వేల కోట్లు. వాళ్లు డిస్బర్స్ చేసుకున్న దాని మీద 17 శాతం బడ్జెట్‌ను పెంచుకున్నారు. మీరు కుడా మీ 112వేల కోట్ల మీద ఎంత వస్తుందో చూసుకోవచ్చు కదా? మీకు తెలిసి కూడా ఈ బడ్జెట్‌ను ఎలా పెడుతున్నారు? మీరే మీ రిపోర్ట్‌లో మాకు 15 శాతమే రెవెన్యూ వచ్చిందని చెబుతూ, 30 శాతం రెవెన్యూకు ఎలా పెడుతున్నారు? ఆ విధంగా ప్రతి సంవత్సరం మీరు ఆశించినట్లు రెవెన్యూ రానటువంటి విషయం వాస్తవమా, కాదా? ఈ విషయాన్ని మీరు గమనించి అర్థం చేసుకొని సరిదిద్దుకుంటే మేము సహకరిస్తాము, సంతోషిస్తాము. మీ ప్రభుత్వానికి సరైన సలహాలు ఇచ్చి సక్రమమైన మార్గంలో నడిపించడానికి నేను అలర్ట్ చేస్తున్నానని మీరు గమనించండి. ఆ విధంగా పాజిటివ్‌గా స్వీకరించండి. ఆంధ్రప్రదేశ్‌తో మనం పోల్చుకోవద్దు కానీ మీరు ఎ.పి.తో పోల్చుకొని ఏమైనా ముందుకు వెళుతున్నారా అని అడుగుతున్నాను. ఎ.పి.లో వాళ్లు అటు, ఇటు చేస్తున్నారు, మనం ఎందుకు చేయకూడదని అనుకుంటున్నారా ఏమి? అలా చూసినా కూడా అది జరగడానికి వీలు లేదు. వాళ్లకు స్పెషల్ ప్యాకేజీల క్రింద కొంత డబ్బు వస్తుంది. అది తీసేస్తే వాళ్ల బడ్జెటు అంచనాలు తగ్గుతాయి. ఎ.పి. జనాభా 5 కోట్లు ఉంటే, తెలంగాణలో మూడున్నర కోట్లే ఉన్నారు.

మూడున్నర కోట్ల తెలంగాణలో ఒక్కొక్క మనిషికి 42వేల చొప్పున వసూలు అవుతాయి. కానీ గుజరాత్‌లో 6 కోట్ల జనాభాకు లెక్క కడితే మనిషికి రూ.28 వేలే వసూలు అవుతుంది. మనది ఎంత ఎక్కువ. తెలంగాణ, కర్నాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, బీహార్ ఏ రాష్ట్రము కూడా మనకు దీటుగా ఉండదు. ఈ విషయాన్ని గమనించినప్పుడు మధ్యప్రదేశ్ జనాభా 7 కోట్ల 26 లక్షలు, బడ్జెట్ మాత్రము లక్షా 69 వేలు లేదా 70వేల కోట్లు మాత్రమే. అందుచేత మన బడ్జెట్ రియలిస్టిక్‌గా లేదు. అంత ఆదాయం రాదు. అందుచేత ఏయే పథకాలకు కేటాయింపులు చేశారో వాటిని పూర్తిగా అమలు చేయలేదు. ఎవరికి కేటాయించిన డబ్బుల్లో ఏది కట్ అవుతుందో ఏ పథకాలు పోతాయో తెలియని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రజలు గందరగోళంలో పడతారు. ఇది భ్రమింప చేసినట్లుగా ఉంటుంది లేదా ఆశింప చేసినట్లుగా ఉంటుందని మీకు తెలియజేస్తున్నాను. ముఖ్యంగా ఇందులో ఇంకో విషయాన్ని మీరు గమనించాలి. ఒక ప్రక్క మనకు డెఫిసిట్ కనిపిస్తుంటే 14–15 లోనే ఈ రాష్ట్రము డెఫిసిట్ కాదని ఈ ప్రభుత్వం చెప్పడం ద్వారా మనం కొంత ఇబ్బందుల్లో పడే ప్రమాదము ఉంది. ఈ ఐదు సంవత్సరాల్లో డెఫిసిట్ కాదు సర్ప్లస్‌నే చూపించుకుంటూ వెళితే మనకు ఏమీ రాదు కదా. మనం అప్పులు తెచ్చుకోవడానికో లేదా అప్పులను పెంచుకోవడానికో జి.డి.పి. గ్రోత్‌ను పెంచుకోవడానికో ఆ పరిస్థితిని తీసుకు వస్తే, వచ్చే 15వ ఫైనాన్స్ కమీషన్‌లో మనం కేటాయింపులు కోల్పోయే ప్రమాదము ఉంది.

ఈరోజు సర్ప్లస్ ఉన్న రాష్ట్రాలకు తక్కువ డెఫిసిట్ వస్తుంది. ఇప్పుడే మనకు 2.437 గ్రోత్‌రేటు వస్తోంది. 15వ ఫైనాన్స్ కమీషన్‌కు వెళ్లినప్పుడు మనం అంతా సర్ప్లస్సే ఉందని చూపించుకుంటూ వెళితే మనం క్రిందకు పోయే ప్రమాదం ఉంది. సెంట్రల్ నుంచి వచ్చే గ్రాంట్లు కూడా తగ్గే ప్రమాదం ఉంది. ఈ రాష్ట్రానికి అన్యాయం జరగకుండా ఉండాలని నేను గుర్తు చేస్తున్నాను. బీహార్ అతి పేద

రాష్ట్రము అయినప్పటికీ, సెంట్రల్ డెవల్యూషన్‌లో చాలా ఎక్కువగా ఉంది. దేశ ఆదాయంలోనే 40 శాతం మహరాష్ట్రనుంచి వస్తోంది. అంత పెద్ద రాష్ట్రంలో 5.5 శాతం డెవల్యూషన్ ఉంది. కారణం ఏమంటే పర్ క్యాపిటా బాగా పెరిగితే ఈ ప్రమాదం ఉంటుంది. అంటే డెవల్యూషన్స్ సరిగ్గా ఉన్నప్పుడు పెంచాల్సిందే, కానీ పూర్తి చేసి పెంచే పరిస్థితులు రావొద్దని కోరుకుంటున్నాను. అది ఉందా లేదా అంటే నేను వివరించ లేను. దాని అధ్యయనం మీరు చేయండి, మేము కూడా చేస్తాము. మీరు అడ్వాన్స్ ఎస్టిమేట్స్ అంటున్నారు. ముందర పెడుతున్నారు. దానికి కారణం ఆర్థిక మంత్రి గారికి గుర్తు చేస్తున్నాను. గత సంవత్సరం జి.డి.పి. గ్రోత్ 15 శాతం ఉంటుందని అడ్వాన్స్ ఎస్టిమేట్స్ 6 లక్షల 70 వేలు చూపించారు. కానీ ఇప్పుడు 13.7 శాతం ఉంటుందని నిర్ధారణకు వచ్చామని చెబుతున్నారు. రేపు రివైజ్డ్ ఎస్టిమేట్స్ ఫస్ట్, సెకండ్, థర్డ్ వచ్చే వరకు అది పదకొండు శాతానికి వెళుతుందేమో, ఈ లెక్కలన్నీ వచ్చే వరకు మన అప్పులు పెరిగే ప్రమాదం ఉండ కూడదు. భారం పడకూడదు. ఈ విషయాన్ని గమనించమని ఈ సందర్భంగా మీకు గుర్తు చేస్తున్నాను అధ్యక్షా.

12.50 మ. వ్యవసాయం సంక్షోభంలో ఉందని, గిట్టుబాటు ధర లేదని చాలా మంది సభ్యులు చెబుతున్నారు. ఆత్మహత్యలు అనేకం జరిగాయి. వారికి పరిహారం అందలేదు. ఆఖరికి మహిళా రైతులు కూడా మరణించిన పరిస్థితిని చూస్తున్నాము. రైతాంగానికి సపోర్ట్ చేస్తున్నారా అంటే చాలా సపోర్టు చేస్తున్నామంటున్నారు. పావలా వడ్డీ సుమారు రూ.300 కోట్లు ఉంటుంది. ఇప్పటి వరకు రెండు సంవత్సరాల నుండి ఆ పావలా వడ్డీ పైసలే రైతాంగానికి చెల్లించేది. రుణమాఫీ అయితే కంటిన్యూ అవుతుంది కాని ఈ విషయం గురించి ఒకసారి ఆలోచించండి.

ఎల్ఐసిలో ప్రీమియం మన షేర్ అంతా జత చేస్తున్నామా, సరి చేస్తున్నామా అనేది మీరు ఆలోచించండి. అందుచేత వ్యవసాయ బడ్జెట్ గతంలో కంటే కొంచెం తగ్గింది. వ్యవసాయ ఆదరణ ఎలా ఉందనేది ఒకసారి ఆలోచించండి. వ్యవసాయం ఇబ్బందుల్లో ఉందని చెప్పడానికి ఒకటి, రెండు విషయాలు చెబుతాను. మనది వ్యవసాయిక దేశం. మన రాష్ట్రానికి అవసరమైన ఇతోధిక పెట్టుబడులు పెంచడంతోపాటు అన్ని చర్యలు తీసుకొని ముందుకు సాగాలని మీకు మనవి చేస్తున్నాను. మన రాష్ట్రం యొక్క పరిస్థితుల గురించి చెబుతాను. విద్యుత్ గురించి వివరంగా చెబుతాను. పరిశ్రమలు, పంచాయతీరాజ్, సాగునీటి గురించి ఆయా సబ్జెక్ట్స్‌లో చెబుతాను.

విద్యుత్ రంగం ఈ రోజు చాలా మెరుగైన పరిస్థితులలో ఉంది. చాలా సంతోషం. రైతులకు ఏడుగంటలు, తొమ్మిది గంటలు విద్యుత్ అందించిన మాట వాస్తవము. రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. దానిలోని పరిస్థితులను, పరిణామాలు జరగబోయే తీరు మీరంతా ఆలోచిస్తున్నారా, లేదా? ఎక్స్‌పర్ట్ నిర్ణయాలతో, దీర్ఘకాలిక ప్రణాళికతోకాని అవగాహనతో కాని ముందుకు సాగుతున్నారా? కొన్నాళ్ల తరువాత విద్యుత్ రంగం సంక్షోభంలోకి వెళ్లే పరిస్థితి ఉంది. దానికి గల కారణాలను చెబుతాను. వాటిని పరిగణనలోకి తీసుకోండి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత టిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత విద్యుత్ మొత్తాన్ని మేము సరిచేశామనే విషయం మీరు చెబుతున్నారు. ఇప్పుడు మెరుగైన పరిస్థితి ఉంది, కోతలు లేని మాట వాస్తవం . ఇప్పుడు కోతలు లేవుకాని ఇకముందు వాతలు పడతాయనే విషయం గమనిస్తున్నారా లేదా అనేది నా యొక్క ప్రశ్న. మీరు వచ్చిన రెండున్నర సంవత్సరాలలోనే మొత్తం ఉత్పత్తి చేశారా? అసలు రెండున్నర సంవత్సరాలలో ఎవరైనా అంత కరెంటు ఉత్పత్తి చేస్తారా? డెబ్బై నుండి ఎనబై శాతం పూర్తి అయిన ప్రాజెక్టును రెండున్నర సంవత్సరాల కాలంలో పూర్తి చేయడం వల్ల మొత్తం ఆ ఉత్పత్తి చేతికి అందడం మూలానా ఈ రాష్ట్రానికి మెరుగైన పరిస్థితి ఏర్పడింది. ఈ పునాదులను మీరు మరచిపోయి, కేవలం మీరేమి చేయలేదు, మీ మూలాన జరగలేదు, మేమే అన్నీ చేస్తున్నామనే విషయం సరైంది కాదు.

భూపాల పల్లి స్టేజ్-2కి సంబంధించి 600 మెగావాట్స్ , సింగరేణి –1200 మెగావాట్స్, జూరాల – పులిచింతల 270 మెగావాట్స్ , థర్మల్ 270 మెగావాట్స్, సోలార్ 500 మెగావాట్స్, సిజిఎస్ ద్వారా వచ్చిన 290 మెగావాట్స్ మొత్తం కలిపి సుమారు 3000 మెగావాట్స్ ఈ రెండున్నర సంవత్సరాలలో రావడం జరిగింది. 6500 మెగావాట్స్‌కు దానిని జత చేస్తే ఈ రోజు మెరుగైన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలా జరగడానికి కారణం గత పునాదులు కావా? ఒకసారి అంత ఉత్పత్తి రావడానికి అవకాశం ఉందా? దీనిని గుర్తుంచుకోండి. గతంలో జరిగిన విషయాన్ని గుర్తుంచుకొంటే బాగుంటుంది. దీనిని మీరు గమనించాలని కోరుతున్నాను. మెరుగైన పరిస్థితులు ఇక్కడే కాదు, భారతదేశంలో కూడా గత పాలకులు ఏమి చేశారనేది గమనించాలి. ఇప్పుడు వచ్చిన పాలకులు ఎందుకొచ్చారంటే ఇంతకంటే మెరుగైన సేవలు, సుపరిపాలన అందిస్తారని ఇంకా సుభిక్షంగా ఉంటుందని ప్రజలు అధికారం ఇచ్చారు. ఆ దిశలో మీరు పరిపాలన చేసినట్లయితే ప్రజలు సంతోషిస్తారు, అభిమానిస్తారు. మమ్మల్ని విశ్వసించే వరకు మేము పని చేయవలసిన అవసరం ఉంది. కాని ఈ విషయాన్ని మరచిపోతే కష్టం .

భారతదేశంలో 1998, 99 వచ్చే నాటికి కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయి. అప్పటికే ఒక లక్షా ఏడు వేల మెగావాట్స్

కరెంట్ ఉత్పత్తి జరిగింది. తిరిగి ఎన్‌డిఏ ప్రభుత్వం వచ్చే నాటికి ఒక లక్షా ముప్పై ఒక్క వేల మెగావాట్స్ ఉంది. అంటే కేవలం ఇరవై నాలుగువేల మెగావాట్స్ మాత్రమే పెరిగింది.

భారతదేశంలో యుపిఏ ప్రభుత్వం 2004–05లో అధికారంలోకి వచ్చిన తరువాత 2013–14 నాటికి రెండు లక్షల ఎనభై ఏడు వేల సామర్ధ్యం గల ప్రాజెక్ట్సు పూర్తి అయ్యాయి. మరల రెండు సంవత్సరాలలో కరంటు ఉత్పత్తి మూడు లక్షల పద్దెనిమిని వేల మెగావాట్స్‌కు చేరింది. మరల ఈ సంవత్సరం రెండు లక్షల ఎనభై నాలుగు వేల మెగావాట్స్‌కు వచ్చింది. ఈరోజు భారతదేశంలో ఇంత కరంట్‌ను ఉత్పత్తి చేయడానికి గత ప్రభుత్వం చాలా కష్టపడింది. కాని కొరత ఎందుకు ఏర్పడింది. బొగ్గు, గ్యాస్, పెట్రోల్ ధర పెరగడం వల్ల అనేక ఫ్యాక్టరీలు మూతపడ్డాయి, సామర్ధ్యం కోల్పోయాయి. అందుకని నాలుగైదు సంవత్సరాలు భారతదేశ వ్యాప్తంగా కరెంటు కొరతతో ఇబ్బంది పడ్డారు. మనం కూడా ఇబ్బంది పడ్డాము. కొనుగోలు చేద్దామన్నా దొరకలేదు. అందుకని ఈ కారణాల చేత ఇబ్బంది పడ్డ మాట వాస్తవము. దాని యొక్క పర్యవసానమే ఇక్కడ కూర్చోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇంతకు ముందు ముఖ్యమంత్రిగారు అదృష్టం గురించి చెప్పారు. అయినప్పటికీ ఇది ఎవరు, ఏమి చేయలేదనేది కరక్టు కాదు. Union Government ఇష్యూ చేసిన దానిని ఒకసారి చూస్తే మేము ఏమి చేయలేదనే విషయం తెలియంది కాదు. ఆ తరువాత ఇప్పుడు భారతదేశంలోనే మిగులు కరెంటు ఉంది. భారతదేశంలోనే సుమారు 50వేల మెగావాట్స్ మిగులు కరెంట్‌ను ఎవరూ కొనే దిక్కు లేక మాదగ్గరకు రండి రండి అని అంటున్నారు. కారిడార్స్ లేక అమ్ముకోలేక, కొనే వాడు లేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనే మిగులు కరెంటు ఉంది.

1.00 మ. ఇప్పుడు ఎవరూ కొనడం లేదు. గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హర్యాన, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు గతంలో కరెంట్ కోసం నాలుగైదు సంవత్సరాలు ఇబ్బంది పడ్డాయి. పెట్రోల్ ధర పెరిగింది. మిగిలిన అన్ని ధరలు తగ్గాయి. బొగ్గు ధర తగ్గింది. విదేశీయులు బొగ్గు అవసరం లేదంటున్నారు. ఒక్క తెలంగాణలోనే కాదు దేశంలో అన్ని రాష్ట్రాలలో మొత్తం మీద కరెంట్ సమస్య మెరుగయ్యింది. ఎవరూ ఎవరినీ కరెంట్ గురించి అడగడం లేదు. ఏ రాష్ట్రం కూడా మాకు అవసరం లేదని అంటున్నారు. అయిదు నిమిషాలలో కరెంట్ దొరుకుతుంది.

**మేడమ్ డెప్యూటి స్పీకర్:-** జానారెడ్డి గారు కంక్లూడ్ చెయ్యండి.

**శ్రీ కె. జానారెడ్డి:-** ఇప్పుడు పరిస్థితులు మెరుగుపడ్డాయి. కేవలం నేను జరగబోయే ప్రమాదం గురించి మీకు చెబుతున్నాను. ఈ విషయాన్ని నేను ప్రశ్నించాను. విద్యుత్ వినియోగం ఒక సంవత్సరంలో తగ్గింది, ఈ సంవత్సరంలో పెరిగింది. 2014-15 లో, 2015-16లో ఎక్కువ ధర పెట్టి విద్యుత్‌ని కొనుగోలు చేసిన పరిస్థితిని మీరు ఒకసారి గమనించండి. విద్యుత్‌రంగం సంక్షోభంలోకి వెళ్లే పరిస్థితి ఏర్పడింది. భద్రాద్రి పవర్‌ప్లాంట్‌కి సంబంధించి సూపర్‌క్రిటికల్‌కి బదులు స్పెషల్ క్రిటికల్ వైపుకి వెళ్లారు. త్వరలోనే ప్రాజెక్టు పూర్తిచెయ్యాలని ఆ విధమైన నిర్ణయం తీసుకున్నారు. కరెంట్ కోసం ఈ ప్రభుత్వం తొందరపడుతుందని అప్పుడు అనుకున్నాము. ఆ ప్రాజెక్టు ఇప్పటివరకూ కంప్లీట్ కాలేదు. ఈ మార్చి నెలాఖరికి అవ్వదు, ఎప్పుడు కంప్లీట్ అవుతుందో తెలియదు. ఇది మీరిచ్చిన పేపర్. మీ టార్గెట్ ప్రకారం కేటీపీఎస్ నుండి 800 మె.వా పవర్‌ను 2017 మార్చి నాటికి ఉత్పత్తి చేస్తామన్నారు. సంవత్సరం, సంవత్సరంనరలో అంత ఉత్పత్తి రావడానికి అవకాశం ఉంది. యాదాద్రి పవర్‌ప్లాంట్‌కి పర్యావరణ అనుమతి లేదు. పర్యావరణ అనుమతులు పొందిన తరువాత గవర్నమెంట్ ఆఫ్ ఇండియా గైడ్‌లైన్స్ ప్రకారం ప్రాజెక్టును కంప్లీట్ చేయడానికి సుమారు 44 నెలలు పడుతుంది. ఇప్పటికీ ఆ ప్రాజెక్టు మొదలుకాలేదు. ఎన్.టీ.పీ.సి ద్వారా కొంత కరెంట్‌ని 2017 నాటికి తెస్తామన్నారు. మీరు చెప్పిన ప్రకారం ఎన్.టీ.పీ.సి నుండి కూడా రావడం లేదు. ఈవిధమైన పరిణామాలు ఎవరికైనా ఎదురవుతాయని చెబుతున్నాను. మీరేమి చెప్పారు అని నేను నిలదీయడం లేదు. కొన్ని పరిణామాల వల్ల ఇతరులకు కూడా విద్యుత్ ఉత్పత్తి ఆలస్యమవుతుందని గమనించాలి. 2014-15లో 39,829 మె.వా పవర్ పర్చేస్ చేశాము. 2015-16లో 40,649 మె.వా విద్యుత్‌ని పర్చేస్ చేశాము. 2016-17 సంవత్సరానికి మన ఎస్టిమేషన్ 42,390 మె.వా అధ్యక్షా. 2014-15, 2015-16 సంవత్సరానికి రెండు శాతం ఇంక్రీజ్ అయ్యింది. అంటే మన డిమాండ్ పెరిగే పరిస్థితి లేదని ఇక్కడ అర్థం అవుతుంది.

అధ్యక్షా, ఛత్తీస్‌ఘడ్ విషయం మీకు తెలియజేస్తాను. ఛత్తీస్‌ఘడ్‌తో చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం మనకు నష్టం వచ్చే ప్రమాదం ఉంది. మీరు యూనిట్ పవర్‌కి 4.80 - 4.95 పైసలు వారికి ఇస్తామని, ఆ విధంగా రేటు నిర్ణయించుకున్నారు. ఆ రేటు ఈఆర్‌సి నిర్ణయించలేదు. ఆ విధంగా వారికి తొమ్మిది కోట్ల రూపాయలు ఇవ్వవలసి వస్తుంది. ఆ విధంగా లెక్కవేసుకొని ఇస్తే మనం ప్రమాదంలో పడతాము. ఇది ఖర్చుతో కూడుకున్న పని అది. సంబంధిత శాఖా సెక్రటరీ గారు ఈఆర్‌సికి లేఖ రాసినట్లు తెలుస్తోంది. ఆ లేఖలోని అంశాలు ఏమిటని అధ్యయనం చేశారా

లేదా, ఆ విధంగా చేస్తే మాకు వివరాలు తెలియజేయండి.

అంటే ఆ కారిడార్ వెయ్యి మెగావాట్లను మీరు రెండు వేల కోట్ల రూపాయలకు రాస్తున్నారు. మన అగ్రిమెంట్ కూడా మనం తీసుకున్నది వెయ్యి మెగావాట్లు మాత్రమే. ఇంకా వెయ్యి మెగావాట్లు మనం వాడినా వాడకపోయినా వాడుకునేంతవరకు యూనిట్‌కు 45 పైసల చొప్పున పవర్ గ్రిడ్ వాళ్లకి చెల్లించాలి. అది రాష్ట్ర ఖజానాకి ఎంత భారమౌతుందనేది ఒకసారి ఆలోచించండి. ఆ వెయ్యి మెగావాట్లు తీసుకునేంత వరకు రోజుకు కోటి రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. సంవత్సరం వరకు ఆ వెయ్యి మెగావాట్లు వాడుకుంటే ఇంకొక రూ.350 కోట్లు డిస్కంలకు చెల్లించాల్సి వస్తుంది.

1.10 ఉప్పృభి.

నేను చెప్పే విషయం గురించి విద్యుత్ శాఖామంత్రిగారు చాలా జాగ్రత్తగా ఆలోచించాలి. వెయ్యి మెగావాట్లను ఏప్రిల్ మాసం నుంచి వాడుకోవాలి. వాడుకోకపోతే మన రాష్ట్ర ప్రభుత్వం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి ఫిక్సడ్ ఛార్జీలు కట్టడంతోబాటు పవర్ గ్రిడ్‌కి యూనిట్‌కు 45 పైసల చొప్పున కట్టాలి. నిజానికి ఆ వెయ్యి మెగావాట్ల విద్యుత్‌ను మన రాష్ట్రం తీసుకోవాల్సిన అవసరమున్నది. కానీ మహేశ్వరం నుండి విద్యుత్ వస్తే గానీ మన రాష్ట్ర ప్రభుత్వ అవసరాలకు మొత్తం సరిపోదు. ప్రతినెలా వంద మెగావాట్ల విద్యుత్‌ను వాడుకోకుంటే నెలకు రూ.25 కోట్లు చెల్లించాలి. వంద మెగావాట్లకు సంబంధించి ఈ నాలుగు నెలల్లో ఎంత నష్టం వస్తుందనేది కూడా బేరీజు వేసుకోవాల్సి ఉంటుంది. వంద మెగావాట్ల విద్యుత్‌కి రూ.25 కోట్లు అంటే 500 మెగావాట్ల విద్యుత్ వాడుకోకుంటే 500 X 25 = రూ.12వేల 500 కోట్లు నష్టం వచ్చే పరిస్థితి ఉన్నది.

ప్రధానంగా రూ.11వేల కోట్లు లిఫ్ట్ ఇరిగేషన్‌కి వస్తే వాటిని కేవలం నాలుగు నెలలు మాత్రమే ఉపయోగించుకోగల్గుతారు. ఆ తరువాత 8 నెలలు ఖాళీగా ఉంటుంది. అంటే ఈ 8 నెలలు ఫిక్సడ్ ఛార్జీలు కోల్పోవాలి లేదంటే అమ్ముకోవాలి. ఒకవేళ అమ్ముకోవాలన్నా భారతదేశంలో ప్రస్తుతమున్న విద్యుత్ ఉత్పత్తి సంస్థల పోటీలో అమ్ముకునే పరిస్థితి లేదు. అమ్ముకోలేకపోతే ఉత్పత్తిని ఆపి పెట్టాలి. ఆ విధంగా ఆ ఏడెనిమిది నెలలకు సుమారు రూ.25 కోట్లు నష్టమొచ్చే ప్రమాదమున్నది. కాబట్టి ఆ విద్యుత్‌ను ఎక్కడ వాడుకోవాలి, ఎలా వాడుకోవాలి అనే దీర్ఘకాలిక ప్రణాళిక ఇప్పటినుంచే రాష్ట్ర ప్రభుత్వం మొదలుపెట్టాలి లేదంటే అందులో ఇంకొక ప్రమాదమున్నది. ఈ విద్యుత్ వచ్చేవరకు మన ఇరిగేషన్ ప్రాజెక్టులు మొదలుకాకపోతే కూడా నష్టమొస్తుంది. ఇరిగేషన్ ప్రాజెక్టులు ఎప్పడొస్తాయి, విద్యుత్ ఎప్పుడు ఉత్పత్తి కావాలి? దీనికి టైమింగ్ మ్యాచ్ కావాలి. విద్యుత్ సంస్థలు తమ ఉత్పత్తిని కొత్తగా ప్రారంభించిన తరువాత కూడా 8 నెలలు వాడుకోకపోతే ఎలాంటి ప్రమాదముంటుందనేది ఆలోచించుకోవాలి.

అదే విధంగా సూపర్ క్రిటికల్ కాకపోవడం వలన మణుగూరు, భద్రాద్రి సంవత్సరానికి రూ.400 కోట్లు నష్టం వచ్చే ప్రమాదమున్నది. మణుగూరు ప్రాజెక్టు పూర్తయిన తరువాత ఛత్తీస్‌ఘడ్ ద్వారా మన రాష్ట్రం తీసుకునే విద్యుత్ వలన ఈ భారం పడే ప్రమాదమున్నది. కట్టబోయే లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తయిన తరువాత టైమింగ్ సరిగా మ్యాచ్ కాకపోతే ఆర్థికంగా ఆ భారం డిస్కంల మీద అలాగే వాటిని భరించాల్సిన పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వ ఖజానా మీద పడే ప్రమాదమున్నది. 2014-15 సంవత్సరానికి సంబంధించి ఒక్క సదరన్ డిస్కంకే రూ.765 కోట్లు నష్టం వచ్చింది. 2015-16లో రూ.2,477 కోట్లు నష్టం వచ్చింది. అంటే మొత్తం సదరన్ డిస్కంకి సుమారు రూ.3243 కోట్ల నష్టం వాటిల్లింది. NPDCL కూడా రూ.800 నష్టాన్ని కలుపుకుంటే సుమారు రూ.4000 కోట్లు డిస్కంల మీద ఆర్థిక భారం పడింది. నిన్ననే రూ.8వేల కోట్లు తీర్చడానికి ప్రభుత్వం ఒప్పుకుంటే రూ.4వేల కోట్లు వెంటనే రాష్ట్ర ఖజానా మీద భారం పడింది. సుమారు రూ.10వేల కోట్ల లోటు ఉన్నది.

(బెల్)

ఇప్పటికే విద్యుత్ చార్జీలు పెంచుతారేమోనని ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రూ.10వేల కోట్ల లోటుకు ఇంకొక రూ.4వేల కోట్లు డిస్కంల నష్టం యాడ్ అయితే ఎంతో ప్రమాదకరమైన పరిస్థితులకు దారితీస్తుంది. ఈ భారాలన్నింటిని సరిచేసుకోవడానికి ప్రభుత్వం ఏం చేస్తున్నది? ఈ రాష్ట్రాన్ని బ్రతికించుకోవడానికి ఈ రాష్ట్రంలోని ప్రభుత్వాలు కూడా చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని నేను చెబుతున్నాను.

విద్యుత్ విషయంలో ఉత్పత్తి ఖర్చు ఎంత, దానిని వినియోగదారులకు ఎంతకు విక్రయిస్తున్నారు, దానివలన ఒక్కొక్క డిస్కంకు ఎంత నష్టం వాటిల్లుతున్నదనే విషయాలను దృష్టిలో ఉంచుకొని ఇఆర్‌సీ తన టారిఫ్ నిర్ణయించడం జరుగుతుంది. ప్రస్తుతమున్న పరిస్థితులలో వినియోగదారుడు చెల్లించాల్సిన యూనిట్ ధరను డిస్కం గానీ ప్రభుత్వం గానీ నిర్ణయించడం లేదు. గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం డిస్కంలకు రూ.4వేల 500 కోట్లు సబ్సిడీనిచ్చి ఈ సంవత్సరం ఆ సబ్సిడీని రూ.4వేల 250కి తగ్గించారు. ఎక్కువైతుంటే పరిస్థితి ఏ విధంగా ఉందనేది ఆలోచించాలి. ఈ కాపీని గౌరవ సభాపతి గారి ద్వారా విద్యుత్ శాఖామంత్రిగారి పరిశీలన కోసం పంపిస్తాను.

(సంబంధిత డాక్యుమెంట్లను సభాపతి గారికి అందజేశారు)

అందుచేత ఈ రకమైన ప్రమాదాన్ని తప్పించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వానికి దీర్ఘకాలిక ప్రణాళిక ఉండాలి. అందుకోసం ప్రతినిత్యం సమీక్షిస్తుండాలి. ఆ తరువాత ఏ మాత్రం లోటు కాకుండా ఉండటానికి, ఒకవేళ లోటైతే దానిని ఎలా భర్తీ చేయాలి అనేది ప్రభుత్వం ఆలోచించి అవసరమనుకుంటే ప్రతిపక్షాల సహాయం కూడా తీసుకోవాలని మనవి చేస్తున్నాను.

**శ్రీ ఈటల రాజేందర్:-** అధ్యక్షా, పెద్దలు జానారెడ్డి గారి స్పీచ్ మొత్తం మా ముఖ్యమంత్రిగారు వింటుంటారు. పెద్దలు జానారెడ్డి గారు మంచి సలహాలు ఇస్తారని ముఖ్యమంత్రిగారు చాలా భరోసా పెట్టుకున్నారు. మా ముఖ్యమంత్రి గారి పనితీరును గౌరవ ప్రతిపక్షనాయకులు ప్రత్యక్షంగా చూడరు కాబట్టి నేను ముఖ్యమంత్రి గారి గురించి చెబుతున్నాను. ప్రతి నిత్యం ప్రగతి భవన్‌లో ఏ ప్రాజెక్టు దగ్గర ఎంత వర్క్ అవుతున్నది, ఎంత క్వాంటిటీ అవుతున్నదనే లెక్కలు కూడా చూస్తారనే విషయం సభ్యులు మర్చిపోవద్దు. ప్రతి ఇరిగేషన్ ప్రాజెక్టువారీగా ప్రతి నిత్యం, ప్రతి గంట ఎంత పని అవుతున్నది, ఎక్కడెక్కడ అవుతున్నదనే విషయాలు పరిశీలిస్తారు.

రెండవది ప్రతి నిత్యం విద్యుత్ విషయంలో ఒక లోడ్ డిస్పాచ్ సెంటర్ స్క్రీన్‌మీద ఏ గంటకు ఎంత విద్యుత్ వాడుకుంటున్నాం, ఏ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి ఎంత విద్యుత్‌చ్ఛక్తి వస్తున్నదనే పూర్తి సమాచారం ఉంటుంది.

మూడవది ఈ ప్రభుత్వానికున్న కన్సర్న్ ఏమిటంటే కొత్త రాష్ట్రం కాబట్టి ఎక్కడ కూడా తప్పటడుగులు పడకుండా మంచి సాంప్రదాయానికి ఒరవడిని అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రభుత్వం పనిచేస్తున్నది. అందువల్ల ఈ ప్రభుత్వానికి బాధ్యత ఉన్నదా లేదా అనే దాని గురించి అనుమానపడాల్సిన అవసరం లేదని పెద్దలు జానారెడ్డి గారికి మా పక్షాన విజ్ఞప్తి చేస్తున్నాను.

1.20 మ. **శ్రీ కె. జానారెడ్డి:-** నా అనుమానాలను నివృత్తి చేయాలని కోరుతున్నాను. ఏ ప్రభుత్వమైన ఒక ఆలోచన, ఒక ఆశయం ప్రకారం ఒక ప్రణాళికను తయారు చేసుకొని ఆ పద్ధతిన ముందుకు పోయి ప్రజాభిమానాన్ని చూరగొనడంలో సందేహం లేదు. ఆ విధంగానే మీరు చేసినందుకు సంతోషం. మీరు సమీక్షించడం లేదని మేము అనుకోవడం లేదు, సమీక్షించినప్పటికీ ఈ విషయాలన్ని మీ దృష్టికి వచ్చాయా, రాకపోతే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి మరల సమీక్షించమని చెబుతున్నాము. మీరు సమీక్షించినట్లైతే మరొకమారు మాకు నివృత్తి చేయండి, ఆవిధంగా చేస్తే మిమ్మల్ని అభినందిస్తాము. ఆ ఆశయంలో మీ ప్రణాళిక ఎంత, మీ ప్రణాళిక సరైనదా లేదా అని చెప్పడానికి, ఒకవేళ సరైనదైతే మిమ్మల్ని అభినానిస్తాము లేదంటే అలర్ట్ చేస్తాము లేదా వచ్చే పరంపరకు గుర్తుకు చేయడానికి డిబేట్ చేస్తాము. మిమ్మల్ని తప్పు పట్టడానికి లేదా మమ్మల్ని తప్పు పట్టడానికి వీలు లేదు. పరస్పరం అర్థం చేసుకుందాము.

3,451 పరిశ్రములు, 58,000 కోట్ల పెట్టుబడులు, 2,20,000 ఉద్యోగాలు వస్తాయని ఆశిస్తున్నామని మీరు టిఎస్‌ఐపాస్ ద్వారా తెలియజేశారు. కానీ, కమెన్స్డ్ ఆపరేషన్స్ ద్వారా 43,000 మాత్రమే ఉద్యోగాలు అయ్యాయని, 38,000 ఉద్యోగాలు అడ్వాన్స్ స్టేజీల్లో ఉన్నాయని, రెండు వేల పరిశ్రమలకు పైగా ఇంకా ప్రారంభమే కాలేదు. ఇవ్వన్నీ ఆలస్యమౌతాయి. కానీ, చాలా వరకు అయిపోయిందనే విధంగా కాకుండా మాకు వాస్తవాలు అందించండి. గతంలో మరియు ప్రస్తుత ప్రభుత్వంలో ఉద్యోగాల కల్పన ఏవిధంగా ఉన్నదనే విషయాన్ని పరిశీలించినట్లైతే, 2007-08వ సంవత్సరంలో-43,000 ,2008-09వ సంవత్సరంలో-52,000, 2009-10వ సంవత్సరంలో-46,000, 2010-11వ సంవత్సరంలో-51,000, 2011-12వ సంవత్సరంలో-76,000, 2012-13వ సంవత్సరంలో-71,000, 2013-14వ సంవత్సరంలో-83,000 2014-15వ సంవత్సరంలో- 64,000 ఉద్యోగాలు గత ప్రభుత్వంలో తెలంగాణ పక్షం నుంచి అని కల్పించారని చెప్పారు. ఈ విషయాలన్ని మీ సోషియో ఎకనామిక్ నివేదికలోనే ఉన్నాయి. 2015-16వ సంవత్సరంలో 37, 000 ఉద్యోగాలను కల్పించారని మీ సోషియో ఎకానిమిక్ చెబుతుండగా, జనవరి, 2015 నుంచి మార్చి,2017 వరకూ 43000 కల్పించినట్లుగా ఐపాస్ చెబుతోంది. అడ్వాన్స్డ్ స్టేజీలోని పరిశ్రమల ద్వారా మరో పది, పదిహేను వేల ఉద్యోగాలు రావచ్చు.

**శ్రీ కె. తారక రామారావు:-** అధ్యక్షా, గౌరవ పెద్దలు జానారెడ్డి గారు టిఎస్-ఐపాస్ ద్వారా అనుమతులందించిన పరిశ్రమల ద్వారా కలిగిన ఉద్యోగాల కల్పన విషయమై ప్రస్తావిస్తూ గణాంకాలు తెలియజేశారు. గణాంకాల వివరాలను పద్దుల విషయంలో సవివరంగా చెబుతాను. మొదటగా వారికి రెండు విషయాలను తెలియజేయాలని అనుకుంటున్నాను. 3,451 పరిశ్రమలకు 15 రోజుల లోపే టిఎస్-ఐపాస్ సంపూర్ణంగా అనుమతులు ఇచ్చింది. టిఎస్-ఐపాస్ ద్వారా కాకుండా ఎస్ఎంఈ ద్వారా ఈ కాలంలోనే మరో 16,000పైగా సంస్థలు వచ్చాయనే విషయాన్ని గుర్తించాలని వారిని కోరుతున్నాను. గతంలో పరిశ్రమల అనుమతుల నిమిత్తమై నెలల తరబడి కార్యాలయాల చుట్టూ నిరీక్షించిన సందర్భాలు ఉండగా, ఆ పద్ధతికి చరమగీతం పాడుతూ, 15 రోజుల్లోగా అనుమతిలిస్తామని, ఒకవేళ 15 రోజుల్లో అనుమతిలివ్వలేకపోతే అనుమతిలిచ్చినట్లుగానే భావించాలనే విప్లవాత్మకమైన ఘనతను తెచ్చిన ఘనత తెలంగాణ

రాష్ట్ర ప్రభుత్వానిదే అనే విషయాన్ని గుర్తించాలని వారిని కోరుతున్నాను. ఒకవేళవారు గుర్తించకపోయినా, ఆ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం మరియు అనేక సంస్థలు గుర్తిస్తున్నాయి. ఈ విషయాన్ని ప్రామాణికంగా, బెంచ్ మార్క్‌గా పరిగణిస్తాము.

అనుమతులు ఇచ్చిన 3,451 పరిశ్రమల్లో దాదాపు 51 శాతం పరిశ్రమలు రికార్డు సమయంలో అనగా ఒక సంవత్సరంలోపే ప్రారంభించిన విషయాన్ని గుర్తించాలని వారిని కోరుతున్నాను. నవంబర్,2014లో టిఎస్ఐపాస్ మొదలైనది. జాతీయ సగటు కంటే తెలంగాణలో ఉద్యోగాల కల్పన అధికంగా ఉన్నదని, విప్లవాత్మకమైన పరిస్థితులు మరియు విప్లవాత్మకమైన నిర్ణయాల వల్ల వచ్చిన పురోగతి కనుబడుతున్నందనే దేశం మొత్తం మనల్ని ప్రామాణికంగా తీసుకున్నది. ఈ ఉద్యోగాలు వచ్చినట్లే చూపారని మీరు తెలియజేశారు. 50 శాతానికిపైగా కమర్షియల్ ప్రొడక్షన్ ప్రారంభమవడం చాలా పెద్ద రికార్డు. గవర్నరు గారి ప్రసంగంలోనూ ఒక ఉదంతాన్ని తెలియజేశాము. మైక్రోమ్యాక్స్ సంస్థ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఉన్న ఉత్తరాఖాండ్‌లో పరిశ్రమను స్థాపిస్తే రెండున్నర సంవత్సరాల వరకూ ప్రారంభించుకునే పరిస్థితి లేదు. అదే మైక్రోమ్యాక్స్ సంస్థ తెలంగాణకు వస్తే కావాల్సిన పర్మిషన్స్ ఇచ్చి ఆరు నెలల లోపే ప్రొడక్షన్ ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలని వారికి మనవి చేస్తున్నాను.

**శ్రీ కె. జానా రెడ్డి:-** పరిశ్రమలకు 15 రోజుల్లోనే అనుమతిలు ఇచ్చే విధానాన్ని అంగీకరిస్తున్నాను మరియు అభినందిస్తున్నాను. మీ హయాంలో ఎన్ని ఉద్యోగాల కల్పన జరిగింది, ఎంత పెట్టుబడులు పెట్టారనే విషయమై మాట్లాడుతున్నాను. గత సంవత్సరాల కంటే, ప్రస్తుత ప్రభుత్వం పాలనలో ఈ రెండు సంవత్సరాలలో ఎంత మేరకు ఉద్యోగాల కల్పన పెరిగింది లేదా ఎంత తగ్గింది అనే విషయాన్ని మీరు గుర్తు చేసుకోండి. Telangana State's Industrial Entrepreneur Memorandum of Intents ఫ్యాక్టరీ కమెన్స్ అయిన తరువాత కేంద్ర ప్రభుత్వం భిఫామ్ ఇస్తుందనే విషయం మంత్రి గారికి తెలుసు. ఈ రాష్ట్రానికి 2014 వ సంవత్సరంలో 109 పరిశ్రమలు ఫైల్‌చేయగా, 6,200 కోట్ల రూపాయలు పెట్టుబడులు, 2015వ సంవత్సరంలో 139 పరిశ్రమలు రాగా 9,676 కోట్ల రూపాయాల పెట్టుబడులు, ఆ తరువాత 18 పరిశ్రమలు, 2400 కోట్లు పెట్టుబడులు మాత్రమే వచ్చాయి. ఇది కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రిపోర్ట్. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో 11,395 కోట్ల పెట్టుబడులు, 79 పరిశ్రమలు వచ్చాయి. కొన్ని రాష్ట్రాల కంటే మనం ఎక్కువగా ఉన్నప్పటికీ, గుజరాత్,ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటకమరియు మహారాష్ట్రలకు ఎక్కువ ఫ్యాక్టరీలు మరియు ఎక్కువ పెట్టుబడులు వచ్చిన విషయాన్ని ఈ నివేదిక గుర్తు చేస్తోంది. గత రెండు, మూడు సంవత్సరాలుగా మన పెట్టుబడులు తగ్గాయి. మరికొన్ని పరిశ్రమలు త్వరలో ప్రారంభం కావచ్చు, కానీ ఇప్పటికి వరకు వచ్చిన పరిశ్రమల వివరాలు తెలియజేస్తున్నాను. మీ వేగానికి సంకేతంగా 2014 నాటికి 2000 ఎస్ఎమ్ఎస్ యూనిట్లు సిక్ కాగా, 2017 నాటికి 2500 యూనిట్లు సిక్ అయినట్లుగా ఆ యూనిట్స్ అసోసియేషన్ ప్రచురించిన విషయం వాస్తవమా కాదా, సిక్ యిండస్ట్రీస్‌ను ఏవిధంగా బ్రతికించాలనే విషయమై ఆలోచించండి. పావలా వడ్డీ మరియు ఇతర పథకాల క్రింద 2015వ సంవత్సరం నుంచి నేటి వరకూ సుమారు 700-800 కోట్ల రూపాయలు బకాయిలు చెల్లించక పోవడం వల్ల ఆయా యూనిట్‌లను మీరు ప్రోత్సహించలేదనే దానికి ఈ అంశం సంకేతం.

**1.30 మ.** (At this stage, Madam Deputy Speaker was in the Chair.)

ఆ బకాయిలను మీరు చెల్లించలేదు, ఆ యూనిట్లను ప్రోత్సహించలేదు, అనేది సంకేతమా కాదా అని అడుగుతున్నాను. అవగాహనకు సంకేతం చేస్తున్నాము, నిర్లక్ష్యానికి కాదు అనే దానికి రెండు విషయాలు చెప్తాను. పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్‌లో ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. నుండి శాంక్షన్లు ఇచ్చారు. పంచాయతీ రాజ్ మంత్రి గారు ఇక్కడ లేరు కాబట్టి, ఆర్థిక మంత్రి గారు నోట్ చేసుకోండి. రోడ్లగురించి రూ.600 కోట్లు ఇచ్చారు. మీరు ఏ విధంగా ఇచ్చారు, ఏమి ఇచ్చారని యాక్ట్ జోలికి పోవడం లేదు. యాక్ట్ సంగతి తరువాత, ఏదో ఒకటి ప్రజలకు చేరితే చాలు. మార్చి లోపల పని చేయాలని స్టేట్‌మెంట్ ఇచ్చారు. అంటే దీని అర్థం ఏమిటి? మార్చి లోపల పని చేయకపోతే బిల్లులు రావు. ఈ విషయాన్ని ఎమ్.ఎల్.ఏ.లు అందరూ గుర్తు ఉంచుకోవాలి. ఎన్.ఆర్.ఇ.జీఎస్. లో యాక్ట్ ప్రకారం మార్చి లోపు either material grant or wage grant ఖర్చు అయితే సరే. లేకపోతే ల్యాప్స్ అయిపోతాయి. మరల వచ్చే సంవత్సరానికి ఎక్కడి నుండి తీసి ఇస్తారు? Material grant accrue కావాలి. మరల ఆరు నెలలు అయితే గాని material grant accrue అవ్వదు. ఆరు నెలలు పని చేస్తే 300 లేక 400 వస్తుంది. 2017-18 మరియు 2018-19 రెండు సంవత్సరాలకు NREGS బిల్లులు ఇవ్వాలి. పని చేసిన వాడు తిరగలేక, మిమ్మల్ని మేము అడగలేక, వాడు ఏడుస్తుంటే చూడలేక ఇబ్బంది అవుతుంది. 3 లేక 4 నెలల ముందు మీరు NREGS ఇచ్చి ఉంటే మార్చి లోపల పనులు అయిపోతే అందరి బిల్లులు వచ్చేవి. ఇప్పుడు ల్యాప్స్ అయిపోతాయి. తరువాత రెండు సంవత్సరాలకు పెద్ద మొత్తం అయిపోతుంది. 2015-16 సంవత్సరంలో రూ.737కోట్లు ల్యాప్స్

అయ్యింది. ప్రజలకు న్యాయం చేయలేకపోయారు. అంటే ఇది మీ సమర్థతకు సంకేతమా? 2016-17 సంవత్సరంలో రూ.347 కోట్లు ల్యాప్స్ కాబోతున్నాయి. మీ టైంలో కాలేదా అని మీరు అడగవచ్చు. ఆ సమయంలో కూడా ల్యాప్స్ అయ్యాయి. 2012-13లో రూ.400కోట్లు, 2013-14 సంవత్సరంలో రూ.177కోట్లు ల్యాప్స్ అయ్యాయి. కాని అప్పుడు మనమంతా ఉద్యమాల్లో ఉన్నాము. కాబట్టి, సరిగా చూడలేదు. మీరు రెండున్నర సంవత్సరాల నుండి చూడలేదు. ఈ సంవత్సరం కూడా చూడలేదు. NREGS లో ఇచ్చిన రూ.600కోట్లు రెండు సంవత్సరాలు వస్తాయి. ఆర్ అండ్ బి డిపార్ట్‌మెంట్‌లో సుమారు రూ.10వేల కోట్ల రూపాయలు అగ్రిమెంట్లు అయ్యి, టెండర్లు పిలిచి, మొదలు పెట్టి కొన్ని, మొదలు పెట్టక కొన్ని, అంతంత మాత్రమే పనులు చేశారు. ఏడాదికి రూ.2,300కోట్లు కేటాయించారు. ఐదు సంవత్సరాల వరకు చేపట్టిన పనులే పూర్తి చేయాలి అనే విషయాన్ని మీకు చెబుతున్నాను. పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్‌లో రూ.2,600కోట్లు స్పిల్ ఓవర్ ఉన్నది. ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీలకు సంబంధించిన 2016-17 సంవత్సరానికి సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ప్రోగ్రామే చేపట్టలేదు. కేటాయింపులకు తగిన న్యాయం చేసినట్టా? గొర్రెల పెంపకం ద్వారా చాలా మందికి ఉపాయం చేస్తున్నారు. ఉపాది తరువాతి సంగతి. నేను ఒక ప్రశ్న అడుగుతున్నాను. ఎమ్.బి.సి.లకు రూ.1000కోట్ల రూపాయలని అన్నారు. అసలు ఎమ్.బి.సి.లు ఎవరు? ఆ రిపోర్ట్ ఎప్పుడు రావాలి, మార్చి వరకు తిరగడమే ఆశల పల్లకి అని చెప్తున్నాను. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అన్నీ కట్టాలంటే లక్షన్నర కోట్ల రూపాయలు కావాలి. సంవత్సరానికి రెండు లక్షల ఇళ్లను కట్టి, ఆ దిశలో పయనిస్తున్నామని వారిని ఒప్పించండి. అప్పు తెచ్చినా పని చేసే వాడు లేడు కదా. మూడు ఎకరాల భూమికి సంబంధించి లక్షన్నర కోట్ల రూపాయలు కావాలి. సుమారు 30లక్షల ఎకరాల భూమి ఇవ్వాలి. ఒక సంవత్సరానికి లక్ష ఎకరాల భూమి ఇవ్వండి మేమందరం అభినందిస్తాము. మీరు చెప్పినవన్నీ ఇవ్వలేదని అనము. మీకు సహకరిస్తాము. ప్రజలు ఆందోళన పడుతున్నప్పుడు మేము ఊరుకుంటే, మీరు అసెంబ్లీలో ఏమీ అడగరా? మీరిద్దరూ కుమ్మక్కయ్యారా అని ప్రజలు అంటుంటే, మేము ఇక్కడ అడగకుంటే ఎలా చెప్పండి? 12శాతం రిజర్వేషన్ అంశం గురించి బిల్లు పెట్టినప్పుడు మాట్లాడతాము. ఆర్థిక శాఖ మంత్రి గారూ, ప్రస్తుత బడ్జెట్‌లో లేని అంశాలు చాలా ఉన్నాయి. రూ.2505కోట్లు ఇవ్వాలి, రూ.800 కోట్లు డియర్నస్ అలవెన్స్ ఇవ్వాలి, ప్రస్తుత సంవత్సరానికి రూ.2000కోట్లు రి-ఇంబర్స్‌మెంట్ ఇవ్వాలి. ఇవన్నీ చెల్లించే విషయంలో ఇప్పటికే ఆలస్యం అయ్యింది.

**1.40 మ.** ఇరిగేషన్ విషయంలో టి.ఎమ్.సికి 13,700 ఎకరాలకు నీరు పారిస్తామని చెబుతున్నారు. గతంలో మేము ఇదే విధంగా చెప్పాము. కాని ఈ విషయం తప్పని సరిదిద్దుకునేలోపు మా ప్రభుత్వమే పోయింది. కనుక మీరు ఈ విషయాలను సరిదిద్దుకోకుంటే, చాలా ప్రమాదంలో పడే అవకాశాలు ఉన్నాయి. అంటే, ఒక టి.ఎమ్.సికి పదివేలు పెడితే, అది డెభైశాతం మాత్రమే పారుతుంది. డ్రిప్, మరియు సూక్ష్మ ఇరిగేషన్ల గురించి డి.పి.ఆర్‌లో లేదు. ఈ విషయాలు చివరకు ఎటు పోవాలి. ఈ రోజు నీటి లభ్యత లేనటువంటి విషయాన్ని మీరు ఆలోచన చేసుకోవాలంటున్నాను. బ్రిజేష్ కమిటీ, సుప్రీమ్ కోర్టు, కేంద్ర ప్రభుత్వం రకరకాలుగా రోజు మనల్ని ఇబ్బందులు పెడుతున్నాయి. మీరు కృషి చేస్తున్నారు, ఒప్పుకుంటాము, మేము సహకరిస్తాము. కాని నీటి లభ్యత పూర్తయ్యేదాకా ప్రజలపై ఈ విషయాల్లో భారం పడకుండా చూడవలసిన బాధ్యత మీపై ఉంది. ఒక్క ఎకరాకు ప్రాణహిత చేవెళ్లకు ఒక సంవత్సరానికి నలభైఐదు వేల నుంచి యాభై వేల వరకు మెయిన్‌టెనెన్స్ కాస్ట్ ఇది, క్యాపిటల్ కాస్ట్ కాదు. నిర్వహణ ఖర్చులు బయటికి పోవాలి. అంటే, కరెంటు, కెనాల్స్ రిపేర్స్‌కి, అదే విధంగా తీసుకున్న అప్పుకు వడ్డీ రావాలి. కనుక ఈ పరిస్థితులకు తగినట్లు ప్రభుత్వంలో ప్రణాళికలు చేయాలి, ఆ ప్రణాళికలను చాలా దూరదృష్టితో ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది. ఇవే కాకుండా కొన్ని కాంట్రడిక్షన్‌లు కూడా ఉన్నాయి. ఆదిలాబాద్‌కు రెండులక్షలకు, పదివేల పెడుతున్నారు. అదే విధంగా నెట్టెంపాడుకు పదివేలు, పాలమూరు, రంగారెడ్డికి 13,700 పెడతున్నారు. ఏ విధంగా నీటి లభ్యత వస్తుందని అడుగుతున్నాను. ముఖ్యమంత్రి గారికి, ఇరిగేషన్ శాఖ మంత్రి గారికి ఈ విషయాలకు సంబంధించి లేఖలు వ్రాశాను. ఈ విషయాలను అవగాహన చేసుకుని ముందుకు సాగమని, ప్రజలపై భారం కాని, ప్రభుత్వానికి ఇబ్బందులు జరుగకుండా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపాను.

నిరుద్యోగం విషయం గురించి చెపుతాను. మీరు అప్పుడప్పుడు నో ధర్నా అంటున్నారు. లక్షలాది మంది నిరుద్యోగులు చాలా ఆందోళన చెందుతున్నారు. నిరుద్యోగులు ఆందోళనలను వ్యక్త పరచినప్పుడైనా, వాటిని ఏ విధంగా సర్దుబాటు చేస్తారో ప్రణాళిక ఇవ్వకుండా, వాటిని సరిదిద్దకుండా, అణచివేతకు గురి చేసే పరిస్థితులకు తీసుకురాకూడదని ప్రభుత్వానికి గుర్తు చేస్తున్నాను. ఎందుకంటే, తెలంగాణ రాష్ట్రం సాధించుకోవడానికి ఆ విద్యార్థి నిరుద్యోగులే ముందు భాగాన ఉన్నారు. కనుక వారిని ఏ విధంగా సంతోషపెట్టాలో, సరిచేయాలో అనే విషయాలను వేరు వేరు మార్గాల

ద్వారా ఆలోచించవలసిన అవసరం ప్రభుత్వానికి ఉందని మనవి చేస్తున్నాను.

ఈ వివరాలు అన్నిటితోపాటు ప్రభుత్వంలో జరుగుతున్న టెండర్ల విషయంలో, మిగిలిన అగ్రిమెంట్ల విషయంలో, పారదర్శకత లేదనే విషయంలో అనుమానాలు, వాద ప్రతివాదాలు, ఛాలెంజింగ్ మాట్లాడుతూ, ఈ విషయాలపై పారదర్శకతను రుజువు చేసుకునేందుకు ప్రజలకు, ప్రతిపక్షాలకు ఉన్న సందేహాల్ని నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని మనవి చేస్తున్నాను. ఒక్కొక్కసారి టెండర్లు ఏవిధంగా జరిగాయనే విషయాలను రకరకాలుగా చెప్పుకుంటున్నారు. ఏమి మాట్లాడుతున్నా కూడా మా ప్రభుత్వానికి (టి.ఆర్.ఎస్.) పారదర్శకత ఉందని అన్ని విషయాలను మీరు కొట్టిపారేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కూడా ఇటువంటి విషయాలను కొట్టిపారేసినందున, ప్రజలు మమ్మల్ని కొట్టిపారేశారు. ఏ విషయంలోనైనా ప్రజలు ఏమున్నదో అని మాట్లాడుకునే విధంగా కాకుండా, అదే విధంగా, ఆ విధంగా మాట్లాడుకునేందుకు ఆస్కారం ఇవ్వకుండా, ఉన్న సందేహాలను నివృత్తి చేసి పారదర్శకతను నిలబెట్టాలని ప్రభుత్వానికి సూచిస్తున్నాను. డి.పి.ఆర్లను మాకు అందించండి, అందులో ఉన్న విషయాలకు సలహాలు ఇస్తామని తెలియజేస్తున్నాను.

పాలమూరు, రంగారెడ్డిలో గల ప్రాజెక్టుల గురించి 30 నెలలకే అగ్రిమెంట్ చేసుకున్నారనీ, అంటే రెండున్నర సంవత్సరాల్లోనే లిఫ్ట్ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తయ్యే కాంపోనెంట్ ఉందా అని అడుగుతున్నాను. భక్త రామదాసు ప్రాజెక్టును తొమ్మిది నెలల్లో పూర్తి చేశారంటారు. ఎందుకంటే, పాలేరులో ఉన్న నీరు, అంతకు మునుపే తవ్విన కాలువలు, పైపులు, ఉన్న వాటిని అసెంబుల్ చేస్తే ఎందుకు ప్రాజెక్టు పూర్తవదు. కనుక ఎనిమిది నుంచి తొమ్మిది నెలల్లో ఏ విధంగా పూర్తి చేశారనే విషయాలు ప్రజలు అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందని మనవి చేస్తున్నాను.

సభలో గల ఛైర్ గానీ, సభ్యులు కాని, నా మాటల్లో ఉన్న అర్థాన్ని, బాధను స్వీకరించి ఇంతసేపు ఓపికగా సహకరించినందుకు నేను సంతోషిస్తున్నాను. అదే విధంగా నేను చెప్పిన విషయాల్లో లోతైన విషయాలు ఉన్నాయని గమనించుకుని ప్రభుత్వం వాటిని సరిజేసుకుని, ముందుకు వెళ్లాలని తెలియజేస్తున్నాను. కాని ఈ విధంగా కాకుండా నడిస్తే ప్రజలు కానీ, ప్రతిపక్షాలు కానీ మిన్నకుండా కూర్చుంటాయని అనుకోవడం పొరపాటువుతుందని హెచ్చరిస్తున్నాను. నేను చెప్పవలసిన విషయాలు చాలా ఉన్నప్పటికీ, పద్దులపై, ఇతర విషయాలపై నాకున్న ఆలోచనలను సభ్యులకు అందించే విధంగా ప్రయత్నిస్తాను. అఖిలపక్షాలను ఏర్పాటు చేయనందున, డిబేట్లను జరుపుకునే విధంగా లేనందున, ఇంత సమయం మాట్లాడాల్సి వచ్చిందని, అదే విధంగా అనేక విషయాలు మాట్లాడాల్సినవి ఇంకా ఉన్నాయని, ఆ విషయాలను లేఖల ద్వారా కానీ మరో పద్ధతిలో కానీ వాటిని ఈ ప్రభుత్వానికి అందజేస్తానని, అదే విధంగా తెలిపిన అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందుకు సాగాలని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**మేడమ్ డిప్యూటి స్పీకర్:-** ఈరోజు గౌరవ సభ్యులు శ్రీ వి. శ్రీనివాస గౌడ్ గారి జన్మదినం సందర్భంగా నా తరఫున, గౌరవశాసన సభ్యులు అందరి తరఫున పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

**శ్రీ ఆర్. క్రిష్ణయ్య:-**అధ్యక్షా, 2017-18వ బడ్జెట్కు సంబంధించి అవకాశం కల్పించినందుకు మీకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ప్రధానంగా ఏ బడ్జెటైనా ఊహాజనితంగా ఉండకుండా, వాస్తవిక దృక్పథంతో ఉండాలి. అదే విధంగా దీర్ఘ, స్వల్పకాలిక అభివృద్ధికి సంబంధించిన విజనరీ బడ్జెట్లో ఉండాలి. చాలా పద్దుల్లో దీర్ఘకాలిక విజన్ ఉన్నప్పటికీ, కొన్ని విషయాల్లో వాస్తవిక దృక్పథం లేనట్టుగా ఉన్న విషయాలను మీ దృష్టికి తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలియజేస్తున్నాను.

**1.50 మ.** బడ్జెట్లో అనేక విషయాలకు సంబంధించిన కేటాయింపులు చూసినట్లయితే, మన బడ్జెట్ సంక్షేమ బడ్జెట్ అని చెప్పవచ్చును. ఉత్పాదకత, అభివృద్ధి, వ్యవసాయము, పరిశ్రమలు, విద్య, వైద్యము, ఇరిగేషన్, విద్యుత్, ఈ అంశాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపిస్తున్నది. వ్యవసాయానికి కేటాయించిన బడ్జెట్ చూసినట్లయితే, అందులో ఎక్కువ బడ్జెట్ ఋణాలను చెల్లించడానికి పోతున్నది. వ్యవసాయానికి ఇంకా ఎక్కువగా బడ్జెట్ను కేటాయిస్తే బాగుండేది. వ్యవసాయ రంగంలో స్కిల్ డెవలప్మెంట్ మీద కొంత ఆలోచించవలసినటువంటి అవసరం ఉన్నది. బడ్జెట్లో సారుప్యత లేదు. కేంద్రప్రభుత్వం రూ. 80వేల కోట్లు గ్రాంట్లు అన్ని పథకాలకు కలిపి ఇస్తున్నది. మన బడ్జెట్ లక్షా నలభై తొమ్మిది వేల కోట్లు పెట్టారు. మీ ఆదాయానికి, ఖర్చుకు పొంతన లేదు. ఈ బడ్జెట్ రియలిస్టిక్గా కనిపించడం లేదు.

బి.సి.లకు ఎక్కువ బడ్జెట్ పెట్టాలని ప్రభుత్వానికి సంకల్పం కలిగినందుకు ముఖ్యమంత్రిగారిని అభినందిస్తున్నాను. ఆ మాటకు మీరు కట్టుబడి ఉండాలి. ఎక్కడైనా లోపాలు ఉంటే సరిదిద్దుకోవాలి. బి.సి.లకు రూ.5వేల కోట్లు కేటాయించారు. కానీ, ఏ పద్దు క్రింద పెంచారని చూస్తే, కొన్ని పద్దులను అందులో చేర్చారు. చేనేత శాఖలోని

బడ్జెట్ రూ.1200కోట్లను కూడా ఈ పద్దు క్రింద చేర్చడం జరిగింది. ఎం.బి.సిలను ఆదుకోవాల్సిన అవసరం ఉన్నది. ఎం.బి.సిలకు గతంలో కేటాయించిన బడ్జెట్ ఇప్పటివరకు ఖర్చు పెట్టలేదు. ఇప్పుడున్నటువంటి 12 ఫెడరేషన్లలో రజక, నాయిబ్రహ్మణ ఫేడరేషన్లకు మాత్రమే బడ్జెట్ కేటాయించారు. మిగతా పది ఫెడరేషన్లకు వడ్డెర, మేదర, మేరు వంటి ఫెడరేషన్లకు బడ్జెట్ ఎలా ఖర్చు పెడతారు. ఎంత కేటాయించారు. వాటి ఉనికే లేదు. గతంలో బి.సి కార్పోరేషన్‌కు కేటాయించిన బడ్జెట్ ఖర్చు పెట్టలేదు. మళ్లీ ఇప్పుడు నామమాత్రంగా కూడా ఖర్చు పెట్టని పరిస్థితి ఉన్నది.

బి.సిలకు కేటాయించిన బడ్జెట్ రూ.2500కోట్లు నుంచి రూ.5వేల కోట్లు పెంచినట్లు ప్రకటించారు. దానిని నేను స్వాగతిస్తున్నాను. కానీ, ఏ పద్దు క్రింద పెంచారనే అంశంలో క్లారిటీ లేదు. గతంలో ఓవర్‌సీస్ పథకానికి రూ.60కోట్లు కేటాయించారు. ఈ సంవత్సరం రూ.20కోట్లు కేటాయించారు. బి.సి. స్టడీ సర్కిల్ కోసం గత మూడు సంవత్సరాలుగా రూ.25కోట్లు కేటాయిస్తే, ఈ సంవత్సరం రూ.14కోట్లు కేటాయించారు. మరి ఇది ఏ విధంగా పెంపుదల అవుతుంది. ముఖ్యమంత్రిగారు అనేక మందికి జీతాలు పెంచారు. ప్రభుత్వ ఉద్యోగస్తుల జీతాలు, కాంట్రాక్టు ఉద్యోగస్తుల జీతాలు, అంగన్‌వాడీ టీచర్ల జీతాలు, హోంగార్డుల జీతాలు పెంచారు. ఎం.ఎల్.ఎల జీతాలు, మంత్రుల జీతాలు కూడా పెంచారు. కానీ, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నటువంటి విద్యార్థుల యొక్క స్కాలర్‌షిప్‌లు ఎందుకు పెంచడం లేదు? హాస్టల్ విద్యార్థులకు, రెసిడెన్షియల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచుతారని ఆశించాము. మెస్ చార్జీలు పెంచలేదు. కాస్మోటిక్ చార్జీలు పెంచలేదు. ఆ విద్యార్థులకు నెలకు రూ.2400 మెస్ బిల్లు వస్తున్నది, ప్రభుత్వం రూ.680లు మెస్ బిల్లు ఇస్తున్నది. ఉస్మానియా యూనివర్శిటికి శతాబ్ది ఉత్సవాలను ప్రభుత్వం చేస్తున్నది. ఈ ఉత్సవాల సందర్భంగా కనీసం ఈ బడ్జెట్‌ను రివైజ్ చేసి డైట్ చార్జీలు, మెస్ చార్జీలు పెంచవల్సిందిగా కోరుతున్నాను.

చేనేత వర్గాల బడ్జెట్ రూ.1200కోట్లు , ఇ.బి.సి వర్గాల బడ్జెట్ రూ.250కోట్లు, ఎం.బి.సి వర్గాల బడ్జెట్ రూ.1000కోట్లు మొత్తం ఒకే పద్దు క్రింద పెట్టి మొత్తం రూ.5వేల కోట్లు పెంచడం అనేది వెల్ఫేర్ బడ్జెట్ కాదు. పద్దుల వారీగా ఫేడరేషన్ బడ్జెట్, బి.సికార్పోరేషన్ల బడ్జెట్ అని వేరువేరుగా పెడితే బాగుండేది. గీత కార్మికులకు బడ్జెట్‌లో ఎక్కువగా నిధులు కేటాయించలేదు. గొర్రెల కాపరులకు రూ.4వేల కోట్లు కేటాయించడం నిజంగా అభినందించదగిన విషయం. కానీ, దానిని ఏ పద్దు క్రింద పెట్టారో చెప్పవలసినదిగా కోరుతున్నాను.

గతంలో హాస్టల్ బిల్డింగుల కోసం రూ. 180కోట్లు ,ఆ తర్వాత సంవత్సరం రూ.90కోట్లు కేటాయించారు. ఇప్పుడు హాస్టల్ బిల్డింగులకు అసలు కేటాయింపులే లేవు. బిసి స్టడీ సర్కిళ్లకు కూడా నిధులు కేటాయించలేదు. మొదట కేటాయించిన బడ్జెట్ ఖర్చు పెట్టలేదు. బిల్డింగులు కట్టలేదు. ఈ సారి అసలే బిల్డింగులు తీసివేశారు. అలాంటప్పుడు ఇది బిసి బడ్జెట్ ఎలా అవుతుంది. కాబట్టి ఈ విషయాలపై పునరాలోచన చేయాలని నేను ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

మొత్తం రూ1,49,646 కోట్ల బడ్జెట్‌లో బి.సిలకు రూ.500 కోట్లు అంటే దాదాపు నాలుగు శాతం బడ్జెట్ కేటాయించారు. బి.సిలకు కేటాయించిన బడ్జెట్ గతం కంటే ఇప్పుడు మెరుగుపడినప్పటికీ ఈ మెరుగుదల వాస్తవానికి రియలిస్టిక్‌గా లేదు. కాబట్టి, దీని మీద మరొక్కసారి ఎం.ఎల్.ఎలతో, మంత్రులతో, ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో చర్చ జరిపి బి.సిలకు న్యాయం చేయవలసినదిగా కోరుతున్నాను. రైతులకు గత ప్రభుత్వాలు జోడెద్దులను ఇచ్చేవారు. ఈ ప్రభుత్వం కూడా రైతులకు జోడెద్దులను కొనిస్తే వాళ్లు స్వయంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.

2.00 మ.

అభివృద్ధి చెందిన దేశాలను చూస్తే కేవలం పరిశ్రమల అభివృద్ధినే గీటు రాయిగా తీసుకుంటున్నాము. ఆ అభివృద్ధి ద్వారా కొద్ది మందికి మాత్రమే లబ్ది చేకూరుతుంది. వ్యవసాయం ద్వారా జరిగే అభివృద్ధి వల్ల వికేంద్రీకరణ జరుగుతుంది. వ్యవసాయ అభివృద్ధి ద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందితే ఆ అభివృద్ధి ఫలాలు ప్రజలందరికీ చేరడానికి అవకాశం ఉంటుంది. వ్యవసాయ అభివృద్ధి రాష్ట్రాభివృద్ధికి, దేశాభివృద్ధికి గీటు రాయి. కాబట్టి వ్యవసాయాభివృద్ధికి కావాల్సిన స్కిల్స్‌ను డెవలప్ చేస్తూ, రైతులకు ఎడ్ల పంపిణీ, ఆధునిక పరికరాల పంపిణీ చేస్తూ, ఎక్కువ మందికి లాభం చేకూరే విధంగా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధివైపు పయనింప చేసే విధంగా నిర్ణయాలు తీసుకురావాలని సూచనలు చేస్తున్నాను. మన రాజ్యాంగము ప్రధానంగా విద్య మరియు వైద్యం మీద దృష్టి కేంద్రీకరించింది. విద్య విషయానికి వస్తే ముఖ్యమంత్రి గారు మొదట్లో కె.జి. టు పి.జి. అని ప్రకటించారు. అందులో భాగంగానే రెసిడెన్షియల్ స్కూల్స్ పెడుతున్నారు. అది ఆచరణ యోగ్యంగా కొంత వరకు బాగానే ఉంది. కె.జీ. టు పి.జీ. ఆచరణ సాధ్యం కానప్పటికీ రెసిడెన్షియల్ స్కూళ్ల ద్వారా చేసే కార్యక్రమాలను అన్ని వర్గాలకు జనాభా నిష్పత్తి ప్రకారం కేటాయించాలి. బి.సి. వర్గాలకు 119 గురుకుల పాఠశాలలు ఇవ్వడము గొప్ప విషయమే. జనాభా

నిష్పత్తి ప్రకారం అన్ని సామాజిక వర్గాలకు 800 వరకు రెసిడెన్షియల్ పాఠశాలల అవసరము ఉంది. బి.సి.లకు కూడా జనాభా నిష్పత్తి ప్రకారం రెసిడెన్షియల్ పాఠశాలలను కేటాయించాలి. విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరము ఉంది. ఎందుకంటే విద్యకు ఖర్చు చేసే ప్రతి పైసా కూడా పెట్టుబడి క్రిందకు వస్తుంది.

ప్రభుత్వ పాఠశాలల్లో కొన్ని లోటుపాట్లు ఉన్నప్పటికీ, కొన్ని సంస్కరణలు తీసుకు రావడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయవచ్చు. ఏ వ్యవస్థలోనైనా లోపాలు ఉంటే ఆ వ్యవస్థను వదులుకోలేము, కాబట్టి ఆ వ్యవస్థలో సంస్కరణలు తీసుకు రావాలి. బలమైన కారణాలను శోధించి ఆ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆలోచించాలి. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు పని చేయడం లేదని, అవి నిర్వీర్యం అయిపోయాయని వాటిని పట్టించుకోకుండా వదిలేయ కూడదు. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఆట స్థలాలు ఉన్నాయి. మంచి బలమైన వ్యవస్థ ఉంది. కేవలం ఉపాధ్యాయులను నియమించడము, ఇంగ్లీష్‌మీడియం ప్రవేశ పెట్టడము చేసినట్లైతే, ప్రభుత్వ పాఠశాలలు కూడా బలోపేతం అయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ కళాశాలల్లో లెక్చరర్ల నియామకము, యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ల నియామకము, మొదలైన చర్యలు తీసుకోకుండా విద్యా వ్యవస్థ ఏ విధంగా బల పడుతుందని మీరంతా ఒకసారి ఆలోచించాల్సిన అవసరము ఉంది. అవసరమైతే ఈ విషయం మీద చర్చ జరగాలి. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన సంస్కరణల గురించి మేధావులతోటి, సంఘ సంస్కర్తల తోటి రాజకీయాలకు అతీతంగా చర్చ జరగాల్సిన అవసరము ఉంది. సర్వేపల్లి రాధాకృష్ణమూర్తి గారు, కొఠారి కమీషన్ ఒక దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్ణయించబడుతుందని ఒక కొటేషన్ చెప్పడం జరిగింది. మనమందరం కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని యూనివర్సిటీ వరకు వచ్చాము. రైతుల ఆత్మహత్యలకు మరొక కారణము వాళ్లంతా గొప్పలకు పోయి, అప్పులు చేసి ప్రభుత్వ పాఠశాలలను వదిలి పెట్టి ప్రైవేట్ స్కూళ్లు, కార్పొరేట్ స్కూళ్లలో తమ పిల్లలను చదివించుకుంటూ అప్పుల పాలౌతున్నారు. ప్రభుత్వ ఆధీనంలోనే రెసిడెన్షియల్ పాఠశాలలు నడుస్తున్నాయి. అవి ఎందుకు బలంగా ఉన్నాయి? అందులో విద్యా ప్రమాణాలు ఎందుకు బాగున్నాయి? అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలు ఎందుకు నిర్వీర్యమౌతున్నాయని ఆలోచించాల్సిన అవసరము ఉంది.

ప్రభుత్వం విద్య కోసం 12 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతోంది. ఆ డబ్బులు వృథా కావొద్దు. దానికి అదనంగా ఇంకొక 2, 3 వేల కోట్ల రూపాయలు ఖర్చుపెడితే కార్పొరేట్ కళాశాలలకు, కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెరిగే అవకాశం ఉంది. ఆ దిశగా గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి మరియు విద్యా శాఖ మంత్రి గారు ఉన్నత విద్యా వంతులు, వారు అనేక చర్యలు తీసుకుంటున్నారు. ఆ చర్యలను నేను కాదనడం లేదు. ప్రైవేటు, మరియు కార్పొరేట్ విద్యా వ్యవస్థను ఒకవైపు నియంత్రించుకుంటూ, ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలలను బలోపేతం చేయడానికి కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే అసెంబ్లీలో చట్టాలు తీసుకురావాలి. ప్రభుత్వ టీచర్లకు, లెక్చరర్లకు షార్ట్ ఓరియంటేషన్ కోర్సులు ప్రవేశ పెట్టి, ఎప్పటికప్పుడు వాళ్లలో ఇంగ్లీష్‌మరియు ఇతర స్కిల్స్‌ను డెవలప్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. రాజ్యాంగపరమైన హక్కు అయిన విద్యను ప్రభుత్వము దశల వారీగా తప్పించుకోవడానికి వీలు లేదు.

విద్య, వైద్యము రాజ్యాంగము నుంచి సంక్రమించాయి. మిగతావన్నీ తరువాత వచ్చి చేరాయి. ఈ రెండు బాధ్యతలను చాలా కఠినంగా అమలు చేయడానికి ప్రభుత్వము చర్యలు తీసుకోవాలి. వైద్యం విషయానికి వస్తే ప్రభుత్వము కొన్ని కొత్త కార్పొరేట్‌హాస్పిటల్స్‌ను ఏర్పాటు చేస్తానంది, అందుకు అభినందిస్తున్నాము. ముందుగా గాంధీ మరియు, ఉస్మానియా హాస్పిటల్స్‌ను కార్పొరేట్ స్థాయిలో ఆధునీకరించాల్సిన అవసరము ఉంది. కేర్, యశోద హాస్పిటల్స్‌లో ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయి, ప్రజలు ఎందుకు వాటిని గొప్పగా చూస్తున్నారు, ప్రభుత్వ హాస్పిటల్స్‌ను ఎందుకు ఆ విధంగా చూడ లేకపోతున్నారో వాటన్నింటిని రీసర్చ్ చేసి, వైద్య అధికారులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వ హాస్పిటల్స్‌ను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరము ఉంది. కేటాయింపులు బాగానే చేస్తున్నారు, కాని ఆ కేటాయింపులను ఏ విషయం మీద ఎలా ఖర్చు పెట్టాలి, అనే అంశం కూడా ఆలోచించాలని ఈ ప్రభుత్వాన్ని మీ ద్వారా డిమాండ్ చేస్తున్నాను.

ప్రభుత్వము వాస్తవాలకు దూరంగా ఉంది. ఎందుకంటే మన నిర్వహణా ఖర్చులు జీతాలు, ఎస్టాబ్లిష్‌మెంట్ ఖర్చులు దాదాపు 60వేల కోట్ల వరకు ఉన్నాయి. మన ఆదాయము వ్యాట్, ఎక్సైజ్, ట్రాన్స్‌పోర్ట్ మరియు మిగతా అన్ని సోర్సులు కలిపి, కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే గ్రాంటులు అన్నీ కలిపి 70 నుంచి 85 వేల కోట్ల రూపాయల వరకు, దాదాపు 90వేల కోట్ల రూపాయలు అనుకుందాము. లక్షా 49వేల కోట్లకు అప్పులు ఎక్కువగా

తీసుకురావడం ద్వారా, పెద్దలు చెప్పినట్లు మన బడ్జెట్ అప్పుల బడ్జెట్ కాకూడదు. ఆర్థిక శాఖా మంత్రి గారు అప్పులు తీసుకువచ్చేది అభివృద్ధి కోసమే కదా, తప్పేమి అంటున్నారు. అభివృద్ధిలో భాగమైన పరిశ్రమల స్థాపన, వ్యవసాయ ఉత్పత్తులను పెంచడానికి విద్యా సంస్థలను పటిష్టము చేయడానికి వీటి కోసం అప్పులు తెస్తే తప్పు లేదు. కానీ అనవసరమైన ఖర్చులు అనుత్పాదక ఖర్చులు పెరిగే విధంగా అప్పులు తెస్తే మన రాష్ట్రానికి పెను భారము అవుతుంది. ఈ అప్పులను కూడా ఒక దశల వారీగా తీసుకు రావాలి. మిషన్ భగీరథ కోసం అప్పులు తీసుకు వచ్చాము. అది అనుత్పాదక ఖర్చు.

ఇంటింటికి నల్లా. ఆ లక్ష్యము మంచిదే, మనం ఇంటింటికి నల్లా స్కీమ్‌ను చేరుకోవడానికి కొంత సమయం పడుతుంది. ముందుగా ఇంటింటికి విద్య కావాలి, ఇంటింటికి ఉద్యోగం, ఉపాధి కావాలి. వ్యవసాయ ఉత్పత్తులు, పారిశ్రామిక ఉత్పత్తులను పెంచిన తరువాత మనం ఒక స్టేజికి వెళ్లిన తరువాత ఇంటింటికి నల్లా కావాలి. పరిశ్రమల గ్రోత్‌ను పెంచుకోవాలిసిన అవసరము ఉంది. ప్రాధాన్యతల్లో మార్పులు తీసుకురాకుండా అప్రధానమైనటువంటి స్కీమ్‌ల కోసం ఖర్చు చేయకూడదు. ఇంటింటికి నల్లా నల్గొండ జిల్లాలో కావాలి, ఎందుకంటే అక్కడ ప్రజలు ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడుతున్నారు. అవసరం ఉన్నా, లేకున్నా అనుత్పాదక వ్యయాన్ని పెంచుకుంటూ వెళితే రాష్ట్రము అప్పుల ఊబిలో కూరుకుపోయి, మన బడ్జెటు ఉత్పాదక వ్యయం నుంచి అనుత్పాదక వ్యయం వైపు వెళ్లడానికి అవకాశం ఉంటుంది. ఆ దిశగా మనమందరం ఆలోచించాల్సిన అవసరము ఉంది. రాష్ట్రము యొక్క అభివృద్ధి దీర్ఘకాలిక మరియు స్వల్పకాలిక ప్రణాళికల మీద ఆధారపడి ఉంటుంది. దీర్ఘకాలిక ప్రణాళికలో ఇరిగేషన్, పరిశ్రమలు, విద్య మొదలైనవి ఉన్నాయి.

ప్రజల ఆశలను నెరవేర్చడం అభివృద్ధిలో ఒక భాగము. పాలకులకు ఉండాల్సిన లక్షణము రాష్ట్రాన్ని శాశ్వతంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవడము. దీర్ఘకాలిక ప్రణాళిక అనేది ఉంటే ఈరోజు మనల్ని విమర్శించిన వారే రేపు మనల్ని పొగుడుతారు. ఉదాహరణకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేసినప్పుడు కొందరు తిట్టారు. ఇప్పుడు నాగార్జున సాగర్ ప్రాజెక్టు కట్టినందుకు సంతోషిస్తున్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం అధికమొత్తంలో డబ్బు ఖర్చు పెట్టడం తప్పు కాదు. ఉపాధి విషయంలో కూడా ప్రణాళిక ఉండాలి. నీళ్లు లేని పథకాలకు, ఇరిగేషన్ పథకాలకు, ఆనీరు అందించే పథకము ఎకరం భూమి కన్నా ఎక్కువ అయ్యే ఖర్చు మనకు వద్దు. ఎక్కువ డబ్బులు ఖర్చు పెట్టే పథకాల ద్వారా మనకు ఏవిధంగా ఉత్పాదకత పెరుగుతుంది?

**2.10 ని.** అక్కడ విజన్ ఉండాలి. ఎత్తిపోతల పథకంలో నీళ్లు లేని ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఎక్కువ డబ్బు ఖర్చు పెడితే ఒక్క ఎకరానికి నీరందించే ఖర్చుకన్నా ఎకరం భూమి కంటే ఎక్కువ ఖర్చయ్యే పథకం వద్దు. తక్కువ ఖర్చుతో మనకు ఉత్పాదకతను పెంచే వాటికి మాత్రమే ఖర్చు పెట్టాలి. ఇరిగేషన్, అగ్రికల్చర్, ఐటి రంగం, ఏ ప్రాజెక్టు చేపట్టినా ఆ ప్రాజెక్టు మీద పెట్టే ఖర్చుకంటే రెండు మూడు రెట్లు లాభాలు వచ్చేలా ఉంటేనే ఖర్చు పెట్టాలి. మానవ వనరులను మానవులకు ఉపాధి, ఉత్పాదకత, మానవుని శక్తి యుక్తులను సద్వినియోగం చేసే విధంగా ఉంటేనే ఖర్చు చేయాలి. ఆ విధంగా ఆలోచించాలి. అప్పుడే ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. మానవ వనరుల ఉపాధి ఉత్పాదకత పెరుగుతుంది. మెజారిటీ స్కీమ్స్ అలాగే ఉన్నాయి. కొన్ని స్కీమ్స్‌కు మాత్రం ఆ విధమైన విజన్ కన్పించడం లేదు. అందుకే మన బడ్జెట్ రియలిస్టిక్‌గా ఉండాలి కాని అప్పుల బడ్జెట్ కావద్దని మరొకసారి కోరుతున్నాను.

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను మూడు సంవత్సరాలుగా సరైన విధంగా ఉపయోగించడం లేదు. ఎస్‌సి, ఎస్‌టిలకు ఉపయోగించవలసిన స్కీమ్స్ చాలా ఉన్నాయి. కాలేజీలు, రెసిడెన్షియల్ స్కూల్సుకు సంబంధించిన బిల్డింగ్సు కట్టడానికి సబ్‌ప్లాన్ నిధులను ఉపయోగించాలి. అదేవిధంగా ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను గ్రామీణ ఎస్‌సి, ఎస్‌టిలకు మూడెకరాల భూమికోసం ఖర్చు చేయాలి. వారి ఉత్పాదకత పెంచే విధంగా మనం ఇచ్చే ఎడ్లను, పంపు సెట్లను కాని సద్వినియోగం చేసుకుంటున్నారా లేదా అని ఆలోచించాలి. మనం మంచి లక్ష్యంతో మూడెకరాల భూమి ఇవ్వాలని అనుకున్నాము. అది కూడా సాగుకు ఉపయోగకరమైన భూమి ఇవ్వాలని ముఖ్యమంత్రిగారు అన్నారు. ఆ విధంగా రైతులకు పూర్తి స్థాయిలో సాయం అందించాలి. వారికి ఆధునిక వ్యవసాయ పద్ధతులు, తక్కువ ఖర్చుతో వ్యవసాయం చేసి రాబడి పెంచుకొనేలా, ఏ పంటలు పెడితే గిట్టుబాటు అవుతుందో అటువంటి వాటిని పండించే విధంగా వారికి ట్రెయినింగ్ ఇచ్చి సబ్‌ప్లాన్‌ను ఉపయోగించాలి. అగ్రికల్చర్ అధికారులను నియమిస్తున్నారు. వారు ఉత్పత్తి మీదనే కాకుండా మార్కెటింగ్ పరిస్థితుల మీద అవగాహన పెంచాలి. ఎస్‌సి, ఎస్‌టి వారికి ఓరియంటేషన్ క్లాస్‌లు తీసుకుంటే బాగుంటుంది. మూడెకరాల పథకాన్ని మరింత వేగవంతం చేయాలి. ఎందుకంటే మూడులక్షల ఎకరాలు పంచాలనుకుంటే అందులో పది శాతం కూడా సద్వినియోగం కాలేదు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను

పూర్తి స్థాయిలో వినియోగించాలి. అదేవిధంగా ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్‌పోస్టులను నింపేలా చర్యలు తీసుకోవాలి.

ఎస్‌సి, ఎస్‌టి కాలేజీ హాస్టల్సులో విద్యార్థులకు భోజనం పెట్టడం లేదు. వార్డెన్స్‌ను, వర్కర్స్‌ను అపాయింట్ చేయడం లేదు. బడ్జెట్‌లో వాటి గురించి ఎక్కడా లేదు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి హాస్టల్సులో వర్కర్స్, వార్డన్స్ లేరు. అనేక శాఖలలో ఉద్యోగులను అపాయింట్ చేయాలని చర్చ జరుగుతుంది. కాని ఈ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో ఎందుకు వారిని అపాయింట్‌మెంట్ చేయడం లేదు? ఒకవైపు వెల్ఫేర్ బడ్జెట్ అని చెబుతున్నప్పటికీ ఇటువంటి సంస్థలను నిర్లక్ష్యం చేస్తే మౌలికంగా ఏ విధంగా ఉపయోగపడుతుంది. చాలా చోట్ల హాస్టల్సుకు బిల్డింగ్సు దొరకడం లేదు. ప్రభుత్వం స్వంత బిల్డింగ్సును నిర్మిస్తే శాశ్వతమైన పేరుంటుంది. గతంలో జలగం వెంగళరావుగారు 1976లో నింబోలి అడ్డలో ఒక హాస్టల్ కట్టించారు. ఇప్పటికీ ఆ బిల్డింగ్‌ను చూసినప్పుడల్లా వెంగళరావుగారు కట్టించారని అంటారు. కాలేజీ హాస్టల్సు, రెసిడెన్షియల్ హాస్టల్సుకు బిల్డింగ్సు కట్టాలి.

ఈ బడ్జెట్‌లో బిసిలకు 119 రెసిడెన్షియల్ పాఠశాలలు కేటాయించారు. కేవలం నిర్వహణ ఖర్చులకే బడ్జెట్ కేటాయించారు కాని బిల్డింగ్స్ కట్టడానికి ఒక్క పైసా కూడా కేటాయించలేదు. ఇతర సామాజిక వర్గాలకు చెందిన హాస్టల్సుకు బిల్డింగ్స్ కట్టడానికి బడ్జెట్ కేటాయించారు. బిసిలు చేసిన పాపం ఏమిటని సభాముఖంగా ఆర్థికశాఖామాత్యులను అడుగుతున్నాను. అన్ని వర్గాల జీతభత్యాలు పెంచారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి పిల్లలంతా ముఖ్యమంత్రిగారు మాకు ఏమి బోనస్ ఇవ్వరా అని అడుగుతున్నారు.

డిఎస్‌సి, టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి కూడా ఈ బడ్జెట్‌లో ప్రస్తావన రాలేదు. దానికి తగ్గట్టుగా డిపార్ట్‌మెంట్‌లో ఆయా విధంగా కేటాయింపులు పెంచాలి. మొన్న రెసిడెన్షియల్ పాఠశాలలకు నోటిఫికేషన్ జారీ చేశారు. అందులో లోపాలున్నాయని రీ బ్యాక్ చేశారు. కొత్త నోటిఫికేషన్ ఇస్తారని ఆశిస్తున్నాను. జూనియర్ లెక్చరర్స్ టీచర్స్‌కాని కాంట్రాక్టు వ్యవస్థలో పని చేస్తున్న వారితో చర్చించి మధ్యే మార్గంగా కొంతమందిని రెగ్యులరైజ్ చేసి కొత్త నోటిఫికేషన్స్ వేయాలి. టీచర్ పోస్టులను భర్తీ చేయడం గురించి బడ్జెట్‌లో ఎక్కడా పొందుపరచలేదు. ఐదు లక్షల మంది బిఎడ్, డిఎడ్, తెలుగు పండిట్, పిఇటి చేసిన వాళ్లంతా నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. ఉద్యోగాలు లేక ముప్పై, ముప్పై ఐదు సంవత్సరాల వయస్సు వచ్చినా పెండ్లి చేసుకోలేదు, ఈ బడ్జెట్‌లో అయినా ఉద్యోగాల భర్తీ గురించి వస్తే బాగుండునని ఆలోచన చేస్తుంటే ఇప్పటి వరకు ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించడం లేదు. నిరుద్యోగులందరూ బాధ పడుతున్నారు. ఆ దిశగా ప్రభుత్వం పయనించాలని కోరుతున్నాను. టీచర్ పోస్టులు భర్తీ చేస్తే పాఠశాలల్లో తప్పనిసరిగా మంచి స్టాండర్డ్స్ వస్తాయని ఆశిస్తున్నాను. విద్యాశాఖకు బడ్జెట్ కేటాయింపులు పెంచి బలోపేతం చేయాలి. ఇంగ్లీష్ మీడియం క్లాసులు పెట్టి ఈ బడ్జెట్‌లో దానికి తగిన విధంగా కేటాయింపులు పెంచి వసరులు సమకూర్చుకోవాలని తెలియ చేస్తున్నాను.

ఇరిగేషన్‌కు సంబంధించి గత సంవత్సరంలో రూ.25వేల కోట్లు కేటాయించారు. చాలా మంచి పథకం అది. అంత ఖర్చు పెట్టవలసిన అవసరం కూడా ఉంది. ఎందుకంటే రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మంచి ప్రాజెక్టులు, కాలువలు వచ్చి నీటి సదుపాయాలు పెంచాలి. అండర్‌గ్రౌండ్ వాటర్ పెరగాలి. కాని రూ.25వేల కోట్లలో పదివేల కోట్ల రూపాయలకు మించి ఖర్చు పెట్టలేదు. మిగతా బడ్జెట్ అంతా అలాగే ఉంది. ఎందుకు ఖర్చు పెట్టలేదు? ఈ సంవత్సరం బడ్జెట్‌లో బాగానే కేటాయించింది. కేటాయించిన డబ్బును పూర్తి స్థాయిలో ఖర్చు పెట్టాలి. ప్రాజెక్టు, కాలువలను రీడిజైన్ పేరు మీద జాప్యం చేస్తున్నారు. అలా చేయకుండా వాటిని శరవేగంతో పూర్తి చేయాలి.

ప్రభుత్వం చేపట్టినటువంటి మిషన్ కాకతీయ చాలా మంచి పథకం. ఆ పథకం వల్ల చెరువులన్నీ కళకళలాడుతున్నాయి. ప్రతిపక్షాలైనా, అధికార పక్షాలవారైనా వాస్తవాన్ని అంగీకరించాలి. అన్ని పథకాలలో మిషన్ కాకతీయ పథకం బాగా సక్సెస్ అయింది. ఆ పథకంలాగనే మిగతా ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేయాలి. నీళ్లు త్వరగా వస్తేనే రాష్ట్రాభివృద్ధికి చేయూతనిచ్చినట్లు అవుతుంది. ఇరిగేషన్‌కు కేటాయించిన బడ్జెట్ పూర్తిగా ఖర్చు పెట్టాలి, మిస్‌యూజ్ చేయకూడదు. ఎందుకంటే కాంట్రాక్టర్స్, ఇంజనీర్స్ కుమ్మక్కై పెద్దయెత్తున స్వాహా చేసే ప్రమాదం ఉంది. దానిని థర్డ్ పార్టీ ఎంక్వైరీ చేసి సోషల్ ఆడిట్ చేసి అటువంటి వాటిని అరికట్టడానికి తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలి. ఆదిశగా ప్రభుత్వం వ్యవహరించాలి.

రైతులకు పవర్ కట్ లేకుండా విద్యుత్ తొమ్మిది గంటలు ఇస్తున్నారు. కాని దీర్ఘకాలిక విజన్ కావాలి. సోలార్ ఎనర్జీ మీద ఎక్కువ డిపెండ్ అయ్యే విధంగా రైతులకు సబ్సిడీ ఇచ్చి సోలార్ పంప్‌సెట్స్ పెట్టుకునేలా, ప్రజలు సోలార్ విద్యుత్ వినియోగించుకునేలా చేసినట్లయితే పర్మినెంట్‌గా విద్యుత్ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. కాబట్టి విండ్ ఎనర్జీ, సోలార్ ఎనర్జీల మీద ప్రభుత్వం ఎక్కువ దృష్టిపెట్టాలి. ఈ బడ్జెట్‌లో ఎక్కడా వాటి గురించి ప్రస్తావించలేదు. కేంద్రప్రభుత్వం నుండి గ్రాంట్స్ తెచ్చి అయినా

రాష్ట్రప్రభుత్వం కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సోలార్ ఎనర్జీని, విండ్ ఎనర్జీని ఎక్కువ ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.

భారీపరిశ్రమలు స్థాపించే విషయంలో చాలా తక్కువ కేటాయింపులు చేశారు. పరిశ్రమలంటే అన్ని ప్రయివేటు పరిశ్రమలే ఉన్నాయి. గతంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పరిశ్రమలు ప్రారంభించేవి. కాని ఈ మధ్యకాలంలో పరిశ్రమలంటే మొత్తం ప్రయివేటు రంగానికి అప్పచెప్పి ప్రభుత్వం చేతులెత్తి వేస్తుంది. ఆ విధంగా కాకుండా ప్రభుత్వం, ప్రయివేటు రంగాలతో ఆలోచన చేయవలసిన అవసరం ఉంది. ఇందులో బిసిలకు, ఒబిసిలకు ఒక్క పారిశ్రామిక విధానం లేదు. పరిశ్రమల రంగంలో ఒబిసిలకు, బిసిలకు ఒక పరిశ్రమ లేదని ప్రభుత్వ లెక్కలు చూపిస్తున్నాయి. అందుకోసం బిసి పారిశ్రామిక విధానాన్ని కూడా ప్రభుత్వం ప్రకటించాలి.

2.20 మ. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక విధానాన్ని ప్రకటించిన తరువాత ఆయా సామాజిక వర్గాల ప్రజలు కొద్దికొద్దిగా పైకి వస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక విధానాన్ని మళ్లీ రెవ్యూ చేసి ఇంకా ఎక్కువ మందికి ఉపయోగపడే విధంగా చెయ్యాలి. బీసీలకు పారిశ్రామిక విధానాన్ని ఇంట్రొడ్యూస్ చెయ్యవలసిన అవసరం ఉంది. పారిశ్రామిక రంగాన్ని ఎంకరేజ్ చేసి, ఎక్కువ ఇన్సెంటీవ్స్ ఇస్తే ఆయా వర్గాల నుండి పెద్దఎత్తున పారిశ్రామికవేత్తలు తయారవుతారు, ఈ విధంగా చేస్తే ఎక్కువ మంది పైకి వస్తారు. బీసీలకు పారిశ్రామిక విధానాన్ని ప్రకటించాలని మీ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రధానంగా, పరిశ్రమల విషయంలో ప్రభుత్వం పునరాలోచించి ఈ బడ్జెట్ సమావేశాలలోనే బీసి పారిశ్రామిక విధానాన్ని ప్రకటించాలి. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక విధానాన్ని ప్రవేశపెట్టిన తరువాత కేవలం కొంత మంది మాత్రమే పరిశ్రమల స్థాపనకు చొరవ చూపారు. జనాభా నిష్పత్తిలో ముందుకు రాలేదు. వారికి ఇంకా ప్రోత్సాహకాలివ్వాలి. ఏ పరిశ్రమలలో అయితే ఎస్సీ, ఎస్టీలు రాణిస్తున్నారో చూసి ఆ విధంగా బీసీలను కూడా ప్రోత్సహించి ముందుకు తీసుకెళ్లాలి. ప్రభుత్వం మల్టీ నేషనల్ కంపెనీలకు ఏ విధంగా భూములు, ప్రోత్సాహకాలు ఇచ్చి ప్రోత్సాహిస్తుందో ఆ విధంగా బీసీలకు కూడా ఇవ్వాలని కోరుతున్నాను. బీసీలకు సంబంధించి చిన్నతరహా, మధ్యతరహా, పెద్దతరహా పరిశ్రమలకు ఇన్సెంటీవ్స్ ఇచ్చినట్లయితే వారు డెవలప్ అవ్వడానికి అవకాశం ఉంటుంది.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయమై ప్రభుత్వం ఒకసారి ఆలోచించాలి. దీని గురించి బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి బడ్జెట్ ఎంత కేటాయించారు? రెండు లక్షల ఎనభైవేల ఇళ్లు కడతామని చెప్పారు. రాష్ట్రంలో దాదాపు ఇరవై నాలుగు లక్షల మంది ఇళ్లులేని పేదలున్నారు. ఇళ్లను నిర్మించడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. స్థలాలు ఇచ్చి, వారినే ఇళ్లు నిర్మించుకోమనాలి లేదంటే మినీ కాంట్రాక్టర్లను పెట్టి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నియోజకవర్గాల వారీగా కట్టించాలి.

బీసీ కులాల అభివృద్ధికి సంకల్పించినందుకు ముఖ్యమంత్రి గారిని అభినందిస్తున్నాను. పది బీసి ఫెడరేషన్లకు సంబంధించి ఒక్క పైసా కూడా బడ్జెట్‌లో పెట్టలేదు. కొన్ని స్కీమ్స్‌కి బడ్జెట్‌ను తగ్గించారు. కాలేజ్ హాస్టల్స్‌లోని పిల్లలు రోడ్డున పడుతున్నారు. డిపార్ట్‌మెంట్‌లో సరైన అధికారి లేనందువల్ల ఆ శాఖ నిర్వీర్యమవుతుంది. ఈ విషయమై చర్యలు తీసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనారిటీ వర్గాల ప్రజలను అభివృద్ధిచేయవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. ఇతర సంక్షేమ పథకాలకు సంబంధించి బడ్జెట్‌లో నిధులను కేటాయించడాన్ని స్వాగతిస్తున్నాను. విద్యా, ఉపాధి రంగాలలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరుతూ నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ సెలవుతీసుకుంటున్నాను.

**శ్రీ చింతా ప్రభాకర్ :-** అధ్యక్షా, బడ్జెట్‌పై మాట్లాడే అవకాశం కల్పించినందుకు తమరికి, గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి, శాసనవ్యవహారాల శాఖా మంత్రి హరీష్‌రావు గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నేను కొత్త శాసనసభ్యుడిని. అపారమైన అనుభవం కలిగిన వ్యక్తులు, విషయ నిపుణులు, మేధావులు, అనర్గళంగా ప్రతి అంశంపై మాట్లాడే వాళ్లు ఉన్న ఈ సభలో నేను సామాన్యుడిని, చిన్నవాడిని. బడ్జెట్‌కి సంబంధించి పేద ప్రజలు ఏమనుకుంటున్నారనే విషయాలను నేను ఇక్కడ చెప్పే ప్రయత్నం చేస్తున్నాను. మా నియోజకవర్గంలో రెక్క ఆడితే కాని డొక్కాడని వారు చలా మంది ఉన్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంలో వాళ్లు చాలా సంతోషాన్ని వ్యక్తపరిచారన్న విషయాన్ని మేము విన్నాము. గతంలో బడ్జెట్ ప్రవేశపెట్టిన తెల్లారి పేపర్లలో రెండు చక్రాలను చూపించి, రూపాయి రాక, రూపాయి పోక అన్న కొటేషన్‌లతో వార్తాలు వచ్చేవి. ఆ వార్తలను మనం చదివాము. సామాన్య ప్రజలు ఇది మనకు సంబంధించిన బడ్జెట్ కాదని అనుకునేవారు. బడ్జెట్ అనేది జమాఖర్చులకి సంబంధించిన విషయం. మా దగ్గర అడ్తీ దుకాణాలుంటాయి. వాళ్ల రాబడి ఆదాయానికి సంబంధించి, వాళ్లు రాయించిన లెక్కలు, వారికి, రాసిన వారికి తప్ప ఇంకొకరికి అర్థం అయ్యేవి కాదు. బడ్జెట్‌కి సంబంధించి లోటు బడ్జెట్, మిగులు బడ్జెట్, రెవెన్యూ లోటు, గ్రోత్ రేట్, జీడీపీ, జీఎస్‌డీపీ,

పర్‌క్యాపిటా ఇన్‌కమ్ అని అర్థం కానటువంటి మాటలు మాట్లాడి, పేద ప్రజలకు ఉపయోగపడని పరిస్థితిని గతంలో చూశాము. ఈనాటి బడ్జెట్‌ను చూసి, తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి పౌరుడు, నా గురించి ఆలోచించి రాసిన లెక్కలే అని అనుకుంటున్నాడు. నా బతుకు తేల్చడానికి కేసీఆర్ వేసిన అంచనా అని అనుకుంటున్నాడు. సబ్బండ వర్ణాలు, బడుగులు, గొప్పగా సంప్రదింపులు చేసుకున్నారు. చేతివృత్తుల వారు, కులవృత్తుల వారు అంతరించిపోయిన సందర్భాన్ని గతంలో చూశాము. గతంలో చేతివృత్తులు, కులవృత్తులు చేసుకునే వారిని పట్టించుకోలేదని, ఒక కవి చేతివృత్తులకు సంబంధించి రాసిన పాట ద్వారా, ఆ ప్రభుత్వం పడిపోయిందని, ఆ పార్టీకి సంబంధించిన నాయకులే పేపర్లలో వేయించిన సందర్భాన్ని మనం చూశాము.

**2.30 ము.** కానీ ఈరోజు గౌరవ ముఖ్యమంత్రిగారు పేద, బడుగు, బలహీన వర్గాల వారందరి కళ్లలో కాంతిని చూడాలి, వాళ్లు బాగుపడాలి అనే ఒక గొప్ప ఆలోచనతో ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్ సందర్భంగా పేద, బడుగు, బలహీన వర్గాలకు సంబంధించిన కులాలైన యాదవులు, కమ్మరులు, కుమ్మరులు, బెస్తవాళ్లు, ముదిరాజ్‌లు, పద్మశాలీలు, రజకులు, నాయీ బ్రాహ్మణులు మొదలైన వారందరి బ్రతుకులు బాగుపడాలనే ఉద్దేశంతో ఈ బడ్జెట్‌లో వారికి కేటాయింపులు చేశారు. గతంలో రూపాయి రాక, రూపాయి పోక అని పత్రికలలో రాసినవారే మొన్నటిరోజు పత్రికలలో చాలా గొప్పగా ఏ కులానికి ఎంత బడ్జెట్ కేటాయించారు, ఏ చేతివృత్తులకు ఎంత కేటాయించారనే పూర్తి సమాచారాన్ని పత్రికలలో రాయడం మనం చూశాము. గతంలో ఎప్పుడూ అటువంటి పరిస్థితి లేదు. బడ్జెట్‌కు సంబంధించిన విషయంలో ఎవరినీ విస్మరించొద్దనే ఉద్దేశంతో గౌరవ ముఖ్యమంత్రిగారు అన్ని వర్గాలకు సమన్యాయం చేశారు. గత పాలకులు సమాజంలో సగ భాగం ఉన్న జనాభాను విస్మరించారు. ఎక్కువ మంది ఆధారపడిన వ్యవసాయాన్ని గత పాలకులు విస్మరించారు. పల్లెలే ఈ దేశానికి పట్టుగొమ్మ అనే ప్రాథమిక సూత్రాన్ని మర్చిపోయారు. నిజం మర్చి నిద్రపోయినటువంటి ఆనాటి నాయకులు గాలిమేడలు కట్టేసి పునాదులు లేనటువంటి నిర్మాణాలు చేశారనే విషయం కూడా మనం చూశాము. ఈ దేశంలోనే గొప్పగా మన రాష్ట్రం ఆదర్శంగా ఉండాలనే ఆలోచనతో మన గౌరవ ముఖ్యమంత్రిగారు వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారు. గత పాలకులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కూడా కుప్పకూల్చారు. ఆ విషయంలో కూడా మన గౌరవ ముఖ్యమంత్రిగారు బాగా ఆలోచించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా మెరుగుపడాలని చాలా రకాల సంక్షేమాలకు సంబంధించి గానీ అభివృద్ధికి సంబంధించి తీసుకున్న నిర్ణయాలను అందరూ హర్షిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ ఒక్కరు కూడా ఆకలితో అలమటించొద్దు, ఆకలి చావులుండొద్దు, అందరూ సంతోషంగా ఉండాలనే కృత నిశ్చయంతో తెలంగాణ బిడ్డలకు సంబంధించి, తెలంగాణ రాష్ట్రంలోని సకల జనులందరూ పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణలో ప్రతిఒక్కరూ సంతోషంగా ఉండాలని ముఖ్యమంత్రిగారు గొప్పగా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నారు.

ఈ సందర్భంగా సంగారెడ్డి నియోజకవర్గం నుంచి నాకు ఎమ్మెల్యేగా అవకాశమిచ్చిన ముఖ్యమంత్రి గారికి, నన్ను ఈ మొట్టమొదటి శాసనసభకు పంపినందుకు నా నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వకంగా శిరస్సు వంచి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఉమ్మడి రాష్ట్రంలో ఉద్యోగాలు లేక ఉపాధి లేక తినడానికి తిండి లేక తాగడానికి నీళ్లు లేక బ్రతకడానికి మార్గం లేక తెలంగాణ బిడ్డలు ఆగమైపోయిన సందర్భాన్ని మనం గతంలో చూశాం.

చేతివృత్తులకు సంబంధించిన వారు పనులు లేక పొట్టచేత పట్టుకొని ఎక్కడ పని దొరికితే అక్కడికి వెళ్లిన సందర్భం గత పాలకుల పాపమని మనకందరికీ తెలుసు. ఈ బడ్జెట్‌లో కేవలం కులవృత్తులనే కాకుండా అన్ని వర్గాలకు సమన్యాయం చేశారు. న్యాయవాదులు గానీ జర్నలిస్టులు గానీ, బ్రాహ్మణ కులాలకు గానీ నిధులు కేటాయించి కొత్త చరిత్ర రాసిన ఘనత ఈ టీఆర్ఎస్ ప్రభుత్వానికున్నది. అధ్యక్షా, నిన్నటికి భారత పార్లమెంట్ కనీస వేతన చట్టాన్ని తీసుకొచ్చి 60 సంవత్సరాలు పూర్తయింది. శ్రమ దోపిడీ చేయొద్దని, వెట్టి చాకిరీ చేయించుకోవద్దని, ఒకవేళ అలా చేస్తే శిక్ష తప్పదని ఆ చట్టంలో రాసుకున్నాము. ఈ 60 సంవత్సరాలు భారతదేశాన్ని ఏలింది కాంగ్రెస్, బిజెపి పార్టీలు, మన రాష్ట్రాన్ని పాలించింది కాంగ్రెస్ తెలుగుదేశం పార్టీలు. వారి పాలనలో కనీస వేతన చట్టం అమలు చేసిన దాఖలాలు లేవు. వెట్టి చాకిరీ చేయించుకొని నెలకు రూ.500, రూ.1000, రూ.2000, రూ.3000 జీతాలు ఇస్తే వారు రోజుకు ఒక్క పూట కూడా కడుపు నింపుకోలేని పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు అటువంటి పరిస్థితి నుంచి వారిని గట్టెక్కించడానికి మన గౌరవ ముఖ్యమంత్రిగారు మానవత్వమున్న, మనసున్న మహామనిషిగా కనీస వేతన చట్టాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలుచేయడానికి అంగన్‌వాడీ కార్యకర్తలకు, హోంగార్డులకు వీఏఓలు, వీఆర్ఏలు కాకుండా 104, 105 సర్వీసులకు సంబంధించిన ఐకెపి ఉద్యోగులను, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను, కాంట్రాక్టు ఉద్యోగులను పిలిపించుకొని వారి కష్టసుఖాలు తెలుసుకొని, మంచి భోజనం పెట్టి అప్పటికప్పుడే వారి

సమస్యలను విని జీతాలు పెంచిన ఘనత మన గౌరవ ముఖ్యమంత్రి గారికి దక్కుతుంది. గత పాలకులకు ఇలాంటి మంచి పనులు చేయడానికి వాళ్లకు మనసు రాలేదు. చేసినటువంటి దాఖలాలు కూడా లేవు.

ఈ సందర్భంలో ప్రతిపక్ష నాయకులకు ఒక విషయాన్ని గుర్తుచేస్తున్నాను. గతంలో సంక్షేమ పథకాలను అమలుచేసే విషయంలో చాలీచాలని పరిస్థితి మనం చూశాము. గత పాలకులు ఉమ్మడి రాష్ట్రంలో పెన్షన్‌లకి సంబంధించి రూ.75, రూ.200 ఇస్తే ఆ డబ్బులు చేతికి, నోటికి సరిపోని పరిస్థితి ఉండేది. అంతే కాకుండా ఈ ప్రభుత్వం ఒంటరి మహిళలకు కూడా రూ.1000 పెన్షన్ ఇవ్వడం, వృద్ధులకు రూ.1000, వికలాంగులకు రూ.1500 చొప్పున పెన్షన్ ఇస్తున్నది. ఇవన్నీ ప్రతిపక్షాలకు కనిపించడం లేదా అని అడుగుతున్నాను. మంచి పనిచేస్తే మంచి అని చెప్పడానికి కూడా ప్రతిపక్ష సభ్యులకు మనసు రావడం లేదు.

కళ్యాణ లక్ష్మికి సంబంధించి పేదింటి వారి ఆడబిడ్డల వివాహాల గురించి గౌరవ ముఖ్యమంత్రిగారు రూ.51వేలు అందిస్తున్న సందర్భంలో, వారి కళ్లలో కాంతిని చూడగలిగారు. అందిస్తున్న డబ్బులు సరిపోవడం లేదనే ఉద్దేశంతో ఈ బడ్జెట్‌లో దానిని మరలా పెంచి రూ.75వేల 116లు చేశారు. ఎస్.సి, ఎస్.టి డెవలప్‌మెంట్‌కి సంబంధించిన విషయంలో కూడా చాలా చర్యలు తీసుకున్నారు. చిన్న, చిన్న ఉద్యోగుల జీతాలు కూడా పెంచారు. MBCలకి సంబంధించిన కార్పోరేషన్‌ని ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్లను కేటాయించారు. కొత్తగా 119 రెసిడెన్షియల్ పాఠశాలలను కూడా ఏర్పాటు చేశారు. గర్భిణీ స్త్రీలు, చంటిపిల్లలకు వాడుకునేందుకు వీలుగా కేసీఆర్ గారి పేరుమీద కిట్ ఇస్తున్న సందర్భాన్ని కూడా వారు ప్రకటించారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక్క ఎమ్మెల్యే కూడా ఈ ప్రభుత్వం బాగా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నదని చెప్పిన సందర్భం లేదు. మంచిని మంచి అనే సంస్కారం లేకపోయినప్పటికీ తప్పులకు సంబంధించి వేలెత్తి చూపించినా మా ప్రభుత్వ పనితీరులో లోపాలుంటే చెబితే వాటిని సరిచేసుకోవడానికి ఇబ్బంది లేదని గౌరవ ముఖ్యమంత్రిగారు చాలాసార్లు చెప్పారు. మా మీద నమ్మకం పెట్టిన ప్రజలకు మా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి వారికి సంపూర్ణంగా చేరాలని మేం కోరుకుంటున్నాము. తెలంగాణ రాష్ట్రానికున్న వనరుల మేరకు, మన రాష్ట్రానికున్న ఆదాయం మేరకు, అద్భుతమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు గౌరవనీయులు ఈటల రాజేందర్ గారిని ఈ సందర్భంగా హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

**2.40 ము.** ప్రభుత్వం ఉన్నది సామాన్యుల కోసమే అని గ్రహించి త్రికరణశుద్ధిగా పని చేస్తున్న కేసీఆర్ గారి అంతరంగాన్ని ఈ బడ్జెట్ ఆవిష్కరించింది. మాకు మా గ్రామాలు, మా వ్యవసాయం, మా కులవృత్తులు, మా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణాలోని పేదలు మరియు మహిళ సంక్షేమమే మాకు ముఖ్యమని తెలియజేసినందుకు ఆర్థికమంత్రి గారికి ధన్యవాదములు తెలియజేస్తున్నాను.

ఈ సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి గారికి మరియు ఆర్థిక శాఖ మంత్రి గారికి కొన్ని సూచనలు చేయాలని అనుకుంటున్నాను. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు వాటా ఇచ్చే విధానం సహేతుకంగా లేదు. అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు తక్కువ శాతంగా వాటా ఇస్తున్నారు. ఈ విధానం వల్ల తెలంగాణ లాంటి చిన్న రాష్ట్రాలు నష్టపోయే పరిస్థితి ఉన్నందున ఈ విషయంలో మార్పులు తెచ్చేందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరుతున్నాను. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేస్తున్న ఉద్యోగస్తులకు తక్కువ వేతనం ఇస్తున్న సందర్భంలో, వారందరూ మన తెలంగాణ బిడ్డలే కావునా వారి జీతాలను పెంచిన సందర్భంలో రాష్ట్రంపై అధిక భారం పడుతున్నందున కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేసే ఉద్యోగులందరికి నూటికి నూరు శాతం జీతాలను కేంద్రమే చెల్లించే విధంగా ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నాను. గ్రామీణ ఉపాధి హామి పథకం కింద కూలి పనులు చేస్తున్నప్పటికి ఇది ఎంత మంచి పథకమైనప్పటికీ రైతులకు పెట్టుబడి పెరుగుతున్నందున ఈ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, అవసరమైన పక్షంలో ఈ విషయమై శాసనసభలో తీర్మానం చేయాలని కోరుతున్నాను. పేద ప్రజల బడ్జెట్‌ను రూపొందించిన ఈ ప్రభుత్వానికి, పేద ప్రజలు సంతోషంగా ఉన్న ఈ సందర్భంలో ఈ తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పేదల ఆశా జ్యోతి అయిన ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి, భావి బంగారు తెలంగాణను నిర్మాణం చేస్తున్న దిశలో ఈ బడ్జెట్‌ను రూపొందించినందుకు నా ఆమోదాన్ని తెలియజేస్తున్నాను.

**శ్రీ సున్నం రాజయ్య (భద్రాచలం):-** అధ్యక్షా, ఈ రోజు 2017-18వ సంవత్సరం బడ్జెట్ పై మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదములు తెలియజేస్తున్నాను. 1,49,645 కోట్ల రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి గారు ప్రవేశ పెట్టారు. 2014-15 నుంచి 2017-18వరకు గల బడ్జెట్‌లను పరిశీలించినట్లైతే, ప్రతి సంవత్సరం భారీ కేటాయింపులు జరుగుతున్నప్పటికీ, 14 నుంచి 15 శాతం నిధులు ఖర్చు కావడం లేదు. ప్రజలను మభ్య పెట్టేలాగా మరియు ప్రజలకు ఆశలు కల్పించే విధంగా, గొప్పలు చేప్పే విధంగా మాత్రమే

బడ్జెట్ కేటాయింపులు ఉన్నందున ఇది సమంజసం కాదని మనవి చేస్తున్నాను.

టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన 33 మాసాల్లో నాలుగు బడ్జెట్‌లు ప్రవేశపెట్టినప్పటికీ ఆదాయ మార్గాలను అభివృద్ధి చేయలేక పోయారు. ప్రాధాన్యత రంగాలకు కేటాయించిన డబ్బులను ఖర్చు చేయలేని ఫలితంగా తలసరి అప్పు 41,000 ఉన్నదని చెప్పడం ప్రభుత్వం వైఫల్యం అని భావిస్తున్నాను. ఎస్సీ, ఎస్టీలకు ఈ సంవత్సరం 22,598 కోట్ల రూపాయలు కేటాయించారు. గత సంవత్సరం 16,549 కోట్లు కేటాయించి, కేవలం రూ. 6,993కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి డైవర్ట్ చేసిన నిధులు క్యారిఫార్వర్డ్ కావడం లేదు. ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి, మా గిరిజన శాఖ మంత్రి, సోషల్ వెల్ఫేర్ మినిస్టర్ గార్ల ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి హాజరైన సందర్భంలోనూ మేము ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చి, దారిమళ్లిన నిధులను మరల ఈ వర్గాల సంక్షేమం కోసం పెట్టాలని కోరినప్పటికీ ఆ అంశానికి సంబంధించిన ప్రస్తావన లేదు. కావున, తక్షణమే ఆ దిశగా కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. రాష్ట్రంలో 52 శాతం బీసీ జనాభా ఉండగా వారికి కేవలం రూ.5,671 కోట్లు, మైనారిటీలకు 1,294 కోట్ల రూపాయలు, వికలాంగులకు రూ.7.61 కోట్లు కేటాయించడం జరిగింది. సమాజంలో, ఆకాశంలో సగభాగమైన మహిళలకు కేవలం రూ.1,731 కోట్లు మాత్రమే కేటాయించారు. జనాభ పరంగా చూసినట్లైతే వీరి సంక్షేమానికి కేటాయించిన నిధులు ఏమేరకూ సరిపోవు. మహిళలకు పూర్తి ప్రాధాన్యత ఇవ్వలేదని మేము భావిస్తున్నాము.

ఎస్సీ, ఎస్టీ, బీసి, ఎమ్‌బిసి, మైనారిటీ, వికలాంగులు మరియు మహిళలకు ఖర్చు చేసే విషయంలో చట్టబద్ధత లేనందునే 75 శాతం నిధులు ఖర్చు కాకపోవడం వల్ల వారికి తీరని అన్యాయం జరుగుతోంది, దీని ఫలితంగానే సామాజిక వర్గాలు మరింత పేదరికాన్ని అనుభవిస్తున్నాయి. తెలంగాణలో నూటికి 93 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసి, ఎమ్‌బిసి, మైనారిటీ, వికలాంగులు ఉన్నారు. ఈ అంశానికి ప్రాధాన్యత ఇచ్చి వీరికి జనాభా ప్రాతిపదికనే బడ్జెట్‌లో డబ్బులు కేటాయించాలని సిపిఎమ్ పార్టీ నినదించిన విధంగానే ఎస్సీ, ఎస్టీ మరియు ఎమ్‌బీసీలకు నిధులు అందించినప్పటికీ, బీసీలకు ఇంకా చేయాల్సి ఉంది. బీసిలకు సబ్ ప్లాన్‌ను ఏర్పాటు చేసి దాని ద్వారా ఖర్చు చేయాలని కోరుకుంటున్నాను. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు రూల్స్‌ని రూపొందించాలని కోరుకుంటున్నాము. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ని పోరాడి సాధించికున్నాము. ప్రస్తుతం అధికారంలో ఉన్న టిఆర్ఎస్ పార్టీ మరియు ఆనాడు అన్ని పార్టీలు ఒకే వేదికపైకి వచ్చి మహారాష్ట్ర,కర్ణాటక తరహాలోనే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ని ఉండాలని కోరడం జరిగింది. మిషన్ కాకతీయ మరియు మిషన్ భగీరథ పథకాలు ముఖ్యమైనవి. ఇరిగేషన్ డిపార్టుమెంటుకు గత బడ్జెట్‌లో రూ. 25,000 కోట్లు కేటాయించి రూ.14,000 కోట్ల పైచిలుకును మాత్రమే ఖర్చు చేశారు. ప్రస్తుత బడ్జెట్‌లో రూ. 22,000 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారు. ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణ విషయాన్ని పదే పదే చెబుతున్నప్పటికీ, కేటాయించిన నిధులను సరిగా ఖర్చు చేయకపోవడం వల్ల తీవ్రమైన అన్యాయం జరుగుతోంది. కావున, ఈ పరిస్థితిని తక్షణమే చేయాల్సిన అవసరం ఉన్నదని మనవి చేస్తున్నాను.

**2.50 మ.** భద్రాచలం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం. భద్రాచలంలో మేజర్ ఇరిగేషన్, మైనర్ ఇరిగేషన్ స్కీములు ఉన్నాయి. భద్రాచలం దుమ్ముగూడెం మండలంలో 35 నుండి 40 గిరిజన గ్రామాలు వర్షాలు లేకపోతే ఎడారిగా ఏర్పడే పరిస్థితి ఉంది. కాబట్టి, దుమ్ముగూడెం దగ్గర ప్రగడపల్లిలో గోదావరి నదిపై ఎత్తిపోతల పథకం చేపడితే ఆ గిరిజన గ్రామాలకు ఉపయోగకరంగా ఉంటుంది. చల్లవాగు చెక్ డ్యామ్‌ను 700 ఎకరాల్లో మైనర్ ఇరిగేషన్‌ను చేపడితే గొంతెండుతున్న 22 గ్రామాలకు మేలు జరుగుతుంది. ఉన్న ప్రాజెక్టు మీదే చెక్ డ్యామ్ కడితే 22 గిరిజన గ్రామాలు, 9చెరువులు నిండే పరిస్థితి ఉంది. సూరవరం లిఫ్ట్ 2012 సంవత్సరంలో కుప్పకూలిపోయింది. 7 నుండి 8 గ్రామాలకు 1000 ఎకరాల సాగుకు వచ్చే లిఫ్ట్. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి మంచినీరు ఇస్తామని అన్నారు చాలా మంచి విషయం. ఏజెన్సీ ప్రాంతాల్లో గొంతెండుతున్న పరిస్థితి ఉంది. అక్కడ ఉన్నటువంటి బోర్లు ఎండిపోయాయి, ట్యాంకర్లు పని చేయడం లేదు. ఆర్.డబ్ల్యూ.ఎస్ వాళ్లని అడిగితే వేరే స్కీముల వైపు చూపిస్తున్నారు. మీరు చేపడుతున్న స్కీములు పూర్తైయ్యే వరకు ఎండాకాలంలో మంచి నీటి గురించి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు? భద్రాచలం ముఖ్యమైన పుణ్యక్షేత్రం, అక్కడికి వేలాది మంది భక్తులు వస్తారు. 65వేల మంది జనాభా ఉన్నటువంటి భద్రాచలం టౌన్‌లో మిషన్ భగీరథ పనులు చేపడితేనే మంచినీరు వచ్చే పరిస్థితి ఉంది. భద్రాచలంలో గోదావరి నది ఉన్నప్పటికీ రెండు లేక మూడు రోజులకొకసారి కూడా నీళ్లు వచ్చే పరిస్థితి లేదు.

తెలంగాణ రాష్ట్రంలో నూటికి డెబ్బై మంది వ్యవసాయం మీద ఆధార పడి ఉన్నారు. వ్యవసాయానికి రూ.5,942కోట్లు కేటాయించారు. ప్రకృతి వైపరీత్యాలు వస్తే అందుకు సంబంధించిన నష్ట పరిహారం విషయం ఏమిటి? ఆత్మ హత్యలు చేసుకుంటున్న

రైతులకు చెల్లించే నష్టపరిహారం విషయం ఏమిటి? ఋణ విముక్తి కోసం స్వామినాథన్ కమీషన్, జయంతి ఘోష్ కమీషన్లు వేశారు. భారత దేశం మొత్తం మీద కరువుకాటకాలు వస్తే పరిష్కార మార్గమేమిటని మేధావులు చూపించిన మార్గాలను కూడా ఇప్పటి వరకు పట్టించుకోవడంలేదు. ఉమ్మడి గద్వాలలో రెండు సమావేశాల్లో చర్చ జరిగింది. ఉమ్మడి గద్వాలలో రైతులు నకిలీ విత్తనాలు వేశారు. పంట నష్టం జరిగింది. ఆ విషయమై కమిటీ వేశారు, కాని ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఈ విషయమై రెండు సమావేశాల్లో చర్చ జరిగింది. మోసపోయిన, నష్టపోయిన రైతాంగం విషయంలో ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ విషయాని స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. పప్పు ధాన్యాల విషయంలో కంది పప్పుకు సరైన గిట్టుబాటు ధర లేక కొనుగోలు పరిస్థితులు లేవు. కనుక వాటిని నియంత్రించాల్సిన అవసరం ఉంది.

తెలంగాణ రాష్ట్రంలో 10వేల చిన్న పరిశ్రమలు ఉన్నాయి. ముడి సరుకు, విద్యుత్తు బిల్లులు కట్టలేక తీవ్ర సంక్షోభంలో ఉన్నారు. నోట్ల రద్దు వలన కార్మికులందరు చాలా ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఉంది. ఐటి కంపెనీల ఏర్పాటుకు భూములను తీసుకుంటున్నారు కాని, నష్ట పరిహారం సకాలంలో చెల్లించడం లేదు. ఐటి కంపెనీల్లో స్థానికులకు ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉంది.

విద్యకు సంబంధించి ఉప ముఖ్యమంత్రి గారు వచ్చిన తర్వాత కొంత ప్రయత్నం చేస్తున్నారు. విద్యకు రూ.12,705కోట్లు కేటాయించారు. విద్యకు కేటాయించిన దానిలో సంక్షేమ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లు, బిసి వెల్ఫేర్ హాస్టళ్లకు సంబంధించిన ఉపకార వేతనాల విషయం ఏమిటి? గిరిజన ప్రాంతాల్లోని హాస్టళ్లకు వెళ్లి చూస్తే, స్వతంత్ర్యం రాక ముందు మా గిరిజనులు ఏ పళ్లెంలో అయితే తిని అదే పళ్లెంలో మంచినీళ్లు తాగారో ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉంది. ఒక దుప్పటి గాని, గ్లాసు గాని, ఒక ప్లేటు గాని ఇవ్వడం లేదు. క్రొత్తగా వచ్చిన విద్యార్థులకు ఇస్తున్నారు కాని, మూడు, నాలుగేళ్లుగా ఉన్న పాత విద్యార్థులకు ఇవ్వడం లేదు. విద్యార్థుల వసతులకు సంబంధించి కేటాయింపులు చేయాల్సి ఉంది. సన్న బియ్యం ఇవ్వడం మంచిదే కాని సౌకర్యాల విషయంలో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. మా జిల్లాలో మహిళా డిగ్రీ కాలేజి, చర్లలో ఒక డిగ్రీ కాలేజి కావాల్సి ఉంది.

ఆసుపత్రులకు రూ.5,976కోట్లు కేటాయించారు. ప్రభుత్వ ఆసుపత్రులు చాలా అధ్వాన్నంగా ఉన్నాయి. హైదరాబాదు నగరానికి మరో మూడు ఆసుపత్రులు ఏర్పాటు చేస్తామని అన్నారు. మంచిదే కాని ప్రస్తుతం ఉన్న ఉస్మానియా, గాంధీ, నీలోఫర్ ఆసుపత్రులను మెరుగు పరచండి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను కట్టండి. మా నియోజక వర్గం నుండి ఉన్న ఒక పేషెంట్‌ను చూడడానికి ఆసుపత్రికి వెళ్లినప్పుడు కనీసం నడవడానికి కూడా లేకుండా చాలా దయనీయ పరిస్థితిలో ఉంది. అదే విధంగా ఆయా ఆసుపత్రుల్లో సిబ్బందిని కూడా నియమించాల్సిన అవసరం ఉంది. ఈ విషయాల్లో పూర్తిగా వైఫల్యం చెందారని నేను భావిస్తున్నాను. వేలాది రూపాయలు ప్రైవేటు ఆసుపత్రులు చెల్లించి ప్రజలందరూ బాధ పడుతున్న పరిస్థితి ఉంది.

భద్రాచలం, వరంగల్‌లోని ఏటూరి నాగారం, అదిలాబాదులోని ఉట్నూరు మొత్తం మూడు గిరిజన ప్రాంతాల్లోని ఐ.టి.డి.ఎ. ల్లో ఐ.ఏ.ఎస్. ఆఫీసర్లు లేరు, సిబ్బంది లేరు. మా భద్రాచలం ఐ.టి.డి.ఎ.లో ఉన్న పి.ఓ గారు కలెక్టర్ అయ్యారు. అక్కడికి దరఖాస్తు ఇవ్వడానికి వస్తే తీసుకునే వాళ్లు లేరు. ఆఫీసులు మొత్తం ఈగలు, దోమలు తోలుకునే పరిస్థితిల్లో ఉన్నాయి. ఏ కష్టమొచ్చినా పరిష్కరించడానికి ఐ.టి.డి.ఎ.లను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

హరితహారం పేరుతో ఆదివాసులను, గిరిజనులను ఖాళీ చేయించకండి. తాతల తండ్రుల కాలం నుండి వ్యవసాయం చేసుకుంటూ బ్రతుకుతున్న ప్రజలను టైగర్ జోన్ అని చెప్పి వారిని అడవి నుండి తరిమే ప్రయత్నం చేస్తున్నారు. మా భద్రాచలం గిరిజన ప్రాంతాల్లోని గిరిజనులు 30 నుండి 40 సంవత్సరాలుగా వ్యవసాయ సాగు చేస్తున్నారు. గిరిజనులను తొలిగించమని ముఖ్యమంత్రి గారు శాసన సభలో చెప్పారు. కాని ఈరోజు జరుగుతున్నది ఏమిటి? బుల్డోజర్లు, యంత్రాలు పెట్టి కందకాలు త్రవ్వుతున్నారు. ఫారెస్ట్ పోలీసులు మొత్తం ఏకమై ఒక్క అడుగు ముందుకు వేస్తే కేసులు పెడుతున్నారు. ఆదివాసులను అడివి నుండి ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తున్నారు. దయ చేసి దశాబ్ద కాలం నుండి సాగు చేస్తున్న వారికి రక్షణ కల్పించండని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**3.00 మ.** స్కీమ్ వర్కర్ల గురించి బడ్జెట్‌లో ప్రస్తావనే లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల్లో మూడు లక్షల మంది, 63 స్కీమ్స్‌లో పని చేస్తున్నారు. వారికి పారితోషకాలు, కనీస వేతనాలు, వేతనాలు, హక్కులు లేనందున, ఉద్యోగులుగా వీరిని ప్రభుత్వం గుర్తించడం లేదు. ప్రభుత్వం ఇస్తున్న హామీలను కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నెరవేర్చడం లేదు. కనుక వీరు అభద్రతా భావంతో ఉన్నారు. వారికి జీతాలను రూ.2000 నుంచి రూ.3000లకు మాత్రమే పెంచారు. వారికి కనీస వేతనాలను రూ.25000లు ఉంటే

తప్ప, ప్రస్తుతమున్న ధరలకు వారు బ్రతకగలరు. కనుక వీటిని అమలుచేయాల్సిన అవసరముంది.

సింగరేణి సంస్థలో 25వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. కాని ముఖ్యమంత్రి గారు ఇలాంటివారు లేరన్నారు. 24వేల మందికి వారసత్వ ఉద్యోగాలు ఇస్తున్నందుకు సంతోషం. కాని 25వేల మంది వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారు అభద్రతా భావంతో వీదుల్లోకి వచ్చి సమ్మెలు, ధర్నాలు, చేసే అవకాశం ఉంది. కనుక 25వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల్ని రెగ్యులరైజ్ చేయండి. లేదంటే కనీస వేతనాలు ఇవ్వమని కోరుతున్నాను.

హైదరాబాద్‌లో గల మున్సిపల్‌కార్పొరేషన్ల ఉద్యోగుల వేతనాలు పెంచారు. కాని పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో గల మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచలేదు. గతంలో సమ్మె జరిగినప్పుడు హోం శాఖ మంత్రి గారు, పంచాయతీ రాజ్ శాఖను పర్యవేక్షిస్తున్న కె.టి.ఆర్ గారు వారితో చర్చించి వేతనాల గురించి ఆలోచిస్తామని హామి ఇచ్చారు. కాని రెండు సంవత్సరాలు పూర్తవుతోంది. వీరికి కనీస వేతనాలు ఇవ్వవలసిన అవసరం ఉందని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

డి.ఎస్.సిలో 1999వ సంవత్సరంలో అర్హత పొందిన అభ్యర్థులు ఉన్నారు. వారు ఇంతవరకు ఏ ప్రభుత్వం ఉన్నా వారందరి వద్దకు చెప్పులరిగినట్టు తిరిగినా కూడా ఎటువంటి సమాధానం రాలేదు. సంగారెడ్డి జిల్లాలో ఇరిగేషన్ కళాశాలలో అర్హత పొందిన ఇంజనీర్లు 1200మంది ఉన్నారు. వారందర్నీ కూడా తీసుకోవలసిన అవసరం ఉంది. ఏజెన్సీ ఏరియాలో స్పెషల్ డి.ఎస్.సిని పెట్టండి. సుమారు మూడు సంవత్సరాల కాలంలో ఒక ఉద్యోగం కూడా ఎవరికీ ఇవ్వలేదు. గిరిజన విద్యా సంస్థల్లో కళాశాలల్లో పని చేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయాలని, ఆసియా ఖండంలో గల భద్రాచలం బి.ఇడి కళాశాలలో రూ.17000 మాత్రమే వేతనంగా చెల్లిస్తున్నారు. వారు పది నుంచి ఇరవై సంవత్సరాలుగా కాంట్రాక్టు లెక్చరర్లుగా, టీచర్లుగా పని చేస్తున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారికి రూ. 30000 నుంచి 35000 వరకు పెంచాలని కోరుతున్నాను.

బడ్జెట్‌లో డబుల్ బెడ్ రూమ్‌ల గురించిన ప్రస్తావనే లేదు. గ్రామాల్లో, పట్టణాల్లో డబుల్ బెడ్‌రూమ్‌ల అవసరం చాలా ఉంది. చాలా మంది వీటికోసం ఎదురు చూస్తున్నారు. గతంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న ప్రజలు, గ్రామ గ్రామాన మారు మూల ప్రాంతాల వారు ఇళ్లు కట్టుకున్న వాటికి బిల్లులు రాలేదని అంటున్నారు. పేదలు బిల్లులు వస్తాయన్న ఆశతో, నమ్మకంతో ఇళ్లను నిర్మించుకున్నారు. కనుక వీరందరికీ బిల్లులు శాంక్షన్ చేయాలని కోరుతున్నాను.

దళితులకు మూడెకరాల భూమి విషయం ఎండమావిలా ఉందని తెలియజేస్తున్నాను. వేల సంఖ్యలో వీటిని ఇస్తున్నట్టు చూపించారు. దళితులకు మూడెకరాల భుమిని తక్షణమే ఇవ్వాలని కోరుతున్నాను. పోడు భూముల ప్రస్థావనే రాలేదు.

బడ్జెట్ ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలని కోరుతున్నాను. బడ్జెట్ ప్రజావసరాలకు అనుగుణంగా ఉండాలి తప్ప, కొన్ని రంగాలకు, కొన్ని ప్రాంతాలకే కేటాయించే విధంగా ఉండకూడదని, తెలంగాణ రాష్ట్రంలోని మూడు కోట్ల యాభైలక్షల మంది ప్రజలకి అన్ని తరగతుల, అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగుడే విధంగా ఉండాలని కోరుతున్నాను. కాగితాలకే అభివృద్ధి పరిమితం కాకుండా ఆచరణ యోగ్యంగా ఉండాలని, ప్రభుత్వం చిత్తశుద్ధితో అన్ని అంశాలను అమలు చేయాలని కోరుతున్నాను.

ఎస్.సి, ఎస్.టి సబ్ ప్లాన్‌కు రూల్స్ ఫ్రేమ్ చేయాలి. బి.సి సబ్ ప్లాన్‌ని చేయాలని కోరుతున్నాను. నూటికి యాభైరెండు నుంచి యాభై మూడు శాతం ఉన్న బి.సిలకు, ఎమ్.బి.సిల్లో పేదలు ఉన్నారు. అదే విధంగా చాలా చోట్ల ధోబి ఘాట్లు లేని ప్రాంతాలు ఉన్నాయి. భద్రాచలం ప్రాంతంలో ఐదు సంవత్సరాల పూర్వం కట్టిన ధోబి ఘాట్లు ఉన్నాయి. అదే విధంగా అన్ని విషయాలపై నిధులు రెట్టింపు చేసి, బడ్జెట్‌ను అన్ని ప్రాంతాలకు విస్తరించే విధంగా చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

MADAM DEPUTY SPEAKER:- The House is adjourned to meet again at 10.00 A.M. tomorrow.

(The House is then adjourned at 03.06 P.M. to meet again at 10.00 A.M. on Friday, the 17th March, 2017).

**“Published under Rule 347 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Assembly and Printed at Assembly Press, Public Gardens, Hyderabad.”**